www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 29-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 60

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: తదియ రా.11.19 తదుపరి చవితి; నక్షత్రం: ఆర్ద్ర రా.10.39 తదుపరి పునర్వసు; వర్జ్యం: ఉ.8.14-9.43; దుర్ముహూర్తం: ఉ.10.03-10.54, మ.3.14-4.05; అమృతఘడియలు: మ.1.24-2.53; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.41

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఫ్రెషర్స్ ఆశలపై ఏఐ నీళ్లు!



కృత్రిమమేథతో తగ్గుతున్న కొత్త పట్టభద్రుల నియామకాలు

2019తో పోలిస్తే 2024కి 50 శాతానికి పైగా తగ్గుదల

దిగ్గజ కంపెనీల్లో 15 % నుంచి 7 శాతానికి తగ్గుముఖం

స్టార్టప్ సంస్థల్లో ఏకంగా 30 శాతం నుంచి 6 శాతానికి

ఏఐ నైపుణ్యాలు పెంచుకుంటే మాత్రం బోలెడు కొలువులు

వెంచర్ క్యాపిటల్ సంస్థ 'సిగ్నల్‌ఫైర్' నివేదిక 2

మరీ అలా నిజాలు చెప్పొద్దు!

సుప్రీంకోర్టు జడ్జీల ఈగో దెబ్బతింటుంది

మెరిట్స్‌తో సంబంధం లేకుండానే మీ కేసు ముగిసిపోతుంది

చిన్న చిన్న అబద్ధాలు చెప్పొచ్చు

ఓ జూనియర్ లాయర్‌తో సుప్రీం జడ్జి

జస్టిస్ సంజయ్‌కుమార్ సరదా వ్యాఖ్యలు

సీనియర్ లాయర్ మరో కోర్టులో బిజీగా ఉన్నారనడంపై న్యాయమూర్తి స్పందన

న్యూఢిల్లీ, మే 28: మరీ నిజాయతీగా ఉంటే కష్టమని, పెద్దగా తప్పు లేని చిన్న చిన్న అబద్ధాలు ఆడొచ్చని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ సరదాగా వ్యాఖ్యానించారు. లేకుంటే జడ్జీల ఈగో దెబ్బతిని.. మీ కేసు కథ ముగిసిపోతుందని పేర్కొన్నారు. బుధవారం జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం

మిగతా 2వ పేజీలో...



జస్టిస్ సంజయ్‌కుమార్



పౌరులకు ఆయుధాలు!

అసోం ప్రభుత్వ సంచలన నిర్ణయం

బంగ్లాదేశీలు, అక్రమ వలసదారుల నుంచి 'స్వదేశీ పౌరుల' రక్షణకు ఆయుధ లైసెన్సుల మంజూరు

జారీ చేసే అధికారం జిల్లా అధికారులకు 2

అన్నదాతకు మద్దతు!



వరి సహా 14 పంటలకు కనీస మద్దతు ధర పెంపు



ధాన్యానికి రూ.69, పెసలకు 86, పత్తికి 589, ఆవాలకు 820 పెంపు

ఖరీఫ్ సీజన్ నుంచే అమలు

స్వల్పకాలిక రుణాలు కొనసాగింపు

కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు

ఖర్చుకు, మద్దతుకు పొంతనే లేదు: రైతు సంఘాలు

అమరావతి/న్యూఢిల్లీ, మే 28(ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరలను(ఎంఎస్‌పీ) పెంచుతూ కేంద్ర మంత్రి వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. వరి, పప్పుధాన్యాలు, నూనె గింజలు సహా మొత్తం 14 రకాల ఉత్పత్తులకు మద్దతు ధరలను పెంచింది. వరికి 3 శాతం, పప్పుధాన్యాలు 5.96 శాతం, నూనె గింజలకు 9 శాతం చొప్పున ఎంఎస్‌పీ పెరగనుంది. పెంచిన ధరలు 2025-26 ఖరీఫ్

మిగతా 2వ పేజీలో...

ఆరుగురు ఎమ్మెల్యేలను తెస్తా..



మంత్రి పదవి ఇస్తారా?

కాంగ్రెస్ అధిష్ఠానానికి కవిత ప్రతిపాదన.. టీపీసీసీ సుముఖత

గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేందుకు సిద్ధమైన హైకమాండ్

రేవంత్ సన్నిహితుల వ్యతిరేకతతో బ్రేక్

'ఆంధ్రజ్యోతి'కి అందిన పక్కా సమాచారం

జర్నలిజం కాదు శాడిజం అని కవిత రుసరుస

కొంతకాలంగా బీఆర్ఎస్ లైన్‌కు భిన్నంగా వైఖరి

జైలు నుంచి బయటకొచ్చాక స్వరంలో మార్పు

'సామాజిక తెలంగాణ' రాలేదంటూ గత కేసీఆర్ పాలనకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు

పర్యటనలతో సొంత అడుగులు నిజం కాదా?

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత.. కాంగ్రెస్‌లో చేరేందుకు ఆ పార్టీతో రాయబారం నెరపిన అంశానికి సంబంధించి మరింత సమాచారం వెలుగులోకి వచ్చింది. కాంగ్రెస్‌లో తాను చేరడంతోపాటు, "బీఆర్ఎస్ నుంచి ఆరుగురు ఎమ్మెల్యేలను తీసుకొని వస్తా. నాకు మంత్రి పదవి ఇస్తారా?" అని కాంగ్రెస్ అధిష్ఠానం ముందు కవిత ప్రతిపాదన పెట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇందుకు సంబంధించి 'ఆంధ్రజ్యోతి'కి పక్కాగా సమాచారం అందింది. కాంగ్రెస్ అధిష్ఠానం ముందు తన ప్రతిపాదనను పెట్టి చర్చించే విధంగా పావులు కదిపారు. మంత్రి పదవికి సంబంధించి తన అభిమతాన్ని కాంగ్రెస్ పెద్దల ముందు ఉంచారు. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు సిద్ధమైందని తెలిసింది. టీపీసీసీ స్థాయిలో కవిత చేరికపై సుముఖత కూడా వ్యక్తమైంది. ఈ మేరకు అధిష్ఠానానికి సమాచారం

మిగతా 13వ పేజీలో...



బిడ్డ ఓడిపోతే ఆర్నెల్లలోనే ఎమ్మెల్సీని చేశారు

దళితులు, బీసీలకు ఉద్యోగాలు అక్కర్లేదా?

బర్రెలు, గొర్రెలు పెంచుకుంటూ బతకాలా?

మాజీ సీఎం అలాంటి పథకాలే పెట్టారు

ఆయన కుటుంబ సభ్యులకే ఉద్యోగాలిచ్చారు

కులం వల్ల గుర్తింపు రాదు..

చదువుతోనే వస్తుంది: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 13

ఏది పడితే అది మాట్లాడితే ఎలా!

ఎమ్మెల్సీ కవిత అంశంపై ఏవేవో వ్యాఖ్యలు చేశారు

మీ సొంత అజెండాను పార్టీ అజెండాగా రుద్దొద్దు

జాతీయ పార్టీలో ఉన్నామన్న విషయాన్ని మర్చిపోతున్నారా?

ఏ స్థాయి నాయకులైనా పార్టీ లైన్‌కు తగినట్టే మాట్లాడాలి

ఎంపీ రఘునందన్ వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావిస్తూ బీజేపీ నేతలకు కిషన్‌రెడ్డి క్లాస్



హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఏ స్థాయి నాయకులైనా సరే పార్టీ విధానాలకు అనుగుణంగానే మాట్లాడాలని.. సొంత అజెండాను పార్టీ అజెండాతో ముడిపెట్టవద్దని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ ఎజెండా ప్రకారం మాట్లాడాలే తప్ప, సొంత అజెండాలు పనిచేయబోవని.. ఏదైనా ఒక అంశంపై ముందుగా పార్టీలో చర్చించుకున్నాకే మాట్లాడాలని తేల్చిచెప్పారు. ఢిల్లీలో ఉన్న కిషన్‌రెడ్డి దీనికి సంబంధించి తాజాగా రాష్ట్ర పార్టీ ముఖ్యులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒక అంశంపై ఇద్దరు, ముగ్గురు నాయకులు వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేయడం సరికాదని స్పష్టం చేశారు. వాస్తవానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు లేఖ రాయడం, కాళేశ్వరం విచారణ కమిషన్ ఇటీవల ఎంపీ ఈటల రాజేందర్‌కు కూడా నోటీసులు జారీ చేయడంపై రాష్ట్ర బీజేపీ నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. వచ్చే నెల 2న కవిత కొత్తపార్టీ పెట్టబోతున్నారంటూ ఎంపీ రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. మరోవైపు కవిత కాంగ్రెస్‌లో చేరుతారంటూ కొందరు నేతలు మాట్లాడారు. దీనిపై రాష్ట్ర పార్టీ ముఖ్యుల నుంచి జాతీయ నాయకత్వానికి ఫిర్యాదు వెళ్లినట్టు తెలిసింది. 'అసలు పార్టీ లైన్ ఏమిటో తెలియక తర్జనభర్జన పడుతున్నాం. సున్నితమైన అంశాలపై పార్టీ లైన్‌లోనే మాట్లాడితే బాగుంటుంది..' అని వారు

మిగతా 13వ పేజీలో...



రాజ్యసభకు కమల్ హాసన్!

మక్కల్ నీది మయ్యం పార్టీకి ఒక సీటు కేటాయించిన డీఎంకే 2



హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా అపరేశ్ కుమార్ సింగ్

జస్టిస్ వినోద్‌కుమార్ మద్రాస్ హైకోర్టుకు

కేంద్రానికి సుప్రీం కొలీజియం సిఫారసులు

ప్రస్తుతం త్రిపుర సీజేగా బాధ్యతలు నిర్వహిస్తున్న జస్టిస్ అపరేశ్ సింగ్ 12

న్యాయమూర్తుల కుటుంబ నేపథ్యం

ఆయన తాత బీపీ సిన్హా ఆరో సీజేఐ

పంట నష్ట పరిహారం రూ. 51.52 కోట్లు!

రాష్ట్రంలో 51,528 ఎకరాల్లో దెబ్బతిన్న పంట

ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం

మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం 13

ఏపీ థియేటర్లలో తనిఖీలు

కృష్ణాలో మంచినీటి బాటిల్ రూ. 50కి విక్రయం

'తూర్పు'లోని హాళ్లలో అధ్వానంగా పారిశుధ్యం

విజయనగరంలోని థియేటర్‌లో చిప్స్ ప్యాకెట్‌పై తయారీ తేదీ జూన్ 1గా ముద్రణ.. నిలదీసిన జేసీ

చిత్తూరులో లైసెన్స్ లేకుండా నడుస్తున్న థియేటర్

పలుచోట్ల టికెట్ కన్నా పాప్‌కార్న్ ధరే ఎక్కువ

యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసిన అధికార్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఏపీవ్యాప్తంగా సినిమా థియేటర్లలో మంగళవారం మొదలైన తనిఖీలు బుధవారం మరింత విస్తృతంగా కొనసాగాయి. రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. గుంటూరు జిల్లాలోని కొన్ని థియేటర్ల వద్ద తగినంత పార్కింగ్

మిగతా 13వ పేజీలో...

బంద్ చేయాలన్నది దిల్‌రాజు సోదరుడే

హరిహర వీరమల్లుపై కుట్రతోనే వివాదం 13

'ఆ నలుగురు'.. దిల్‌రాజు, శిరీష్, సురేశ్‌బాబు, సునీల్

పవన్.. దేవుడితో సమానం

అనుశ్రీ సత్యనారాయణ



టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన అనంతరం ప్రమాణం చేస్తున్న చంద్రబాబు

రెండు రాష్ట్రాలూ నాకు సమానమే

తెలంగాణ ప్రాజెక్టులకు మేం అభ్యంతరం చెప్పలేదు

సముద్రంలోకి పోయే నీటిని వాడుకుంటే తెలంగాణకూ లాభమే

2027కి పోలవరం పూర్తి.. టీడీపీకి ధర్మకర్తను మాత్రమే!

భావి నాయకత్వాన్ని సిద్ధం చేస్తున్నాం: మహానాడులో చంద్రబాబు

తెలంగాణలో ముక్కోడు, ఏపీలో తిక్కోడు పోయారు: నన్నూరి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు రెండూ తనకు సమానమేనని.. రెండూ అభివృద్ధి చెందాలన్నదే తన ఆశ అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరిపై తెలంగాణ ప్రాజెక్టులు కడితే తామెప్పుడూ అభ్యంతరం చెప్పలేదని ఆయన గుర్తుచేశారు. "పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా ఏపీలోని అన్ని ప్రాంతాలకూ నీరిచ్చేలా కార్యాచరణ రూపొందించాం. పోలవరం నుంచి కృష్ణానదికి.. అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు.. అక్కడి నుంచి

మిగతా 3వ పేజీలో...

దేశవ్యాప్తంగా ఆస్తుల రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్‌లో!

కొత్త చట్టం తీసుకురానున్న కేంద్ర ప్రభుత్వం

ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణ

భూములు, ఇతర ఆస్తుల నమోదు ఇకపై సులువు



న్యూఢిల్లీ, మే 28 : భూములు, ఇతర ఆస్తులు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత పారదర్శకం, సులభతరం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను అందుబాటులోకి తీసుకురానుంది. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని అమలు చేయనుంది. ఇందుకోసం 117 ఏళ్లుగా అమలులో ఉన్న రిజిస్ట్రేషన్ చట్టం స్థానంలో ఓ కొత్త చట్టాన్ని తీసుకురాబోతుంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను అమలు చేసేందుకు వీలుగా కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రస్తుత మున్న రిజిస్ట్రేషన్ చట్టంలో మార్పులు చేసుకుంటున్న నేపథ్యంలో

మిగతా 2వ పేజీలో...



ఆర్జీయూకేటీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

31వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఈ ఏడాది మహబూబ్‌నగర్‌లో కొత్త క్యాంపస్ 13

అంతర్రాష్ట్ర శిశు విక్రయ ముఠాకు బేడీలు

13 మంది ముఠా సభ్యుల అరెస్టు

28 మంది శిశువులను విక్రయించిన గ్యాంగ్

10 మందిని కాపాడిన సూర్యాపేట పోలీసులు

నల్లగొండ శిశువిహార్‌కు తరలింపు

అల్లారుముద్దుగా చూసుకున్నామంటూ.. పెంచుకున్న తల్లిదండ్రుల ఆందోళన 14



వరి నాట్ల సమయానికి 'రైతు భరోసా'

అత్యధిక ధాన్యం పండించే రాష్ట్రంగా తెలంగాణ 13

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఎవరెవరి భూమి ఎక్కడెక్కడ?

భూభారతి సర్వే ప్రారంభించిన ఏజెన్సీలు

ఆధునిక డ్రోన్లతో సాగు భూముల కొలతలు

పక్కాగా హద్దుల నిర్ధారణకు 2 రకాల సర్వే

డ్రోన్లు, డీజీపీఎస్ వినియోగం

అన్నీ తేల్చాకే నక్ష మ్యాపుల తయారీ

75 ఏళ్ల నాటి టీపన్ నక్షాకు ఇక స్వస్తి

పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో హద్దుల గుర్తింపు 14



సంగారెడ్డి జిల్లా షాహెద్ నగర్‌లో డ్రోన్‌తో భూమి కొలత

ఫ్రెషర్స్ ఆశలపై ఏఐ నీళ్లు!



- కృత్రిమమేధ దెబ్బకు తగ్గుతున్న కొత్త పట్టభద్రుల నియామకాలు
- వెంచర్ క్యాపిటల్ సంస్థ 'సిగ్నల్‌ఫైర్' తాజా నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, మే 28: కృత్రిమ మేధ దెబ్బకు ఉద్యోగాలు భారీగా పోతాయని అంతా ముందు నుంచీ ఊహిస్తున్నదే. కానీ.. ఏ స్థాయిలో? అని ప్రశ్నిస్తే.. అంచనాలే తప్ప వాస్తవ గణాంకాలేవీ అందుబాటులో లేవు. తాజాగా 'సిగ్నల్‌ఫైర్' అనే వెంచర్ క్యాపిటల్ సంస్థ ఆ గణాంకాలను వెల్లడించింది. 2019తో పోలిస్తే.. పెద్ద పెద్ద టెక్ కంపెనీల్లో ఫ్రెషర్స్ నియామకాలు 2024 నాటికి 50 శాతానికిపైగా తగ్గిపోయినట్టు ఆ సంస్థ ఒక నివేదికలో వెల్లడించింది. ఒకప్పుడు దిగ్గజ టెక్ సంస్థల్లో ఏటా జరిపే నియామకాల్లో 15% దాకా అప్పుడే డిగ్రీ/పీజీ పూర్తిచేసిన యువత ఉండేవారని.. ఇప్పుడు వారి వాటా 7 శాతానికి తగ్గిపోయిందని సిగ్నల్‌ఫైర్ వెల్లడించింది. స్టార్టప్‌లలో వీరి వాటా 2019 నాటికి 30 శాతానికిపైగా ఉండేదని.. 2023 నాటికి 11 శాతానికి, 2024 నాటికి 6 శాతానికి తగ్గిపోయినట్టు వివరించింది. ప్రపంచంలోనే టాప్-7 కంపెనీలుగా పేరున్న అల్ఫాబెట్ (గూగుల్ మాతృసంస్థ), అమెజాన్, యాపిల్, మెటా (ఫేస్‌బుక్ మాతృసంస్థ), మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, టెస్లా వంటివి సైతం.. 2022తో పోలిస్తే ఫ్రెషర్స్ నియామకాలను 2024లో సగానికిపైగా తగ్గించినట్టు తెలిపింది. కృత్రిమ మేధ పరిధి, స్థాయి నానాటికీ విస్తరించడం, జూనియర్ స్థాయి ఉద్యోగులు చేయగల పనులన్నింటినీ ఏఐ చాలా సులువుగా చేసేయగలుగుతుండడం.. అదే సమయంలో కంపెనీ బడ్జెట్ నిర్వహణ కష్టమవుతుండడంతో కంపెనీలు కొత్త పట్టభద్రుల నియామకాలను తగ్గించుకోవడంపై దృష్టిసారించాయని సిగ్నల్‌ఫైర్ విశ్లేషించింది. ప్రవేశస్థాయి ఉద్యోగాలే కాదు. మధ్యస్థాయి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు చేయగలిగే పనిని సైతం ఏఐ చేయగలుగుతోందని మెటా సీఈవో మార్క్ జుకెర్‌బెర్గ్ ఇటీవలే వెల్లడించారు. ప్రస్తుతం తాము అభివృద్ధి చేస్తున్న 'లామా' ఏఐ వంటి మేజర్ ప్రాజెక్టుల కోడింగ్‌ను సైతం కృత్రిమ మేధ ఏడాది-రెండేళ్లలో సొంతంగా రాసేయగలదని ఆయన అంచనా వేశారు. ఇక.. తమ కోడింగ్‌లో 30% పనిని ప్రస్తుతం కృత్రిమ మేధే చేస్తోందని గూగుల్ సీఈవో సుందర్‌పిచాయ్ ఈ మధ్యే ప్రకటించిన సంగతి తెలిసిందే. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల సైతం.. తమ కోడింగ్ పనిలో 30% కృత్రిమమేధే చేస్తోందని, తమ కంపెనీకి సంబంధించిన కొన్ని అంతర్గత ప్రాజెక్టులను సైతం ఏఐ ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా పూర్తిస్థాయిలో చేపడుతోందని చెప్పారు. ఐబీఎం కంపెనీ ఏఐని వాడడం మొదలుపెట్టాక 8 వేల మంది ఉద్యోగులను తొలగించింది. ఇలా పెద్ద, చిన్న తేడా లేకుండా అన్ని కంపెనీలూ ఏఐపై ఆధారపడడం నానాటికీ పెరుగుతుండడంతో ఆ ప్రభావం ఉద్యోగాలపై భారీగా పెరుగుతోంది. మరీ ముఖ్యంగా ఫ్రెషర్స్‌పై పడుతోంది. అలాగని టెక్ రంగంలో ఉద్యోగాలు తగ్గిపోతున్నాయా అంటే.. తగ్గట్లేదు సరికదా పెరుగుతున్నాయని, నేరుగా టెక్ కంపెనీల్లో కాకుండా ఆరోగ్యసంరక్షణ, బ్యాంకింగ్, రిటైల్ రంగాల్లో టెకీలకు ఉద్యోగాలు పెరుగుతున్నాయని సిగ్నల్‌ఫైర్ తన నివేదికలో వివరించింది. కాకపోతే ఆ ఉద్యోగాలు సాధించాలంటే కృత్రిమమేధకు సంబంధించిన నైపుణ్యాలు అవసరమని స్పష్టం చేసింది. అమెరికాలో ఈ ట్రెండ్ ఇప్పటికే జోరందుకుంది. 'ఏఐ' నైపుణ్యాలున్నవారినే ఉద్యోగాల్లోకి తీసుకోవడం పెరుగుతోందని.. ప్రతి నాలుగు ఉద్యోగ ప్రకటనల్లో ఒకటి కృత్రిమ మేధ నైపుణ్యాలను తప్పనిసరిగా పేర్కొంటోందని 'వాల్ స్ట్రీట్ జర్నల్' చేసిన సర్వేలో వెల్లడైంది. కాబట్టి.. కొత్తగా డిగ్రీ/పీజీ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నవారు ఏఐ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని టెక్ పరిశ్రమ నిపుణులు సూచిస్తున్నారు.

లోకం తీరు



విదేశాలకు వెళ్లే 'చదువు' సొమ్ము తగ్గుతోంది!

- భారత విద్యార్థుల ఆలోచనా విధానంలో మార్పు
- యూఎస్, కెనడాలకు బదులు కాస్త ఖర్చు తక్కువగా ఉండే దేశాలపై ఫోకస్
- రిజర్వు బ్యాంకు గణాంకాల్లో వెల్లడి

న్యూఢిల్లీ, మే 28: విదేశాల్లో భారతీయ విద్యార్థుల చదువు కోసం ఇక్కడి నుంచి తరలిపోయే సొమ్ము (ఔట్‌వార్డ్ రెమిటెన్సెస్) ఏటేటా తగ్గుతోంది. రిజర్వుబ్యాంకు గణాంకాల ప్రకారం.. 2022-23లో ఇలా తరలిన రెమిటెన్సులు రూ.44 వేలకోట్లు (5.16 బిలియన్ డాలర్లు) కాగా.. 2024-25లో సుమారు రూ.25 వేల కోట్లు (2.91 బిలియన్ డాలర్లు) మాత్రమే. విదేశాల్లో చదువు పట్ల భారతీయ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల దృక్పథంలో మార్పు రావడమే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు. అత్యంత ఎక్కువ ఖర్చయ్యే యూఎస్‌ఏ, కెనడా, యూకే వంటి దేశాల నుంచి.. తక్కువ వ్యయంతోనే నాణ్యమైన విద్య అందించే జర్మనీ, రష్యా వంటి దేశాలవైపు ఫోకస్ పెరుగుతోంది. అదే సమయంలో మన విద్యార్థులు ఆయా దేశాల్లో తాత్కాలిక ఉద్యోగాలు, ఇతర వ్యాపకాల ద్వారా ఖర్చులు వెళ్లదీసుకుంటుండటం.. అక్కడి వర్సిటీలు, విద్యాసంస్థల నుంచి స్కాలర్‌షిప్‌లు పొందడం.. విద్యాసంస్థల తోడ్పాటుతో ఆ దేశాల్లోనే రుణాలు పొందుతుండటం.. భారత్‌లో నాణ్యమైన విద్య అవకాశాలు పెరుగుతుండటంతో విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గడం వంటివి కూడా మన దేశం నుంచి 'ఔట్‌వార్డ్ రెమిటెన్సులు' తగ్గడానికి కారణం. ఉదాహరణకు చూస్తే.. 2023లో కెనడాకు వెళ్లిన భారతీయ విద్యార్థులు 2,33,532 అయితే.. 2024లో 1,37,608 మందికి తగ్గిపోయింది. ఇదే సమయంలో జర్మనీ, రష్యాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య పెరిగింది.

తమిళం నుంచి కన్నడ పుట్టింది

- కమల్‌హాసన్ వ్యాఖ్య.. కన్నడిగుల మండిపాటు



చెన్నై, మే 28 (ఆంధ్రజ్యోతి): సినిమా కార్యక్రమంలో ప్రముఖ నటుడు కమల్‌హాసన్ 'తమిళం నుంచి కన్నడ పుట్టింది' అని చేసిన వ్యాఖ్యలపై వివాదం చెలరేగింది. తమ భాషను తక్కువ చేశారంటూ కమల్‌పై కన్నడిగులు మండిపడుతున్నారు. త్వరలో విడుదల కాబోయే ఆయన నటించిన సినిమా 'థగ్ లైఫ్'ను బ్యాన్ చేయాలి అంటూ డిమాండ్ చేస్తున్నారు. కమల్ వ్యాఖ్యలపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా స్పందించారు. కన్నడకు ఎంతో ఘన చరిత్ర ఉందని, అది ఆయనకు తెలిసుండదు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిరత్నం దర్శకత్వంలో చాలాకాలం తర్వాత కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ సినిమా జూన్ 5న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చెన్నైలో ఇటీవల ప్రమోషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కమల్, కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమల్‌హాసన్ మాట్లాడుతూ.. "కర్ణాటకలోని అగ్రనటుడు శివరాజ్ కుమార్ ఫ్యామిలీ కూడా నా కుటుంబం లాంటిదే. నా కోసమే శివరాజ్‌కుమార్ ఈ కార్యక్రమానికి వచ్చారు. తమిళం నుంచి కన్నడం పుట్టింది. అందుకే మీరు (శివరాజ్‌కుమార్) ఇక్కడకు వచ్చారు" అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై కన్నడ నాట విమర్శలు వెల్లువెత్తాయి. ఆయన క్షమాపణ చెప్పాలంటూ పలువురు డిమాండ్ చేస్తున్నారు. కన్నడ రక్షణ వేదిక అధ్యక్షుడు ప్రవీణ్ షెట్టి స్పందిస్తూ.. 'మీ చిత్రాలకు కన్నడంలో వ్యాపారం కావాలి.. కానీ, మా భాషను తక్కువ చేసి మాట్లాడతారా?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా పలువురు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాగా, తన వ్యాఖ్యలపై వివాదం రేగడంపై కమల్ స్పందించారు. ప్రేమతో మాట్లాడిన దానికి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. తిరువనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భాషల చరిత్ర గురించి తనకు చాలామంది చరిత్రకారులు చెప్పారని, తాను చెప్పిందంతా ప్రేమతోనే చెప్పానని తెలిపారు. ఎవరినీ కించపరిచే ఉద్దేశంతో మాట్లాడలేదన్నారు. తనతో పాటు రాజకీయ నాయకులు ఎవరికీ భాషలపై మాట్లాడే నైపుణ్యం ఉండదన్నారు. భాషలపై లోతుగా చర్చించేందుకు ఆ విషయాన్ని చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు, భాషా నిపుణులకు వదిలివేద్దాం అని కమల్ పేర్కొన్నారు.

రాజ్యసభకు కమల్‌హాసన్!

చెన్నై, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) అధినేత కమల్ హాసన్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కానున్నారు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు డీఎంకేతో కుదిరిన ఒప్పందంలో భాగంగా మిత్రపక్షం ఎంఎన్‌ఎం పార్టీకి రాజ్యసభ సీటు దక్కనుంది. రాజ్యసభ సీట్లపై డీఎంకే బుధవారం ఓ ప్రకటన చేసింది. రాష్ట్రం నుంచి ఆరు రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతుండగా, వాటిలో ఒక సీటును ఎంఎన్‌ఎంకు కేటాయించింది. ఈ సీటులో కమల్ హాసన్ పోటీ చేయనున్నారు. కాగా మూడు సీట్లకు అభ్యర్థులను డీఎంకే ప్రకటించింది.

అమెరికాలో విలీనమైతే కెనడాకు 'గోల్డెన్ డోమ్' ఉచితం: ట్రంప్

వాషింగ్టన్, మే 28: అమెరికాలో విలీనం కావడానికి కెనడా అంగీకరిస్తే.. తమ గోల్డెన్ డోమ్ క్షిపణి రక్షణ వ్యవస్థలో ఉచితంగా చేరవచ్చని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. లేకపోతే ఈ వ్యవస్థలో భాగం కావడానికి కెనడాకు 61 బిలియన్ డాలర్లు ఖర్చవుతుందని సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్‌లో మంగళవారం ఆయన పేర్కొన్నారు. అమెరికా గగనతలంలోకి శత్రుదేశాల క్షిపణులు ప్రవేశించకుండా 75 బిలియన్ డాలర్ల వ్యయంతో 2029 చివరి నాటికి గోల్డెన్ డోమ్ రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ట్రంప్ ఇటీవల ప్రకటించారు. ఈ వ్యవస్థలో చేరడానికి కెనడా ఆసక్తి కనబర్చిన నేపథ్యంలో ట్రంప్ స్పందించారు.

కుమారుడికి సీటివ్వలేదనే హార్వర్డ్‌పై ట్రంప్ కక్ష?

- నెటిజన్ల ఆరోపణలు

వాషింగ్టన్, మే 28: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిన్న కుమారుడు బారన్‌కు సీటు ఇవ్వడానికి నిరాకరించినందుకే హార్వర్డ్ యూనివర్సిటీపై కక్ష సాధిస్తున్నారని పలువురు నెటిజన్లు ఆరోపిస్తున్నారు. హార్వర్డ్‌తో పాటు కొలంబియా, స్టాన్‌ఫోర్డ్ వర్సిటీల్లోనూ సీటు దక్కకపోవడంతో న్యూయార్క్ యూనివర్సిటీకి చెందిన స్టెర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఫైనాన్స్ కోర్సు చదవడానికి బారన్ అడ్మిషన్ తీసుకున్నాడంటూ పోస్టులు పెడుతున్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా కుమార్తె మలియాకు 2017లో హార్వర్డ్ వర్సిటీలో సీటు లభించినా, బారన్‌కు మాత్రం సీటు దక్కలేదు. దీనిపై ఆగ్రహంతో ఉన్న ట్రంప్ హార్వర్డ్ వర్సిటీని టార్గెట్ చేశారని మరికొందరు విమర్శిస్తున్నారు. కాగా, అసలు హార్వర్డ్‌లో సీటు కోసం బారన్ ఎప్పుడూ దరఖాస్తు చేయనేలేదని ట్రంప్ సతీమణి మెలానియా ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

హమాస్ గాజా చీఫ్ హతం

- మహ్మద్ సిన్వర్‌ను మా ఆర్మీ మట్టుబెట్టింది: ఇజ్రాయెల్

టెల్ అవీవ్, మే 28: హమాస్ గాజా చీఫ్ మహ్మద్ సిన్వర్‌ను హతమార్చినట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. మే 14న ఇజ్రాయెల్ బలగాలు గాజాలో జరిపిన వైమానిక దాడుల్లో సిన్వర్ మృతి చెందాడని కథనాలు వెలువడ్డాయి. ఖాన్ యూనిస్‌లోని యూరోపియన్ ఆస్పత్రి కింది భాగంలో కమాండ్ సెంటర్‌లో ఉండగా సిన్వర్‌ను డ్రోన్ దాడితో హతమార్చినట్లు ఇజ్రాయెల్ బలగాలు తెలిపాయి. దీనికి సంబంధించి ఓ వీడియోను విడుదల చేశాయి. ఆస్పత్రి కింది భాగంలో సొరంగం ఉన్నట్లు వీడియోలో చూపారు. గతంలో ఇస్మాయిల్ హన్యా, మహ్మద్ డెయిఫ్, యాహ్యా సిన్వర్‌ను హతమార్చినట్లే తాజాగా మహ్మద్ సిన్వర్‌ను మట్టుబెట్టినట్లు నెతన్యాహు పార్లమెంట్‌లో ప్రకటించారు. 2023 దాడులకు సూత్రధారిగా భావించిన యాహ్యా సిన్వర్‌ను ఇజ్రాయెల్ గత ఏడాది హతమార్చింది. ఇప్పుడు ఆయన సోదరుడు మహ్మద్ సిన్వర్ కూడా మృతి చెందడంతో హమాస్‌కు గాజాలో వెన్ను విరిగినట్లైంది.

యెమన్‌లోని సనా విమానాశ్రయంపై ఇజ్రాయెల్ దాడి

యెమన్‌లోని సనా విమానాశ్రయంపై తమ యుద్ధ విమానాలు దాడి చేశాయని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ బుధవారం వెల్లడించారు. యెమన్‌కు చెందిన హౌతీలు మంగళవారం తమ దేశంపైకి రెండు క్షిపణులను ప్రయోగించడంతో తాము ప్రతిస్పందించామని చెప్పారు. అక్కడ మిగిలి ఉన్న చివరి విమానాన్ని కూడా ధ్వంసం చేశామన్నారు.

అన్నదాతకు మద్దతు!



(మొదటిపేజీ తరువాయి)

సీజన్ నుంచే అమల్లోకి వస్తాయని కేంద్రం ప్రకటించింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఎంఎస్‌పీ పెంపునకు ఆమోదం తెలిపింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే రావడంతో ఖరీఫ్ పంటల సాగు పెరుగుతుందన్న అంచనాల నేపథ్యంలో మద్దతు ధరలపై దృష్టి పెట్టినట్టు కేంద్ర వ్యవసాయ శాఖ తెలిపింది. కేబినెట్ సమావేశం అనంతరం.. కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ.. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రెండు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు. ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరల పెంపుతోపాటు స్వల్పకాలిక వడ్డీ రుణ పథకంపై కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. సాధారణ, ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాకు రూ.69 చొప్పున పెంచినట్టు తెలిపారు. ఇక, క్వింటా ఆవాలుకు రూ.820, రాగులకు రూ.596, నువ్వులకు రూ.579 పెంచినట్టు చెప్పారు. కౌలు, ఎరువులు, విత్తనాలు, పంట కోత, రవాణా, వృథా, ఇంధనం, కూలి ఖర్చులన్నీ లెక్క కట్టి, కనీస మద్దతు ధరలను నిర్ణయించినట్లు మంత్రి వివరించారు. సగటు ఉత్పత్తి వ్యయాన్ని అంచనా వేసి, రైతులకు లాభదాయకంగా కనీస మద్దతు ధరలు నిర్ణయించామన్నారు.

రుణ సదుపాయం కొనసాగింపు

రైతులకు స్వల్పకాలిక సరసమైన వడ్డీ రుణ పథకాన్ని 2025-26లోనూ కొనసాగించాలని కేంద్రం నిర్ణయించింది. కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ)లు ఉన్న రైతులకు సవరించిన స్వల్పకాలిక రుణాలను అందించనున్నారు. ప్రస్తుతం ఉన్న 1.5 శాతం వడ్డీ రుణాలను యథాతథంగా కొనసాగించనున్నట్టు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ పథకాన్ని కొనసాగించడం వల్ల ఖజానాపై రూ.15,640 కోట్ల భారం పడుతుందని చెప్పారు. కేసీసీ ఉన్న రైతులు గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు రుణాన్ని పొందవచ్చని తెలిపారు. కాగా, దేశంలో 7.75 కోట్ల మందికి కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

2 రైలు ప్రాజెక్టులకు అనుమతి

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలోని రెండు రైలు ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. రత్లాం-నాగ్దా, వార్ధా-బల్లార్షాల మధ్య నాలుగో లైన్(176 కిలో మీటర్లు)ను ఏర్పాటు చేయనున్నారు. తద్వారా మరింత వేగవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టులకు రూ.3,399 కోట్లను ఖర్చు చేయనున్నామని, 2029-30 నాటికి పూర్తవుతాయని చెప్పారు.

కనీస మద్దతు ధరలు(క్వింటాల్‌కు రూ.)

పంట	2024-25	2025-26	పెంపు
వరి కామన్	2,300	2,369	69
వరి గ్రేడ్-ఏ	2,320	2,389	69
పత్తి మీడియం	7,121	7,710	589
పత్తి లాంగ్ స్టేబుల్	7,521	8,110	589
జొన్న హైబ్రీడ్	3,371	3,699	328
జొన్న మాల్దిండి	3,421	3,749	328
సజ్జ	2,625	2,775	150
రాగులు	4,290	4,886	596
మొక్కజొన్న	2,225	2,400	175
కందులు	7,550	8,000	450
మినుములు	7,400	7,800	400
పెసలు	8,682	8,768	86
ఆవాలు	8,717	9,537	820
వేరుశనగ	6,783	7,263	480
పొద్దుతిరుగుడు	7,280	7,721	441
సోయాబీన్	4,892	5,328	436
నువ్వులు	9,267	9,846	579

రాహుల్ ముఖానికి నల్ల రంగు పూస్తాం

- మిత్రపక్షం శివసేన నేత హెచ్చరిక

న్యూఢిల్లీ, మే 28: మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) మిత్రపక్షాలైన శివసేన(యూబీటీ), కాంగ్రెస్ పార్టీల మధ్య సావర్కర్ వ్యవహారం రాజకీయ రచ్చ రేపింది. స్వాతంత్ర్య సమరయోధుడైన సావర్కర్‌పై రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ.. నాసిక్ నగర విభాగం శివసేన అధ్యక్షుడు బాలా దరాదే తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రాహుల్ గాంధీ ముఖానికి నల్ల రంగు పూస్తామని, ఆయన రాష్ట్రానికి ఎప్పుడు వచ్చినా.. కాన్వాయ్‌పై రాళ్లు రువ్వుతామని దరాదే ప్రతిజ్ఞ చేశారు. సావర్కర్ జన్మించిన ప్రాంతంలో తాము జీవిస్తున్నందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. 'మాఫీ-వీర్' అంటూ.. సావర్కర్‌ను రాహుల్ సంబోధించడం ఆయనను తీవ్రంగా అవమానించడమేనన్నారు. రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పరువు నష్టం దావా వేసినట్టు తెలిపారు. సావర్కర్‌పై చేసిన వ్యాఖ్యలు తమ మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని వ్యాఖ్యానించారు. కాగా.. దరాదే వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని, పార్టీకి సంబంధం లేదని శివసేన అధికార ప్రతినిధి సుష్మా అంధారే ప్రకటించారు. మరోవైపు దరాదే వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఇలాంటి హెచ్చరికలను సమర్థవంతంగా తిప్పికొడతామని మహారాష్ట్ర పీసీసీ చీఫ్ హర్షవర్ధన్ సప్కాల్ అన్నారు.

థరూర్.. లక్ష్మణరేఖ దాటారు!

- కేరళ ఎంపీపై కాంగ్రెస్‌లో ఆగ్రహం

న్యూఢిల్లీ, మే 28: ఎంపీ శశిథరూర్‌కు, కాంగ్రెస్ పార్టీకి మధ్య దూరం రోజురోజుకీ పెరుగుతోంది. కాంగ్రెస్ శశిథరూర్ పేరు ప్రతిపాదించకపోయినా.. విదేశాలకు వెళ్లే ఓ ఎంపీల బృందానికి సారథిగా కేంద్రం ఎంపిక చేయటం, దానికి ఆయన అంగీకరించటంతో పార్టీకి, శశిథరూర్‌కు మధ్య ఉన్న విభేదాలు బహిర్గతమయ్యాయి. కాగా, తాజాగా పనామాలో శశిథరూర్ మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఉగ్రదాడులను భారత్ భరిస్తూ వచ్చిందని, కానీ, ఇటీవలి కాలంలో మాత్రం దెబ్బకు దెబ్బ తీస్తోందని పేర్కొన్నారు. మోదీ హయాంలో జరిగిన యురి, పుల్వామా, పహల్గాం ఉగ్రదాడులను ప్రస్తావిస్తూ.. ఈ దాడుల అనంతరం పాకిస్థాన్‌లోకి వెళ్లి మరీ ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశామని తెలిపారు. దీనిపై కాంగ్రెస్ నేత పవన్‌ఖేరా స్పందిస్తూ.. యూపీఏ హయాంలో పాకిస్థాన్ మీద పలుమార్లు సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించామని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ స్వయంగా చెప్పిన వీడియోను శశిథరూర్‌కు ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశారు. సర్జికల్ స్ట్రైక్స్ అనేవి మోదీ ప్రధాని అయిన తర్వాతనే ప్రారంభం కాలేదని, గతంలోనూ అనేకసార్లు జరిగాయని, అయితే, దేశభద్రతకు సంబంధించిన అటువంటి సున్నిత సమాచారాన్ని తాము ఎన్నడూ ప్రచారానికి వాడుకోలేదని కాంగ్రెస్ గతంలోనూ పేర్కొంది. కానీ, పార్టీ వైఖరికి భిన్నంగా శశిథరూర్ మాట్లాడుతున్నారని, ఒకరకంగా ఆయన 'లక్ష్మణరేఖ'ను దాటారని పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారంటూ తాజాగా పీటీఐ వార్తాసంస్థ వెల్లడించింది.

పౌరులకు ఆయుధ లైసెన్స్

- అసోం ప్రభుత్వ సంచలన నిర్ణయం
- బంగ్లాదేశీలు, అక్రమ వలసదారుల నుంచి 'స్వదేశీ పౌరుల' రక్షణకు ఆయుధ లైసెన్సుల మంజూరు
- జారీ చేసే అధికారం జిల్లా అధికారులకు

గువాహటి, మే 28: అసోంలోని హిమంత బిశ్వ శర్మ సారథ్యంలోని అసోం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. బంగ్లాదేశ్‌తో సరిహద్దు గల జిల్లాల్లో మారుమూల, ముప్పు గల ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల స్వీయ రక్షణకు వారికి ఆయుధ లైసెన్సులు ఇవ్వాలని సీఎం హిమంత బిశ్వశర్మ అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. బంగ్లాదేశ్‌లో ఇటీవల హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్న నేపథ్యంలో అసోం సర్కారు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ధుబ్రి, నాగావ్, మోరిగావ్, బార్పేట, సౌత్ సాల్మరా, గోల్‌పరా జిల్లాల వాసులకు ఈ లైసెన్సులు మంజూరు చేస్తారు. అయితే, అర్హులైన వ్యక్తులకు ఆయుధ లైసెన్సులు ఇవ్వాలన్న విషయమై ఆయా జిల్లాల అధికారులు నిర్ణయం తీసుకుంటారని హిమంత బిశ్వ శర్మ తెలిపారు. 'ఇది చాలా ముఖ్యమైన, సున్నితమైన నిర్ణయం. ఇటీవలి బంగ్లాదేశ్ పరిణామాల (హిందువులను లక్ష్యంగా చేసుకున్న ఘటనలు) నేపథ్యంలో ఈ జిల్లాల్లోని గ్రామాల్లో నివసిస్తున్న భారతీయ స్వదేశీ పౌరుల్లో అభద్రతా భావం నెలకొంది. వారిపై దాడులు చేస్తామంటూ సరిహద్దు ఆవల బంగ్లాదేశ్ నుంచి, సొంత గ్రామాల్లోనూ హెచ్చరికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మారుమూల, దుర్బల ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి ఆయుధ లైసెన్సులు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించింది' అని అసోం సీఎం హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. 'చట్ట విరుద్ధ బంగ్లాదేశీయులను గుర్తించి బహిష్కరించే ప్రక్రియ చేపట్టినప్పటి నుంచి భారతీయ స్వదేశీ పౌరులు భయంతో జీవిస్తున్న సందర్భాలు మేం చూశాం. ఈ ప్రాంతాల్లో భారతీయ స్వదేశీ పౌరులు మైనారిటీలుగా జీవిస్తున్నారు. అందుకే వారికి ఆయుధ లైసెన్సులు ఇవ్వాలని మేం నిర్ణయించాం. ఆయుధాలను కొనుగోలు చేసేందుకు వారికి ప్రభుత్వం సాయం చేయదు. కానీ, ఆయుధాలు కొనుగోలు చేసేందుకు లైసెన్సు మంజూరు చేస్తాం. ఆయుధ లైసెన్సులు ఇవ్వాలని ఈ ప్రాంత వాసుల నుంచి సుదీర్ఘ కాలంగా డిమాండ్ ఉంది' అని ఆయన తెలిపారు. 'అసోం కష్టమైన, సున్నితమైన రాష్ట్రం. ఆయుధాల చట్టంలోని నిబంధనల కింద ఆయుధాల లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని భారతీయ స్వదేశీ పౌరులను ప్రోత్సహిస్తాం' అని బిశ్వశర్మ చెప్పారు. చట్ట విరుద్ధ హెచ్చరికలు, శత్రువుల ముప్పు ఉన్న ప్రాంతాల్లో స్వదేశీ సామాజిక వర్గాలకు సాధికారత కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ చొరవ తీసుకున్నది. 1979-85 మధ్య చట్ట విరుద్ధ వలసదారులకు వ్యతిరేకంగా అసోం ఆందోళన సాగినప్పటి నుంచి ఆయుధాల లైసెన్సులు కావాలన్న డిమాండ్ ఉందని వెల్లడించారు. కానీ, రాష్ట్రంలోని స్వదేశీ పౌరుల ఆందోళనను, డిమాండ్‌ను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు.

దేశవ్యాప్తంగా ఆస్తుల రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్‌లో!

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రం నూతన చట్టంపై దృష్టి పెట్టింది. నూతన చట్టం అమలులోకి వస్తే ప్రజలు తమ భూములు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్లను ఆన్‌లైన్‌లోనే చేసుకోవడమే కాక.. అందుకు సంబంధించిన పత్రాలను ఈ-సర్టిఫికెట్ల రూపంలో పొందవచ్చు. ఈ నూతన చట్టం పవర్ ఆఫ్ అటార్నీ, విక్రయ ఒప్పందాలు, సేల్ సర్టిఫికెట్లు, తనఖా ఒప్పందాల వంటి పత్రాల రిజిస్ట్రేషన్‌నూ తప్పనిసరి చేయనుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన భూవనరుల విభాగం ఈ నూతన చట్టానికి సంబంధించిన ముసాయిదాను సిద్ధం చేసింది. ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణ కూడా చేపడుతోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే రిజిస్ట్రేషన్ చట్టం దేశవ్యాప్తంగా అమలు అవుతుంది. అయితే, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి చట్టంలో కొన్ని సవరణలు చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉంటుంది.

ఆధార్ ఆధారిత ధ్రువీకరణ

ప్రతిపాదిత నూతన చట్టం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్‌లో చేయడం, ఆయా రికార్డులను డిజిటల్‌గా భద్రపరచడాన్ని తప్పనిసరి చేయనుంది. అంతేకాక, రిజిస్ట్రేషన్‌కు అవసరమైన పత్రాలను ఆన్‌లైన్‌లో సమర్పించేందుకు అవకాశం ఇస్తుంది. అయితే, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆధార్ కార్డు ధ్రువీకరణతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆధార్ కార్డు సంఖ్యతో అనుసంధానమైన మొబైల్ నెంబర్‌కు ఓటీపీ పంపడం ద్వారా ఈ ధ్రువీకరణ చేపట్టే అవకాశం ఉంది. అలాగని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ కార్డు తప్పనిసరి కాదు. ఆధార్ వివరాలు ఇవ్వడం ఇష్టం లేని వారికోసం వేరే ఐచ్ఛికాలను ప్రభుత్వం ఇవ్వనుంది. ఈ నూతన విధానం వల్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో అవినీతి, మోసాలు తగ్గుతాయని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరం, వేగవంతం అవుతుందని కేంద్రం భావిస్తోంది.

మరీ అలా నిజాలు చెప్పొద్దు!

(మొదటిపేజీ తరువాయి)

ఎదుట ఓ కేసు విచారణ ప్రారంభమైంది. ప్రతివాదుల తరఫు సీనియర్ న్యాయవాది ఇంకా రాలేదు. తమ కేసు విచారణను మిగతా కేసుల తర్వాత చేపట్టాలని సదరు న్యాయవాది వద్ద జూనియర్‌గా పనిచేసే లాయర్ ధర్మాసనాన్ని కోరారు. దీనితో ధర్మాసనం మిగతా కేసుల విచారణ పూర్తిచేసింది. అప్పటికీ సదరు సీనియర్ న్యాయవాది రాలేదు. ఏమైందని ధర్మాసనం ప్రశ్నించగా.. సీనియర్ న్యాయవాది హైకోర్టులో ఓ కేసు విషయంగా బిజీగా ఉన్నారని జూనియర్ లాయర్ సమాధానమిచ్చారు. దీనిపై జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ స్పందిస్తూ.. "మీరు మరీ ఇంత నిజాయతీగా ఉండొద్దు. మీ సీనియర్ హైకోర్టులో బిజీగా ఉన్నారని సుప్రీంకోర్టుకు ఎప్పుడూ చెప్పకూడదు. మా(సుప్రీంకోర్టు జడ్జీల) ఈగోలు చాలా సున్నితం. జడ్జి ఈగోను దెబ్బతీయవద్దు. మెరిట్స్‌తో సంబంధం లేకుండానే.. నేరుగా మీ కేసు ముగిసిపోతుంది. అందువల్ల ఇలాంటి నిజాలు చెప్పొద్దు. పెద్దగా తప్పు లేని చిన్న చిన్న అబద్ధాలు చెప్పొచ్చు" అని వ్యాఖ్యానించారు. దీనిపై జస్టిస్ విక్రమ్‌నాథ్ కూడా స్పందిస్తూ.. "మీ సీనియర్ న్యాయవాది మీకు ఈ విషయాలు నేర్పించి ఉండాల్సింది" అని అన్నారు.

అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం?

- వాషింగ్టన్‌లో చర్చలు జరిపిన కేంద్ర మంత్రి గోయెల్, వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్
- జూన్‌లో భారత్‌కు అమెరికా అధికారులు

న్యూఢిల్లీ, మే 28: భారత్, అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదరనుందా? వచ్చే నెలలోనే ఇరుదేశాలూ ఈ మేరకు ఒప్పందం చేసుకోనున్నాయా? అంటే విశ్వసనీయ వర్గాలు అవుననే అంటున్నాయి. ఇరుదేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయని, మధ్యంతర వాణిజ్య ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నాయని తెలిపాయి. జూన్‌లో అమెరికా అధికారుల బృందం భారత పర్యటనకు రానున్నట్లు సమాచారం. కేంద్ర వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి, చర్చలకు ప్రధాన మధ్యవర్తిగా ఉన్న రాజేశ్ అగర్వాల్ గత వారమే నాలుగు రోజుల అమెరికా పర్యటన ముగించుకొన్న సంగతి తెలిసిందే. మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై ఆయన వాషింగ్టన్‌లో అమెరికా అధికారులతో చర్చలు జరిపినట్లు సమాచారం. గత వారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ కూడా అమెరికా పర్యటనలో భాగంగా ఆ దేశ వాణిజ్య మంత్రి హోవార్డ్ లుత్నిక్‌తో రెండుసార్లు భేటీ అయ్యారు. ఒప్పందంపై చర్చలు జరిపారు. భారత్‌పై 26% ప్రతీకార సుంకం విధిస్తామన్న నిర్ణయాన్ని అమెరికా జూలై 9 వరకు వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇరుదేశాల మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కంటే ముందుగా జూన్‌లోనే మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని యోచిస్తున్నాయి. మరోవైపు మధ్యంతర వాణిజ్యం ఒప్పందంలో భాగంగా తమ వస్తువులపై 26% ప్రతీకార సుంకాలను పూర్తిగా మినహాయించాలని అమెరికాను భారత్ కోరనున్నట్లు సమాచారం.


మహానాడుకు హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు.. వేదికపై నుంచి వారికి అభివాదం చేస్తున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు



రెండు రాష్ట్రాలూ నాకు సమానమే

(మొదటి పేజీ తరువాయి)

బనకచర్లకు నీటిని తరలిస్తాం. ఈ అనుసంధానం పూర్తయితే ఏపీ ముఖచిత్రమే మారిపోతుంది. సముద్రంలోకి వృథాగా పోయే నీటిని వాడుకుంటే తెలంగాణకూ లాభమే. బీఆర్ఎస్ దీనిపై లేనిపోని విమర్శలు చేస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది.. సైబరాబాద్‌ను సృష్టించింది తెలుగుదేశమేనని... దేశంలో ఎక్కువ ఆదాయం వచ్చేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దింది కూడా టీడీపీయేనని చంద్రబాబు గుర్తుచేశారు. కడప మహానాడులో రెండో రోజు బుధవారం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన ముగింపు ప్రసంగం చేశారు. ప్రపంచంలో తెలుగు జాతిని అగ్రస్థానంలో నిలబెట్టే శక్తిసామర్థ్యాలు ఒక్క టీడీపీకే ఉన్నాయన్నారు. ఏపీలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజల ఆస్తులకు రక్షణ లేదన్నారు. గంజాయి, డ్రగ్స్ రాజ్యమేలాయని.. ఏజెన్సీలో గంజాయి సాగు గ్రామస్థాయి పరిశ్రమగా మారిందని చెప్పారు. నేరాలను వ్యవస్థీకృతంగా మార్చేశారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలోని అధినేతే సొంత బాబాయిని చంపి ఆ నిందను తనపై వేశారని అన్నారు. రాయలసీమ సుభిక్షానికి ప్రాజెక్టులు చేపట్టామన్న బాబు.. సీమను కరువుసీమ, ఎడారి సీమ కాని వ్వబోనని హామీ ఇచ్చారు. 2027 డిసెంబరుకు పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు..

అదే సంకల్పం..

తెలుగుదేశం పార్టీకి తాను ధర్మకర్తను మాత్రమేనని.. ఎన్టీఆర్ ఇచ్చిన వారసత్వాన్ని కాపాడుకుంటూ.. మళ్లీ భవిష్యత్ నాయకత్వాన్ని సిద్ధం చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 2047 నాటికి తెలుగుజాతిని ప్రపంచంలోనే నంబర్ వన్ చేయాలన్నదే సంకల్పమని, దీని కోసం రాబోయే 40 ఏళ్లకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకున్నామని తెలిపారు. 43 ఏళ్లుగా టీడీపీ జెండా రెపరెపలాడుతోందంటే దానికి కారణం కార్యకర్తల త్యాగాలేనని.. వారి సంక్షేమం కోసం పనిచేస్తామని హామీ ఇచ్చారు. "రాజకీయ, పాలనా అంశాల్లో రాష్ట్రం ఫస్ట్. పార్టీ విషయంలో కార్యకర్తే ఫస్ట్. కార్యకర్తే అధినేత. ప్రాంతీయ పార్టీగా పుట్టిన టీడీపీలో సభ్యత్వాల సంఖ్య నేడు కోటికి చేరింది. ఇదీ మన బలం" అని సగర్వంగా ప్రకటించారు. కరడుగట్టిన నేరస్థులతో రాజకీయం చేస్తున్నామని.. కాబట్టి అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలను హెచ్చరించారు. కాగా.. టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవిలో రెండేళ్లు కొనసాగుతారు. మరోవైపు.. చంద్రబాబు కుమారుడు లోకేశ్‌కు కీలక బాధ్యతలు అప్పగించాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. బుధవారం మహానాడు వేదిక నుంచే పలువురు సీనియర్ నేతలు ఆయనకు కార్యనిర్వాహక అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలని కోరారు. ఇక.. మహానాడులో రెండోరోజు ప్రవేశపెట్టిన అత్యంత కీలకమైన రాజకీయ తీర్మానాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రతిపాదించారు. జననేత చంద్రబాబును అరెస్ట్ చేయడం ద్వారా వైసీపీ సర్కారు చేయకూడని తప్పు చేసిందని, దాని ఫలితాన్ని కూడా ఆ పార్టీ అనుభవించిందని పేర్కొన్నారు. 43 ఏళ్ల పార్టీ.. చంద్రబాబు, లోకేశ్ నాయకత్వంలో మరో 40 ఏళ్ల ప్రయాణానికి సిద్ధమవుతోందన్నారు. లోకేశ్ ప్రజలు మెచ్చిన నాయకుడే కాదు.. ప్రధాని మోదీ మెచ్చిన నాయకుడని చెప్పారు. ఆయన రూపొందించిన ఆరు శాసనాలే ఆరు ఆయుధాలుగా పార్టీ భవిష్యత్ కోసం పనిచేద్దామని పిలుపిచ్చారు. ఇక.. 'మా తెలంగాణలో ముక్కోడు, మీ ఏపీలో మీకు తిక్కోడు పోయారు" అంటూ తెలంగాణ టీడీపీ నేత నన్నూరి నర్సిరెడ్డి ఎప్పట్లాగానే మహానాడులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. "పార్లమెంటులో ప్రధాన భూమిక పోషించే స్థాయి, సత్తా టీడీపీకి ఉందని నిరూపించిన ఘనత అన్న ఎన్టీఆర్‌ది. అన్న ఎన్టీఆర్ పేదలకు కిలో రెండు రూపాయలకే బియ్యం తెస్తే, 20 ఏళ్ల తర్వాత భారత ప్రభుత్వం దానిని ఆహార భద్రత చట్టంగా చేసింది. టీడీపీ నేడు చేసే ఆలోచన, దేశానికి 20 ఏళ్ల తర్వాత మార్గదర్శకంగా నిలుస్తుంది" అని ఆయన కొనియాడారు. కాగా.. మహానాడులో రెండో రోజు బుధవారం దాదాపు లక్ష మందికి భోజన వసతి కల్పించారు. రాయలసీమ రుచులతో పాటు, ఎన్టీఆర్‌కు ఇష్టమైన నేతి మిఠాయిలు, చక్కెర పొంగలి, వెజ్ పలావ్, చికెన్, మటన్ ఐటమ్స్‌తో భోజనాలు ఏర్పాటు చేశారు.


లోకేశ్ పాదయాత్ర యువగళంపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించి పరిశీలిస్తున్న చంద్రబాబు

ప్రజాభిమానాన్ని చూరగొన్న నేత ఎన్టీఆర్: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మే 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. 'పేదల, నిమ్న వర్గాల అభ్యున్నతి దిశగా చేసిన కృషికి ఎన్టీఆర్ ఎంతగానో ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. ఆయన నటించిన సినిమాలు నేటికీ అలరిస్తున్నాయి. ఆయన మనందరికీ ఎనలేని స్ఫూర్తిని అందించారు. నా మిత్రుడు చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీయే ప్రభుత్వం ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేస్తోంది' అని మోదీ పేర్కొన్నారు.

మహానాడులో తెలంగాణపై తీర్మానాలు

తెలంగాణ వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులపై మహానాడులో చర్చను తెలంగాణ నేత నెల్లూరు దుర్గాప్రసాద్ ప్రతిపాదించారు. "చంద్రబాబు హయాంలో మహబూబ్‌నగర్, దక్షిణ తెలంగాణలో 90 శాతం ప్రాజెక్టులు పూర్తి చేశారు, మిగతా పనులు పూర్తి చేయాలి. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టం లేదు. కృష్ణ, గోదావరి అనుసంధానంతో రైతులకు మేలు జరుగుతుంది. తెలంగాణలో ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయాలి' అని అందులో ఆయన ప్రతిపాదించారు.

5 లక్షల మందితో నేడే టీడీపీ సభ

మహానాడు చివరి రోజు గురువారం కడపలోనే నిర్వహించే బహిరంగ సభను చంద్రబాబు, లోకేశ్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. 5 లక్షల మందితో 'నభూతో' అనే తరహాలో సభ జరిపి.. జగన్ సొంత జిల్లాలో పసుపు సైన్యం సత్తా చాటాలని పట్టుదలతో ఉన్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు మహానాడు వేదిక వద్దే ఈ బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు కడప సహా రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేస్తున్నారు. ఒక్క ఉమ్మడి కడప జిల్లా నుంచే 2.10 లక్షల మందిని తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలు మొత్తం 5 వేల వాహనాలను ఇందుకు వినియోగించనున్నారు.


ఎన్టీఆర్ 102 జయంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి, మనుమడు దేవాన్ష్

'కోర్'కున్న ఉద్యోగాలు!

సివిల్, మెకానికల్ వంటి కోర్ కోర్సులు.. పూర్తి చేసిన వారికి పెరుగుతున్న అవకాశాలు

- 'మైనర్ డిగ్రీ'తో ఇతర రంగాలకూ వెళ్లే చాన్స్
- ఈ ఏడాది అన్ని సీట్లూ భర్తీ అయ్యేలా ప్రణాళికలు
- ఉన్నత విద్యా మండలి కసరత్తు

హైదరాబాద్, మే 28(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ పూర్తిచేసిన ఓ విద్యార్థి క్యాంపస్ ఇంటర్వ్యూలో రూ.32లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యాడు. ఆ కాలేజీలోని మొత్తం 120 సీట్లలో 33 మంది ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలు పొందగా.. మిగిలిన వారు సైతం ఆ తర్వాత వివిధ కంపెనీల్లో కొలువులు పొందారు. మరో కాలేజీలో మెకానికల్‌లో 30 సీట్లు ఉండగా.. 11 మంది క్యాంపస్ ఇంటర్వ్యూల్లోనే కొలువులు దక్కించుకోగా.. మిగతా వారు సైతం ఉద్యోగాలు పొందారు. కొవిడ్ తర్వాత మారిన పరిస్థితుల నేపథ్యంలో ఐటీ రంగంలో ఉద్యోగాలు తగ్గుతుండగా.. కోర్ ఇంజనీరింగ్‌గా పేర్కొనే సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్, ఎలక్ట్రికల్ కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. కానీ మారుతున్న పరిణామాలను గుర్తించి తదనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకోవడంలో విద్యార్థులు విఫలమవుతున్నారని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కోర్ ఇంజనీరింగ్ కోర్సుల ప్రాధాన్యం, భవిష్యత్తు అవకాశాలపై ప్రచారం చేపట్టేందుకు తెలంగాణ ఉన్నత విద్యామండలి సిద్ధమవుతోంది.

ఇంజనీరింగ్ అంటే 'సీఎస్ఈ'నేనా?

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 174 ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా.. 1,12,069 సీట్లు ఉన్నాయి. ఇందులో 90శాతం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), అనుబంధ కోర్సులే. ఐదారేళ్లుగా ఈ కోర్సులకు డిమాండ్ భారీగా పెరిగింది. దీంతో చాలా కాలేజీలు కోర్ ఇంజనీరింగ్ కోర్సులను పక్కనబెట్టి సీఎస్ఈకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో సివిల్, మెకానికల్, ట్రిపుల్ ఈ, కెమికల్ ఇంజనీరింగ్ సీట్లు తగ్గిపోతున్నాయి. 2020-21లో మొత్తం 27,445 సీట్లు ఉండగా.. అందులో 44శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. 2024-25(గత విద్యాసంవత్సరం)లో కోర్ ఇంజనీరింగ్ సీట్ల సంఖ్య 11,710కే పరిమితం కాగా.. అందులోనూ 80శాతమే భర్తీ అయ్యాయి. టెక్స్‌టైల్, మ్యానుఫ్యాక్చరింగ్, డిజైన్, వీఎల్ఎస్ఐ(వెరీ లార్జ్ స్కేల్ ఇంటెగ్రేషన్) రంగాలకు చెందిన అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో ఆయా కోర్సులు పూర్తి చేసిన వారికి డిమాండ్ ఉంది. వీఎల్ఎస్ఐ రంగంలో ఇంటెల్‌తోపాటు అనేక ప్రముఖ అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు సెమీకండక్టర్ల తయారీ కేంద్రాలు నెలకొల్పాయి. ఆయా సంస్థలు చాలా మంది ఉద్యోగులను తీసుకుంటున్నాయి. కోర్ బ్రాంచ్‌ల్లో కీలకమైన సివిల్ ఇంజనీరింగ్‌లో కొత్త ఉద్యోగాలు పెరుగుతున్నాయి. కాగా బీటెక్‌లో ఓ బ్రాంచ్‌లో చేరిన విద్యార్థి.. తన ఆసక్తిని బట్టి మరో కోర్సును చదివే అవకాశాన్ని ఏఐసీటీఈ కల్పించింది. 2020-21 నుంచి దేశవ్యాప్తంగా ఈ విధానం అమలవుతోంది. ఉదాహరణకు సివిల్ ఇంజనీరింగ్‌లో చేరిన విద్యార్థి.. తనకు ఆసక్తి ఉన్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను మైనర్ డిగ్రీ సబ్జెక్టుగా తీసుకోవచ్చు. మెషీన్ లెర్నింగ్(ఎంఎల్), డేటా సైన్స్, ఐవోటీ, రోబోటిక్స్ వంటి కోర్సులూ పూర్తి చేయవచ్చు. ఈ విధానం ముఖ్యంగా కోర్ ఇంజనీరింగ్ విద్యార్థులకు రెట్టింపు లబ్ధి చేకూరుస్తోంది. ఒక కోర్సుతోనే రెండు విభాగాల్లో ఉద్యోగాలు పొందే అవకాశాలు లభిస్తున్నాయి. ఇన్ని విశేషతల నేపథ్యంలో ఈసారి కోర్ ఇంజనీరింగ్ కోర్సులు, వాటి ప్రయోజనాలు, ఉద్యోగ అవకాశాల గురించి తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రత్యేకంగా ప్రచారం చేపట్టనుంది. కోర్ ఇంజనీరింగ్‌లో సీట్లన్నీ భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

అవగాహన కల్పించబోతున్నాం



సీఎస్ఈతో సమానంగా సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, కెమికల్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. వీటిని రాష్ట్ర యువత అందిపుచ్చుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. కోర్ ఇంజనీరింగ్ కోర్సులపై విద్యార్థులకున్న అపోహలను దూరం చేసేలా త్వరలో ప్రచారం ఉండబోతుంది.

- ఆచార్య బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్

ఐదేళ్ల బాలిక ప్రాణం తీసిన పిచ్చికుక్క

- ఇంటిముందు ఆడుకుంటుండగా దాడి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


నిహారిక (ఫైల్)

సుజాతనగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఓ పిచ్చికుక్క, ఐదేళ్ల బాలిక ప్రాణాలు తీసింది. కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన బానోత్ రమేశ్, స్వప్న దంపతుల కుమార్తె నిహారిక గాయత్రి (5) ఈనెల 13న ఇంటి ముందు ఆడుకుంటుండగా ఓ పిచ్చికుక్క ఆ చిన్నారిపై దాడి చేసింది. కుటుంబసభ్యులు కొత్తగూడెంలోని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యం చేసిన డాక్టర్లు వ్యాక్సిన్ వేసి, మందులిచ్చి ఇంటికి పంపారు. 25న ఆ చిన్నారి వింతగా ప్రవర్తిస్తుండటం, నోట్లో నుంచి నురగలు వచ్చి అస్వస్థతకు గురవడంతో అదేరోజు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది.

19 ఖనిజ బ్లాకుల వేలంతో రూ.56.74 కోట్ల రాబడి

- పారదర్శకంగా వేలం ప్రక్రియ: గనుల శాఖ

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 19 చిన్న తరహా ఖనిజ బ్లాకుల వేలం ద్వారా రూ.56.74 కోట్ల రాబడి సమకూరిందని గనులు, భూగర్భ వనరుల శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. తెలంగాణ ఏర్పడిన 10 ఏళ్ల తర్వాత సహజ వనరుల లీజు విధానంలో పారదర్శకతను పాటించడానికి రాష్ట్ర ప్రభుత్వం మార్చి 10 నుంచి ఈ-వేలం విధానాన్ని అమల్లోకి తెచ్చిందని వెల్లడించింది. ఈ నెల 23 నుంచి 27 వరకు 19 చిన్న ఖనిజ బ్లాకుల వేలం ప్రక్రియను పూర్తి చేశామని స్పష్టం చేసింది. సాంకేతిక మూల్యాంకన కమిటీ ఏర్పాటు, ఈ-వేలం ప్రొవైడర్ ఎంపిక, డిపాజిట్ల చెల్లింపు డిజిటలైజేషన్, వేలంపై విస్తృత ప్రచారం కల్పించడం.. వికారాబాద్, సిద్దిపేట, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లో అవగాహన శిబిరాల నిర్వహణ వంటి చర్యలు తీసుకోవడం ద్వారా పూర్తి పారదర్శకంగా సంస్థలను ఎంపిక చేశామని వివరించింది. మొదటి విడతలో వచ్చిన విశేష స్పందనతో ఇకపై ప్రతి నెలా విడతల వారీగా గనుల వేలం నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆ శాఖ పేర్కొంది.

'గుట్ట' దేవస్థానంలో చింతపండు దొంగలు

- దాదాపు రూ.45 వేల విలువైన 10 సంచుల చోరీకి విఫలయత్నం
- పట్టుబడిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

యాదగిరిగుట్ట, మే 28 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో పనిచేస్తున్న ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రసాదాల తయారీకేంద్రంలో చింతపండు దొంగిలించేందుకు విఫలయత్నం చేశారు. మంగళవారం అర్ధరాత్రి సంచులను కారులో తరలించేందుకు యత్నిస్తూ పోలీసులకు చిక్కారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గంధమల్లకు చెందిన పార్వతి మధు, రాజాపేట మండలం బేగంపేటకు చెందిన చెడదీప్ గణేశ్‌లు యాదగిరిగుట్ట దేవస్థానంలో సురక్ష అనే ఏజెన్సీ ద్వారా ఔట్‌సోర్సింగ్ విధానంలో ఏడాదిగా పనిచేస్తున్నారు. గణేశ్ పులిహోర మిషన్ ఆపరేటర్‌గా, మధు క్లీనింగ్ విభాగంలో నెలకు రూ.15,600 వేతనానికి పనిచేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక 2.25 గంటలకు ప్రసాదాల తయారీ కేంద్రానికి సామగ్రిని తరలించే కన్వేయర్ బెల్ట్ ద్వారా రూ.45వేల విలువైన 10 చింతపండు సంచులను (ఒక్కో బస్తా 30 కిలోలు) తరలించేందుకు గణేశ్, మధులు యత్నిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులొచ్చారు. దీంతో గణేశ్, మధు పరారయ్యారు. గమనించిన పెట్రోలింగ్ పోలీసులు ఎస్పీఎఫ్ ఎస్ఐ సీతారాములు, ఏఎస్ఐ మాణిక్‌ప్రభుకు సమాచారం అందించగా ప్రసాదాల కౌంటర్ వద్ద ఆ వారిద్దరూ అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు పట్టుకున్నారు. తాము సురక్ష ఏజెన్సీ నుంచి ఔట్ సోర్సింగ్ విధానంలో ఆలయంలో పని చేస్తున్నామని, తమకు వేతనాలు ఇవ్వకపోవడంతో దొంగతనం చేసినట్లు చెప్పారు. ఘటనపై డీఈవో భాస్కరశర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గణేశ్, మధులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ తెలిపారు. గణేశ్, మధును విధుల నుంచి తొలగించామని, వారికి ఇప్పటికే వేతనాలు చెల్లించామని ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు.

పురపాలక సంఘ కార్యాలయము :: భువనగిరి

టెండరు మరియు కొటేషన్ నోటీసు ప్రకటన

ఫైల్ నం. ఇ1/4/2025-26 తేది:28.05.2025

పనుల సంఖ్య : 3, అంచనా వ్యయం: రూ.32.60 లక్షలు, బిడ్ దాఖలు ప్రారంభ తేది: 28.05.2025, మ.12.30 గం.లకు, బిడ్ దాఖలు ముగింపు తేది: 31.05.2025 మ.12.30 గం.లకు. ప్రభుత్వ కార్యక్రమములు, పండుగల నిర్వహణకు వివిధ పనులు మరియు ఏర్పాట్లు చేయుటకు, వివిధ అభివృద్ధి పనులు మరియు ఇతర నిర్వహణ పనులకు అవసరముగు Non-SSR Item లకు ధరలు ఏజెన్సీలు/కాంట్రాక్టర్ల నుండి పై తేదీలలో కొటేషన్లు కోరడమైనది. పూర్తి వివరముల కొరకు మున్సిపల్ ఇంజనీర్: 9581853956 ను సంప్రదించగలరు.

సం/- కమిషనర్, భువనగిరి మున్సిపాలిటీ

DIPR RO No.2662-PP/CL/ADVT/1/2025-26, Dt: 28.05.2025

మంచిర్యాల నగరపాలక సంస్థ
మంచిర్యాల జిల్లా

కొటేషన్ల ఆహ్వానం

Lr. No.205/Quotation Notices/MMC/2025 తేది: 28.05.2025

మంచిర్యాల నగరపాలక సంస్థలో 1) డబుల్ ఆర్మ్ మరియు 150 W సోలార్ LED లైట్లతో 9 మీ. గాల్వనైజ్డ్ ఎలక్ట్రికల్ పోల్స్ సరఫరా, ఫ్యాబ్రికేషన్, రవాణా మరియు ఫిట్టింగ్ చేయుట, 2) వివిధ రకాల ట్రాఫిక్ ఐలాండ్ల అవెన్యూ ప్లాంటేషన్ మరియు మీడియన్ ప్లాంటేషన్ కోసం తగిన ప్లాంట్స్ (ఫ్లవరింగ్ & నాన్-ఫ్లవరింగ్) సరఫరా కోసం ఈ కార్యాలయం రేట్ కొటేషన్లు కోరుచున్నది. రేట్ కొటేషన్లను క్లోజ్ కవర్‌లో పెట్టి, దానిపై The Commissioner, Mancherial Municipal Corporation అని వ్రాసి రిజిస్టర్డ్ పోస్ట్ విత్ అక్నాలెజ్‌మెంట్ డ్యూ (RPAD) ద్వారా లేదా ఈ కార్యాలయం కౌంటర్ వద్ద లేదా ఈ కార్యాలయం మెయిల్ ఐడి comr.mncl@gmail.comకి 03.06.2025న 15:00 గం.కు లేదా అలోగా దాఖలు చేయవలెను. ఏవేని స్పష్టీకరణల కోసం మునిసిపల్ ఇంజినీర్ - 7893278692 మరియు టెక్నికల్ ఆఫీసర్ - 9505550340 వారిని కార్యాలయ పని వేళలలో సంప్రదించండి.

సం/- కమిషనర్, మంచిర్యాల నగరపాలక సంస్థ

DIPR RO No.2675-PP/CL/ADVT/1/2025-26, తేది: 28.05.2025

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఆసిఫాబాద్ జిల్లా

టెండర్ నోటీస్

నెం: 69/Dal/DWO/KBA/2025. తేది: 27.05.2025

ఆసిఫాబాద్ జిల్లాలోని 05 ఐ.సి.డి.యస్ ప్రాజెక్ట్‌లోని (973) అంగన్వాడి కేంద్రాలకు అవసరమైన కందిపప్పు (1Kg ప్యాక్) అంగన్వాడీ కేంద్రం వరకు సరఫరా చేయుటకు ఆసక్తి గల ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖ నందు రిజిస్టర్ అయిన Millers/Traders/Govt. Agencies వ్యాపారస్తుల నుండి టెండర్ కోరడమైనది. సంవత్సరానికి కావలసిన కంది పప్పు పరిమాణం మరియు సుమారు విలువ రూపాయలు 2,16,26,352/-.
మిగతా వివరాలను జిల్లా సంక్షేమ అధికారి, మహిళా,పిల్లల వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ ఆసిఫాబాద్, జిల్లా కలెక్టర్ గారి కార్యాలయం ఆసిఫాబాద్ (Room No:G7) నందు రూ. 10,000/- D.D చెల్లించి టెండర్ ఫారం పొందగలరు. టెండర్ ఫీజును మరియు ఇ.ఎం.డి. 2.5%లో 1% ను District Welfare Officer, WCD&SC., Asifabad వారి పేరు మీద Rs: 2,16,264/- డి.డి.లు చెల్లించవలెను. ఇ.ఎం.డి మరియు ప్రాసెసింగ్ ఫీజును చెల్లించని టెండర్ దరఖాస్తును తిరస్కరించబడును. ఇ.ఎం.డి విషయంలో ఎవరికీ మినహాయింపు లేదు. పూర్తి చేసిన బిడ్‌ను ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయగలరు.
Tender publication date : 29.05.2025, Online Tender starting date : 29.05.2025, 10:30 AM, Online tender closing date : 05.06.2025, 04:30 PM, Last date for submission of hard copy in office: 06.06.2025 12:00 PM, Technical bid open date : 06.06.2025, 03:00 PM, Financial bid open date : 06.06.2025, 03:00 PM

సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆసిఫాబాద్ జిల్లా

DIPR RO No.2686-PP/CL/ADVT/1/2025-26, Dt: 28.05.2025

జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ కార్యాలయం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఆర్.సి.నెం.260/A1/2025 టెండర్ ప్రకటన తేది:27.05.2025

ప్రభుత్వ జూనియర్ కళాశాల, టేకులపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు భౌతిక శాస్త్రం (ఫిజిక్స్), రసాయన శాస్త్రం (కెమిస్ట్రీ), వృక్ష శాస్త్రం (బాటనీ), జంతుశాస్త్రం (జూవాలజీ)లకు ప్రయోగ పరికరాలు, కంప్యూటరులు, వాల్ ప్రొజెక్టర్, ప్రింటర్, ఆహూజా సౌండ్ పరికరాలు, లైబ్రరి పుస్తకాలు, సరఫరా చేయుటకు గాను లైసెన్సు కలిగిన టెండర్ దారుల నుండి సీల్డు టెండర్ కోరబడుచున్నవి. 1. టెండర్ ఫారము ఖరీదు: 2000/-, 2. టెండర్ ఫారములను అమ్మబడు తేదీలు: 28.05.2025 నుండి 02.06.2025 సాయంత్రం 4 గంటల వరకు. 3. సీల్డు టెండర్ ఫారములు సమర్పించుటకు ఆఖరు తేదీ: 03.06.2025 సాయంత్రం 3.00 గంటల వరకు. 4. సీల్డు టెండర్ తెరచు తేదీ: 04.06.2025 3.00 గంటలకు. పైన తెలిపిన టెండర్ ఫారములు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సంయుక్త కలెక్టర్ గారి సమక్షములో వారి ఛాంబరు నందు తెరవబడును. 5. ఇ.యం.డి (ధరావత్తు సొమ్ము) 50,000/- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా "District Intermediate Education Officer, Bhadradri Kothagudem" గారి పేరున డిమాండ్ డ్రాఫ్ట్ రూపములో తీయవలెను. పైన తెలిపిన టెండర్లు వాయిదా వేయుటకు గాని, రద్దు చేయుటకుగాని చైర్మెన్, పర్చేసింగ్ కమిటీ వారికి పూర్తి అధికారాలు కలవు. టెండర్లు తెరచు తేదీన టెండర్ దారులు తప్పకుండా శాంపిల్స్‌తో హాజరుకాగలరు. మిగతా వివరాలకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారి కార్యాలయపు పనివేళల యందు సంప్రదించగలరు.

సం/- అదనపు కలెక్టర్ (Rev) మరియు చైర్మెన్ (తరఫున), జిల్లా పర్చేసింగ్ కమిటీ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

DIPR R.O.NO.2724-PP/CL/ADVT/1/2025-26, Dt.28-05-2025

పురపాలక సంఘం కార్యాలయం :: కల్వకుర్తి
నాగర్‌కర్నూల్ జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నం. E1/W-3/GF/2025-26/001 తేది: 28.05.2025

కల్వకుర్తి పురపాలక సంఘంలో జనరల్ ఫండ్ క్రింద (3) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లో టెండరు కోరబడుచున్నది:- 1) అంచనా విలువ: రూ.6.00 లక్షలు - పని పేరు: జనరల్ ఫండ్ 2025-26 క్రింద కల్వకుర్తి పురపాలక సంఘంలోని వార్డు నం.1 వద్ద దాసు ఇంటి వద్ద డ్రైనేజీ మరియు స్లాబ్ నిర్మాణం. 2) అంచనా విలువ: రూ.15.50 లక్షలు - పని పేరు: జనరల్ ఫండ్ 2025-26 క్రింద కల్వకుర్తి పురపాలక సంఘం, వార్డు నం.4లోని భగత్‌సింగ్ తండా వద్ద లిక్యా ఇంటి నుండి జోత్యా ఇంటి వరకు, లచ్చిరామ్ ఇంటి నుండి అంగన్‌వాడీ పాఠశాల వరకు మరియు పమిలి ఇంటి నుండి లచ్చిరామ్ ఇంటి వరకు వరదనీటి సీసీ డ్రైన్ నిర్మాణం. 3) అంచనా విలువ: రూ.15.00 లక్షలు - పని పేరు: జనరల్ ఫండ్ 2025-26 క్రింద కల్వకుర్తి పురపాలక సంఘంలోని వార్డు నం.10 వద్ద రాఘవేంద్ర కాలనీ ఆర్చ్ నుండి బాలస్వామి ఇంటి వరకు సీసీ రోడ్డు వేయుట. 4) అంచనా విలువ: రూ.15.00 లక్షలు - పని పేరు: జనరల్ ఫండ్ 2025-26 క్రింద కల్వకుర్తి పురపాలక సంఘంలోని వార్డు నం.10 వద్ద షాలీమ్ ఆటో షోరూమ్ ప్రక్క నుండి డి. లింగమయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు వేయుట.
బిడ్ దాఖలు ప్రారంభ తేది & సమయం: 29.05.2025 ఉ.11:30 గం. బిడ్ దాఖలు ముగింపు తేది & సమయం: 31.05.2025 సా.04:30 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in లో చూడవచ్చును. బిడ్లు కోరుచున్న అధికారి: కమిషనర్, కల్వకుర్తి పురపాలక సంఘం, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, సెల్ నం.9110540243, 7331109838

సం/- కమిషనర్, కల్వకుర్తి పురపాలక సంఘం

DIPR RO No.2656-PP/CL/ADVT/2025-26, Dt: 28.05.2025

Government of Andhra Pradesh
Swachha Bharat Mission (Urban)
PR&RD Department
Swachha Andhra Corporation
e-Procurement Tender Notice

SL.No	NIT No.	Name of Work
1.	NIT No.02 & 06 & 12to16/SBM(G)/CE/SBM(G)/GOBAR-dhan/2025-26	Construction of Biogas plant from Organic waste like Agriculture waste, Cow Dung, Food waste under GOBAR- dhan Project on EPC Mode in 07 locations in 07 districts in Andhra Pradesh (2nd call)
2.	NIT No. 01/SAC/SBM(G)/ CE /SWM/UWM/MTU/2025-26	Supply, Installation, Testing and Commissioning of Mobile Faecal Sludge Management Plant (MTU) under SBM (G) in A.P. State (2nd call)

The above bid can be downloaded on "ap e-procurement" portal from 17.05.2025 to and due date submission of Bid is on 02.06.2025 up to 5.00 PM. Bid opening on at 02.06.2025, 05:30 PM. Please refer to www.apeprocurement.gov.in for details

Sd/- Managing Director, SAC, Vijayawada

DIPR RO No.4146-PP/CL/ADVT/1/1/2021-22, Dt: 28.05.2025

NATA 2025

ఆర్కిటెక్చర్‌ను ఎంచుకోండి

దేశ నిర్మాణంలో భాగమవ్వండి

కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్
విద్యా మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం

NATA 2025 నిర్వహణ

NATA 2025 కోసం రిజిస్ట్రేషన్ www.nata.inలో 03.02.2025 నుండి ప్రారంభమయ్యింది మరియు 24.06.2025న ముగుస్తుంది. 5-సంవత్సరాల B.Arch. డిగ్రీ ప్రోగ్రామ్ మొదటి సంవత్సరంలో ప్రవేశం తీసుకోవడానికి అభిలషిస్తున్న అభ్యర్థులు NATA 2025 కొరకు తమకుతాము తక్షణమే నమోదు చేసుకోవాలని సూచించడమైనది.

దరఖాస్తు ఎవరు చేసుకోవచ్చును?

తప్పనిసరిగా ఫిజిక్స్ మరియు మ్యాథ్స్ సబ్జెక్టులతో 11/12 విద్యార్థులు లేదా కనీసం 45% సరాసరి మార్కుల స్కోర్‌తో మ్యాథమెటిక్స్‌తో డిప్లొమా (10+3) ఉత్తీర్ణులైన లేదా హాజరవుతున్న విద్యార్థులు

అర్హతా ప్రమాణాల వివరాలు కలిగిన NATA 2025 బ్రోచర్, సిలబస్ మరియు NATA స్కోర్ ఆధారంగా B.Arch. ప్రోగ్రామ్‌లో విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్న ఇన్‌స్టిట్యూషన్స్ జాబితాతో పాటు ఇతర ముఖ్యమైన వివరాలు www.nata.in మరియు www.coa.gov.inలో లభిస్తాయి.

NATA 2025 స్కోర్ హాజరైన సంవత్సరం నుండి రెండు సంవత్సరాల కోసం చెల్లుబాటు అవుతుంది. ఒక విద్యా సంవత్సరానికి గరిష్ఠంగా హాజరయ్యే సంఖ్య: 03 నం.లు.

www.nata.in

NATA హెల్ప్‌డెస్క్
stusupport@nata-app.online
+91 7385395400

న్యూఢిల్లీ
తేది: 29.05.2025 రిజిస్ట్రార్

www.facebook.com/coa.gov.in/ @council_of_architecture_india @coasocial9256 @CouncilofArchi1 coa.gov.in

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మాటల యుద్ధం

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఉద్దేశించి డోనాల్డ్ ట్రంప్ అన్నేసి మాటలన్న తరువాత రష్యా ఊరుకుంటుందా? బుధవారం సీనియర్ నాయకుడు దిమిత్రీ మెద్వదేవ్ ఏకంగా మూడో ప్రపంచయుద్ధానికి సిద్ధమన్న రీతిలో వ్యాఖ్యలు చేశారు. తమ అధ్యక్షుడిని ట్రంప్ పిచ్చోడన్నందుకు ఈయనకు మా చెడ్డ కోపం వచ్చింది. అధికారంలోకి వచ్చిన అరగంటలోనే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఆపేస్తానన్నంత స్థాయిలో గొప్పలకు పోయిన ట్రంప్‌కు ఆ పనిచేయలేకపోతున్నందుకు చాలా చిరాకుగా ఉంది. పుతిన్ దారికొస్తాడన్న నమ్మకం తరిగిపోతూండటంతో ఇటీవల ట్రంప్ మాటల్లో పుతిన్‌మీద కోపం హెచ్చింది. వందలాది మిసైళ్ళు, డ్రోన్లతో ఆదివారం ఉక్రెయిన్ మీద రష్యా జరిపిన దాడి ఇప్పటి వరకూ యుద్ధంలో చూడనిది. కాల్పుల విరమణకు సిద్ధపడకుండా ఇలా సామాన్యులను పుతిన్ చంపుతున్నందుకు ట్రంప్‌కు కోపం వచ్చింది. హద్దులు దాటిమాట్లాడటం అలవాటే కనుక, ఇప్పటివరకూ తానే రష్యాను రక్షిస్తున్నట్టూ, తానే గనుక లేకపోతే ఈపాటికి రష్యాకు అత్యంత చెడు దాపురించి, ఏకంగా చెరిగిపోయేదన్నట్టుగా ట్రంప్ మాట్లాడారు. పుతిన్ నిప్పుతో చెలగాటమాడుతున్నారనడమే కాదు, తన ప్రభావ ప్రాభవాలవల్లనే రష్యా ఇంకా ఉనికిలో ఉన్నదన్నట్టుగా ట్రంప్ చేసిన వ్యాఖ్యల్లో మూడో ప్రపంచయుద్ధం హెచ్చరిక రష్యాకు కనిపించినట్టుంది.

కొంతకాదు, పుతిన్‌కు మొత్తం ఉక్రెయిన్ కావాలని తాను ఎప్పటి నుంచో చెబుతున్నానని, ఆ అత్యాశ రష్యా పతనానికి దారితీస్తుందని ట్రంప్ హెచ్చరిస్తున్నారు. అంత కచ్చితంగా చెప్పగలిగిన ట్రంప్ ఇంతకాలమూ అదే వ్యక్తిని ఎందుకు నమ్మారో, వెనకేసుకొచ్చారో తెలియదు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని ఓవల్ ఆఫీసులో అమెరికా అధ్యక్ష ఉపాధ్యక్షులు ఎంతగా అవమానించారో చూశాం. అసలు, యుద్ధం మొదలుకావడానికి జెలెన్‌స్కీ కారకుడని, కొండలాంటి రష్యాని ఢీకొని తనదేశాన్ని నాశనం చేస్తున్నాడని ట్రంప్ అప్పట్లో మండిపడ్డారు. అచ్చంగా పుతిన్ భాషనే ట్రంప్ కూడా వాడుతూండటంతో జెలెన్‌స్కీకి విషయం అర్థమైపోయింది. ఓవల్ ఆఫీసులో ట్రంప్‌తో ఘర్షణపడినప్పటికీ ఆ తరువాత ట్రంప్ కోరిక మేరకు, యుద్ధానికి అమెరికా అందించిన ఆయుధసాయానికి రుణం తీర్చుకోవడంలో భాగంగా అమెరికాకు అతివిలువైన, అరుదైన లోహాలను అప్పగించడానికి జెలెన్‌స్కీ సిద్ధపడ్డారు. రష్యా కూడా ట్రంప్‌కు ఇదేరకమైన ఆఫర్ ఇచ్చిన విషయాన్ని అటుంచితే, యుద్ధాన్ని ఆపేందుకు ఒక బలమైన ప్రయత్నం జరుగుతోందని, కాల్పుల విరమణ జరిగి, అంతిమంగా ఏదో ఒప్పందం మేరకు యుద్ధం ఆగుతుందన్న ఆశలు క్రమంగా అడుగంటిపోతున్నాయి.

ఒప్పందం కుదిరితేనే కాల్పుల విరమణ అని రష్యా పట్టుబడుతోంది. కాల్పులు ఆపడమంటే ఉక్రెయిన్‌కూ దానికి వెన్నుదన్నుగా ఉన్న పాశ్చాత్యదేశాలకూ కూడదీసుకోవడానికి సమయం ఇవ్వడమేనని, మళ్ళీ అవే పాతవిధానాల కొనసాగింపును అనుమతించడమేనని రష్యా వాదన. అందువల్ల, నాటో విస్తరణ, ఆయుధ సరఫరాలు, ఉక్రెయిన్ భూభాగాల అప్పగింత ఇత్యాది అన్ని విషయాలూ నిర్దిష్టంగా తేలి, ఒప్పందం కుదిరేవరకూ రష్యా యుద్ధం ఆపదల్చుకోలేదు. యుద్ధానికి కారణం నాటో విస్తరణే కనుక అది ఆగుతుందనీ, ఉక్రెయిన్‌తో పాటు మరికొన్ని మాజీ సోవియట్ యూనియన్‌దేశాలు కూడా అందులో చేరబోవని రష్యాకు హామీ దక్కాలి. ఇకపై ఉక్రెయిన్ ఎవరివైపూ వొంగకుండా తటస్థంగా ఉండాలని, ఆంక్షలు ఎత్తివేసి, స్తంభింపచేసిన రష్యన్ ఆస్తులను విడుదల చేయాలని రష్యా చాలా డిమాండ్లు చేస్తోంది. ఇవన్నీ అటుంచితే, అసలు ట్రంప్ శాంతియత్నాలమీద జెలెన్‌స్కీకి నమ్మకం లేన్నట్టు కనిపిస్తోంది. రష్యా–అమెరికా మధ్య సాగుతున్న ఈ వాగ్యుద్ధం కూడా ఆయనకు నాటకంగానే తోస్తోంది. యుద్ధం ఇప్పట్లో ఆపకుండా, పుతిన్‌ను సాధ్యమైనన్ని ఉక్రెయిన్ భూభాగాలను స్వాధీనం చేసుకోనిచ్చి, శాంతిఒప్పందంలో భాగంగా వాటిని ఆయనకే కట్టబెట్టే ఆలోచనలో ట్రంప్ ఉన్నారని ఈయన అనుమానం. అమెరికా–రష్యా అధ్యక్షులతోపాటు తాను కూడా కూచుంటేనే చర్చలు విజయవంతమవుతాయని అదేపనిగా జెలెన్‌స్కీ పోరుతున్నారు. కాల్పుల విరమణో, నేరుగా ఒప్పందమో అతిత్వరలో జరగనిపక్షంలో రష్యామీద మరిన్ని ఆంక్షలు విధించాల్సిన అగత్యం ట్రంప్‌కు తప్పదు. రష్యాను వేధిస్తున్నకొద్దీ ఇరాన్, ఉత్తర కొరియా, చైనాలతో పాటు మరిన్ని దేశాల మోహరింపుతో యుద్ధం విస్తరించే ప్రమాదం హెచ్చుతుంది.

మనం మరచిపోయిన జాతీయవాదం

భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యాన్ని వ్యవస్థాపించిన భారత జాతీయవాదం భ్రష్టమైపోలేదూ? ఇటీవలి భారత్–పాకిస్థాన్ సైనిక సంఘర్షణలు, తదనంతర పరిణామాలే ఆ పతనానికి నిదర్శనం. మనం 'అతి జాతీయవాదులు'గా రూపొందామని నేను అనడం లేదు. మన జాతీయవాదం అతిగా అనుకరణప్రాయమైపోవడమే అసలు సమస్య. భారత జాతీయవాద సమున్నత వారసత్వాన్ని ఒక కాపీ క్యాట్ (అంధానుకర్త) జాతీయవాదం స్వాయత్తం చేసుకున్నది. ఒక హిందూ–పాకిస్థాన్‌ను సృష్టించడానికి ప్రయత్నిస్తోంది. ఈ పథ భ్రష్టత్వానికి నరేంద్ర మోదీని, బీజేపీని, ఆరెస్సెస్‌ను తప్పుపట్టలేము.

అలీఖాన్ మహమూదాబాద్ కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలు (అతడి సోషల్ మీడియా పోస్టులపై దర్యాప్తునకు ముగ్గురు ఐపీఎస్ అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది) మాత్రమే కాకుండా ఆ కేసు విచారణ జరిగిన తీరుతెన్నులూ దిగ్భ్రాంతికరంగా ఉన్నాయని చెప్పక తప్పదు. పౌరుల హక్కుల కంటే జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నట్టు ఆ కేసు విచారణ తేటతెల్లం చేసింది. యుద్ధకాలంలో అయినా ఒక మోస్తరు భిన్నాభిప్రాయాలను, ప్రశ్ననూ సహించలేకపోవడం భారత జాతీయవాద సంప్రదాయానికి విరుద్ధం. జాతీయవాదం, పౌర స్వేచ్ఛల మధ్య పోటీ పెట్టడం, వాటిలో ఒకదాన్ని ఎంచుకోమనడం భారత జాతీయవాద సంప్రదాయం కానేకాదు. క్విట్ ఇండియా ఉద్యమ నాయకుడు జయప్రకాశ్ నారాయణ్‌ను అడగండి. తన జాతీయవాదం, కశ్మీర్, నాగాలాండ్ వ్యవహారాలపై సత్యం చెప్పడంలో తన విద్యుక్త ధర్మం మధ్య ఘర్షణ ఉన్నదని ఆయన భావించలేదు. 1962 యుద్ధం అనంతరం కూడా ఆయన చైనా ప్రజల పట్ల తన స్నేహ భావాన్ని నిర్భయంగా వ్యక్తం చేశారు.

పౌరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు వ్యతిరేకంగా జాతీయవాదానికి ప్రాధాన్యమివ్వడమంటే ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా జాతీయవాదానికి ప్రాముఖ్యమివ్వడమే. ఆపరేషన్ సిందూర్‌ను హృదయపూర్వకంగా సమర్థించినవారు సైతం ప్రజాస్వామిక జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తే పాలకుల దృష్టిలో జాతి వ్యతిరేకులు అయిపోతున్నారు! కాల్పుల విరమణ విషయమై మన ప్రభుత్వ అధికారిక వైఖరికి భిన్నమైన అభిప్రాయాలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పలుమార్లు వ్యక్తం చేశారు. ఇబ్బందికరమైన వాదనలూ ఆయన బహిరంగంగా చేశారు. అయితే ఈ విషయమై ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించడం లేదు. ప్రభుత్వ మౌనాన్ని నిశితంగా విమర్శించిన వారిపై ప్రశ్నలు గుప్పిస్తున్నారు.

అటల్ బిహారీ వాజపేయిని గుర్తుచేసుకోండి. 1962 యుద్ధంలో భారత్ పరాజయంపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నెహ్రూ అనుసరించిన చైనా విధానాన్ని రామ్‌మనోహర్ లోహియా తీవ్రంగా విమర్శించారు. వాజపేయిని కానీ, లోహియాను కానీ ఎవరూ జాతి వ్యతిరేకులు అని నిందించలేదు.

దేశ ప్రజల కంటే జాతే ముఖ్యమని ప్రతిపాదిస్తున్నారు. సైద్ధాంతిక, సాంస్కృతిక భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను జాతి వ్యతిరేకమైనవిగా పరిగణిస్తున్నారు.



హిందీ–హిందూ–హిందుస్థాన్ జాతీయవాదంగా భారత జాతీయవాదం భ్రష్టమవడం మన కాలం చవిచూస్తున్న ఒక మహా విషాదం. ప్రస్తుత పాలనా వ్యవస్థ, దాని సైద్ధాంతిక సమర్థకులే ఈ పతనానికి పూర్తి బాధ్యులుగా భావించడం పొరపాటు. ప్రస్తుత శోచనీయ పరిస్థితులకు ఉదారవాద, లౌకిక, ప్రగతిశీల మేధోశ్రేణులు తమవంతు బాధ్యతను అంగీకరించి తీరాలి.

తర్కాన్ని తలకిందులు చేస్తున్నారు. పహల్గాం అనంతరం కశ్మీరీలు, ముస్లింలపై దాడి చేసినవారు కాకుండా మతపరమైన చీలికలు సృష్టిస్తున్నారనే ఆరోపణను అలీఖాన్ మహమూదాబాద్ ఎదుర్కొంటున్నారు. కల్నల్ సోఫియా ఖురేషిని పాకిస్థాన్ సోదరి అని బీజేపీ మంత్రి విజయ్ షా ఆక్షేపించగా, ఆమెను అవమానపరిచారనే అభియోగాన్ని మహమూదాబాద్‌పై మోపారు. సమైక్యత స్థానంలో ఏకరూపతకు ప్రాధాన్యమిస్తున్నారు. పహల్గామ్ అమానుష విషాదం సమస్త భారతీయులను ఏకం చేసిన తరుణంలో కూడా ఒక అంతర్గత శత్రువు అవసరమయ్యాడు. ఈ ధోరణి భారత జాతీయవాదానికి పూర్తిగా విరుద్ధం. భిన్నసామాజిక వర్గాలవారిని, భిన్న ప్రాంతాలను సమైక్యపరిచిన సర్దార్ పటేల్ స్ఫూర్తి ఏమైపోయింది?



■ యోగేంద్ర యాదవ్

మహోన్నత భారత స్వాతంత్ర్య పోరాటం నుంచి మనకు వారసత్వంగా సంక్రమించిన జాతీయవాదం చాలా భిన్నమైనది. అమెరికన్ న్యాయశాస్త్ర కోవిదుడు జాన్ ఎ పొవెల్ ప్రతిపాదించిన ఒక భావన ప్రకారం భారత జాతీయవాదం మౌలిక లక్ష్యం, లక్షణం 'స్వ–పర తేడా లేకుండా ఒక విశాల సమ్మిళిత సమూహంలో భాగస్వాములం కావడమే'. బాహ్య, అంతర్గత శత్రువులను కల్పించుకోకుండా ఒక ప్రగాఢ జాతీయ అనుబంధ భావనను సృష్టించి పెంపొందించడం ద్వారా జాతిని నిర్మించేందుకు ఆనాటి మన జాతీయవాదం ప్రయత్నించింది. దాని శత్రువు వలసవాదమే కాని ఒక దేశం లేదా ఒక జాతి కానే కాదు. భారత జాతీయవాదం మనలను ఇరుగు పొరుగు దేశాలకు వ్యతిరేకంగా వ్యవహరించేందుకు పురిగొల్పలేదు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల వలసపాలన వ్యతిరేక ఉద్యమాలతోను, దక్షిణాఫ్రికాలో వర్ణ వివక్ష వ్యతిరేక పోరాటంతో మమేకం చేసింది. సమస్త భారతీయుల మధ్య ఒక సమైక్యతా భావం సంపూర్ణంగా వర్ధిల్లేలా చేసేందుకు భారత జాతీయవాదం అంకితమయింది. భారతీయ అస్తిత్వానికి ఒక సమగ్ర గుర్తింపును సమకూర్చేందుకు భాషల బహుళత్వాన్ని, ప్రాంతాల వైవిధ్యాన్ని, మతాల విలక్షణతలను అది సంపూర్ణంగా గౌరవించింది. జాతీయ ఐక్యత ఒక స్వతస్సిద్ధ స్థితిగా ఉందని భావించలేదు. అందరూ ఒకేలా ఉండాలని ఒత్తిడి చేయకుండా తేడాలు విలువైనవని అంగీకరిస్తూ కలిసి మెలిసి ఉండేలా జాతీయ ఐక్యతను దృఢతరం చేసేందుకు అంకితభావంతో కృషి చేసింది. మైనారిటీ వర్గాల వారి హక్కుల రక్షణకు మెజారిటీ వర్గం కృషి చేసింది. హిందీయేతర ప్రాంతాల వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు హిందీ భాషీయులను పురిగొల్పింది. దక్షిణాది రాష్ట్రాల ప్రజలు హిందీ భాషా సాహిత్యాల అధ్యయనానికి పూనుకునేలా ప్రోత్సహించింది. ఏకరూపత (యూనిఫార్మిటి) ఆధారిత యూరోపియన్ జాతి–రాజ్యం (నేషన్ స్టేట్) నమూనాను అనుసరించడానికి బదులు ప్రజాస్వామ్యాన్ని సకల వ్యత్యాసాలతో సమన్వయీకరించే రాజ్యం–జాతి (స్టేట్ నేషన్) నమూనాను భారత జాతీయవాదం సృష్టించింది. యూరోపియన్ జాతీయవాదం వలే కాకుండా ఒక జాతిగా ఉండడమంటే ఏమిటి అనే విషయమై చర్చలను ప్రోత్సహించింది.

ఈ సమున్నత భారత జాతీయవాదంపై నేడు దాడి జరుగుతోంది. ఆమోదయోగ్యం కాని కొత్త జాతీయవాదం ప్రబలమవుతోంది. ఇది 'వారు–మనము' అనే భావనకు తావివ్వకుండా సకల సామాజికవర్గాల మధ్య సమైక్యత పరిఢవిల్లేందుకు సంకల్పించడం లేదు. మణిపూర్‌లో జాతుల ఘర్షణ, పంజాబ్, హర్యానా; కర్ణాటక, తమిళనాడుల మధ్య నదీజలాల పంపకాలు మొదలైన అంతర్ రాష్ట్ర వివాదాలను పరిష్కరించేందుకు ఈ తప్పుడు జాతీయవాదం పూనుకోవడం లేదు. కశ్మీర్‌కే అగ్రప్రాధాన్యమిస్తోంది, అదీ ఒక స్థిరాస్తిగా మాత్రమే సుమా! ముస్లింలను శత్రువులుగా చిత్రీకరిస్తూ భారతదేశ సమైక్యతను బలహీనపరుస్తోంది. బాహ్య శక్తుల విషయంలో సాధ్యమైతే కలహశీల వైఖరితో వ్యవహరిస్తోంది; తప్పనిసరి అయినచోట నమ్రతతో లొంగుబాటు వైఖరి ప్రదర్శిస్తోంది. ఎంతకూ పాకిస్థాన్‌ను ఎలా దెబ్బతీయాలా అన్నదే దాని నిరంతర ఆలోచనగా ఉన్నది. ఫలితమేమిటి? అంతర్జాతీయ వేదికలపై ఇప్పుడు అందరూ భారత్‌ను పాకిస్థాన్‌తో కలిపి ప్రస్తావిస్తున్నారు! ఇరుగు పొరుగు దేశాలపై పెత్తనం వహించేందుకు ప్రయత్నించడం వల్లే ఇప్పుడు మన దేశం అన్ని వైపులా శత్రుపూరిత ప్రభుత్వాలతో పరివేష్టితమై ఉన్నది. నిక్కచ్చిగా చెప్పాలంటే ఇదొక మిథ్యా జాతీయవాదం. చైనా విస్తరణవాదాన్ని సమర్థంగా ప్రతిఘటించగలుగుతుందా? లేదు. డోనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు దీటుగా ప్రతిస్పందిస్తుందా? లేదు. జాతీయ ప్రయోజనాల విషయమై దీని అవగాహన సూత్రబద్ధమైనది కాదు. కనుకనే భారత్‌కు ఆపత్సమయంలో ఆదుకునే మిత్ర దేశాలు లేకుండా పోయాయి. పాకిస్థాన్‌తో ఇటీవలి ఘర్షణలే ఇందుకు తార్కాణం.


వివిధ భారతి జాతీయవాదం నుంచి హిందీ–హిందూ–హిందుస్థాన్ జాతీయవాదంగా భారత జాతీయవాదం భ్రష్టమవడం మన కాలం చవిచూస్తున్న ఒక మహా విషాదం. ఇందుకు బాధ్యులు ఎవరు? ప్రస్తుత పాలనా వ్యవస్థ, దాని సైద్ధాంతిక సమర్థకులే పూర్తి బాధ్యులుగా భావించడం ఒక శుద్ధ పొరపాటు. అలా ఆలోచించడం మేధో సోమరితనమే. ప్రస్తుత శోచనీయ పరిస్థితులకు ఉదారవాద, లౌకిక, ప్రగతిశీల మేధోశ్రేణులు తమ వంతు బాధ్యతను అంగీకరించి తీరాలి. భారతదేశ సమగ్ర, అభ్యుదయాత్మకమైన జాతీయవాదంపై సంకుచిత యుద్ధోన్మాద ధోరణులు, మతమౌఢ్యవాదాలు ఆధిక్యత ఎలా సాధించాయి? స్వాతంత్ర్యానంతర పాలకుల భావజాలమే అందుకు ప్రధాన కారణమని చెప్పక తప్పదు. అదొక సారహీన ఆధునికతా భావజాలమది. భావోద్విగ్నత, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సారం లేని ఆ భావజాలం సమస్త భారతీయులతో మన జాతీయోద్యమానికి ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని నిలుపుకోవడంలో పూర్తిగా విఫలమయింది. యూరోపియన్ జాతీయవాద దుష్కృత్యాల వల్ల కలిగిన అపరాధ భావనతో భారతీయ మేధావులు జాతీయవాద భావనకు నిబద్ధతను పూర్తిగా ఉపసంహరించుకున్నారు. మరి భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి ఏ మాత్రం దోహదం చేయని శక్తులు జాతీయవాదాన్ని స్వాయత్తం చేసుకోవడంలో ఆశ్చర్యమేముంది? ప్రగతిశీల భారతీయులు ఇప్పటికైనా మహోన్నత భారత జాతీయవాదం ఇలా భ్రష్టమైపోవడంలో తమ పాత్రను అంగీకరించి, దాని వారసత్వాన్ని రక్షించుకోవడానికి పూనుకుంటారా? ఇది చాలా అత్యవసరంగా నిర్వర్తించాల్సిన రాజకీయ, మేధో కర్తవ్యం అనడంలో సందేహం లేదు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

వాళ్ళు తమతో ఏం తీసుకుపోయారు?

సమాధి ఫలకాలు రాయడం తేలిక. విషాదగీతాలనూ, మరణానంతర ప్రశంసలనో రాయడం కూడా తేలిక. చనిపోయిన వాళ్ళని శపించి, చరిత్రని ఖననం చేసేయడం ఇంకా తేలిక. నిజంగా అంత తేలికైన విషయమేనా అది?

ఐదు వందల ఏళ్ళ క్రితం జర్మనీలోని ఫ్రాంకెన్ హౌసెన్ వద్ద ఒక యుద్ధం జరిగింది. అక్కడ కొండమీద ఒక ఇంద్రధనుస్సు కనిపించిందని చెబుతారు. బైబిల్ ద్వారా దైవికమైన ఒడంబడికకి చిహ్నమైన ఇంద్రధనుస్సు తిరగబడిన రైతుల పతాకం కూడా. యుద్ధానికి సన్నద్ధమైన రైతులు ఇంద్రధనుస్సు దర్శనాన్ని తమ విజయానికి దైవిక సంకేతంగా భావించారు. కానీ వాళ్ళు ఓడిపోయారు. ప్రత్యర్థులైన ప్రభు వర్గం వాళ్ళని మోసం చేసింది. నిర్యుద్ధ సంధి చేసుకుని, సంధి కాలం ముగియకముందే రైతులపైన ప్రభువుల సైన్యం దాడి చేసింది. ఒకే ఒక్క రోజు మే 15, 1525న ఏడువేలమందికి పైగా రైతులని ఊచకోత కోశారు. ఫ్రాంకెన్ హౌసెన్ యుద్ధం జర్మనీలో రైతాంగ తిరుగుబాటులో ఒక కీలకమైన ఘట్టం. 1525 నాటి ఈ జర్మనీ రైతుయుద్ధాన్ని 1789 ఫ్రెంచి విప్లవానికి ముందు పశ్చిమ యూరప్‌లో అతిపెద్ద ప్రజా తిరుగుబాటుగా పరిగణిస్తారు. థామస్ మూంత్సర్ జర్మనీ రైతుల తిరుగుబాటుకు నాయకుడు. ఫ్రాంకెన్ హౌసెన్ యుద్ధంలో పట్టుబడిన థామస్ మూంత్సర్‌ని చిత్రహింసలకు గురిచేశారు. థామస్ మూంత్సర్‌తో పాటు మరొక నాయకుడు ఫైఫర్, ఇంకా ఇరవై నాలుగు మంది తిరుగుబాటుదారులని మే 27, 1525న ప్రభువులు చంపివేశారు. వాళ్ళ శరీరాల్ని ఖననం చేయకుండా, శిరచ్ఛేదం చేసిన తలలని బల్లేలకి గుచ్చి ప్రదర్శనకు ఉంచారు. థామస్ మూంత్సర్ తలని మూల్ హౌసెన్ దగ్గర కొండపైనా, ఫైఫర్ తలని బోల్ స్టెడ్ గ్రామానికి వెళ్ళే రహదారి కూడలి దగ్గరా ప్రదర్శనకు పెట్టారు. తమతో పాటు వాళ్ళు మోసుకుపోయిందేమిటి? అతి కొద్ది సంఖ్యలో ఆయుధాలని, వాటితో పాటు ఒక ఇంద్రధనుస్సు జెండాని. ఇది జరిగింది సరిగ్గా ఐదు వందల సంవత్సరాల క్రితం, ఇదే నెల, 1525 మే మాసంలో.



క్రూరమైన యుద్ధంలో హననమై, ఖననమైన శాంతిని తమతోపాటు మోసుకుపోయారు. వాద, వివాదాలనీ, భిన్నాభిప్రాయాలనీ, తాము పూర్తిచేయాలనుకుని పూర్తి చేసిన వాటినీ, అసంపూర్ణంగా మిగిలిన వాటినీ, చేయలేని వాటినీ తమతోపాటే తీసుకుపోయారు.

జర్మన్ విప్లవ నాయకురాలు రోజా లగ్జెంబర్గ్, తాను హత్యకు గురవ్వడానికి ఒక్కరోజు ముందు, జనవరి 14, 1919న ఈ మాటలు రాసింది: "...ఈ ఓటమి నుంచి భవిష్యత్తు విజయాలు పుట్టుకొస్తాయి. 'బెర్లిన్ నగరంలో శాంతి, భద్రతలు నెలకొన్నాయి'. తెలివిమాలిన తొత్తులారా! మీ శాంతి, భద్రతలు ఇసుక పునాదుల మీద కట్టిన మేడల లాంటివి. రేపు విప్లవం తిరిగి లేస్తుంది, ఆయుధాలతో తలపడుతుంది. మిమ్మల్ని భయకంపితం చేస్తూ, భేరీ ఘోషతో నినాదాన్ని వినిపిస్తుంది. నేను విప్లవాన్ని, నిన్న వున్నాను, ఈ రోజు నిలబడ్డాను, రేపు కూడా నిలిచే ఉంటాను." రోజా లగ్జెంబర్గ్ తలపై రైఫిళ్ళతో తలపై మోది హింసించారు. కాల్చి చంపి, తన దేహాన్ని బెర్లిన్ నగరంలోని ఒక కాలువలో పడవేశారు. మరొక విప్లవ నాయకుడు కార్ల్ లీబ్‌నెఖ్ట్‌ని కూడా కాల్చి చంపి బెర్లిన్ జంతు ప్రదర్శనశాల కంచెల దగ్గర గుర్తు తెలియని శవంగా పడవేశారు. ఇంతకూ వాళ్ళు తమతో పాటు తీసుకుపోయినవేమిటి? రోజా లగ్జెంబర్గ్ ఖైదులో ఉన్న ఒకానొక సాయంత్రపు వేళ గురించి ఈ మాటలు రాసింది: "నీలి రంగులో మెరిసిపోతున్న ఆకాశంలో తెల్లటి మబ్బులు రెండు ఎంతో ఎత్తున తారాడుతున్నాయి. ...పక్షుల గుంపులు రోజూలాగే సాయంత్రం తమ గూళ్లకు చేరే ప్రయాణాన్ని మొదలుపెట్టాయి. పట్టులా మెరిసే ఆ నీలి ఆకాశాన్ని మొనదేలిన తమ రెక్కలతో కొంచెం, కొంచెంగా కత్తిరిస్తూ, ముందుకూ, వెనక్కూ ఎగురుతూ, ఒకదానినొకటి దాటిపోతూ గోలగోలగా అరుస్తున్నాయి. అంతలోనే ఆకాశంలో కనిపించకుండా పైపైకి ఎగిరిపోతున్నాయి. నీటిబిందువులు జారిపడుతున్న ఆ పాత్రని చేతులలో పట్టుకుని, తల వెనక్కి తిప్పి చూస్తాను నేను. తడి, తడిగా మెరిసే ఆ నీలిమలోకి ఎగిరి దూకి ఈదులాడాలనీ, ఆ తుషార బిందువులలో కలిసి, కరిగిపోవాలనీ గాఢమైన కోరిక నన్ను కమ్ముకుంటుంది." వాళ్ళు మేఘాలనీ, ఆకాశాన్నీ, బహుశా పక్షులనీ తమతో మోసుకుపోయారు.

స్పానిష్ నియంతృత్వ సైన్యం, ప్రఖ్యాత కవి ఫెడరికో గార్షియా లోర్కాని ఆగస్టు 19, 1936న నిర్బంధంలోకి తీసుకున్నది. గవర్నర్ వాల్డెస్, లోర్కాని ఏం చేయాలనే విషయంలో ఆదేశాలకోసం సైనిక అధికారులని అడిగాడు. ఫోన్ అందుకున్న సైనిక జనరల్ చుట్టూ ఆర్డర్లీ సిబ్బంది. మౌఖిక ఆదేశాలు ఇచ్చే ఆ గొంతులో అధికార గర్వంతో నిండిన నిశ్చితత్వం వినపడింది. "ఏం చేయాలని అడుగుతున్నావేమిటి? తనకి కాఫీ ఇవ్వు, సరిపోయేంత వరకూ చాలా చాలా కాఫీ ఇవ్వు." సందేశాన్ని అందుకున్న అధికారులు, గొప్ప కవి లోర్కాని కాల్చి చంపేశారు. లోర్కా తనతో పాటు ఏం తీసుకువెళ్లాడు? వెళుతూ వెళుతూ తనతో పాటు ఒక కవితని తీసుకుపోయాడు: "వాళ్ళు నన్ను హత్య చేశారని అప్పుడు నాకు అర్థం అయింది/ నా కోసం వాళ్ళు కాఫీ దుకాణాలలో, స్మశానాలలో, చర్చిలలో వెదికారు/ కానీ వాళ్ళకి నేను దొరకలేదు/ నేనెన్నడూ వాళ్ళ చేతికి చిక్కలేదు/ లేదు, వాళ్ళకి నేనెన్నడూ దొరకలేదు."

వాళ్ళు తమతో పాటు దేన్ని మోసుకుపోయారు? యుద్ధాన్ని, బహుశా బలహీనమైన గొంతుతో శాంతిని, క్రూరమైన యుద్ధంలో హననమై, ఖననమైన శాంతిని తమతోపాటు మోసుకుపోయారు. తీవ్రమైన వాద, వివాదాలనీ, భిన్నాభిప్రాయాలనీ, తాము పూర్తి చేయాలనుకుని పూర్తి చేసిన వాటినీ, చేయలేక అసంపూర్ణంగా మిగిలిన వాటినీ, చేయలేని వాటినీ తమతో పాటే తీసుకుపోయారు. తమ తప్పులనీ, పొరపాట్లనీ, సరిదిద్దుకునే ప్రయత్నాలనీ తీసుకుపోయారు. వాళ్ళు ప్రయాస పడుతూ విప్లవ భారాన్ని తమతోపాటు మోసుకు వెళ్ళారు. వాళ్ళు ఇప్పుడు ఇక లేరు. ఓటమి కళ్ళు విప్పార్చుకుని వాళ్ళ కళ్ళలోకి సూటిగా చూస్తూ వుంది. భూమీ, భూమిలోని సంపదా మిగిలే ఉన్నాయి. యుద్ధం ఇంకా మనముందు నిలబడే ఉంది.

వాళ్ళు భూమినీ, ఆకాశాన్నీ తమతో తీసుకుపోయారు. భూమిలోపల, అడవులలోపల అపారమైన సంపదలు నిక్షిప్తమై ఉన్నాయి. ఆ సంపదలని బయటికి తీయాలి. దురదృష్టవశాత్తూ, భూమి మీదా, అడవుల లోపలా, కొండలపైనా మనుషులు ఉన్నారు. వాళ్ళు తమతో పాటు ఏం మోసుకుపోయారు? లేదూ, భూమి వాళ్ళని మోసిందా? ఇప్పుడు భూమి వాళ్ళని కప్పివేసింది. కవి టి.ఎస్ ఇలియట్ రాశాడు, "ఏప్రిల్ నెల అత్యంత క్రూరమైనది/ మృత భూమిలో లైలాక్ పూలు వికసిస్తున్నాయి/ జ్ఞాపకాలనీ, కోరికలనీ కలగలుపుతూ/ వసంత కాలపు వర్షం కృశించిపోయిన వేర్లకి ప్రాణం పోస్తూ". బహుశా, మే మాసం కూడా క్రూరమైనదేనేమో.

• సుధాకిరణ్

మతమౌఢ్యంతో మారణహోమం!

ఇటీవల చోటుచేసుకున్న పహల్గాం ఘటన హిందూ సమాజానికి ఓ హెచ్చరిక. హిందువులనే లక్ష్యంగా చేసుకొని కశ్మీర్‌లో జిహాదీ మూకలు ఉగ్ర దాడికి తెగబడ్డాయి. కల్మా చదవకపోతే చంపేస్తారా?!

ఇప్పటికే బంగ్లాదేశ్‌లో హిందువుల ఊచకోత, అత్యాచారాలు, ఆస్తుల లూటీ, ఇళ్ల ధ్వంసం, వారిని చిత్రహింసలకు గురిచేయడం అనే రాక్షసక్రీడ కొనసాగుతూనే ఉంది. అంతలోనే హిందూదేశంగా భావించే భారత్‌లో పహల్గాం వంటి దౌర్జన్య ఉగ్ర రాక్షసి కోరలు చాచి హిందువులపై మారణకాండ జరపడం అత్యంత అమానుషం. మానవ హక్కుల సంఘాలు, రాజ్యాంగ పరిరక్షకులు, సెక్యులరిస్టులు, మేధావులు, జర్నలిస్టులు ఈ చర్యపై ఏ విధంగా స్పందించారో హిందూ సమాజం తెలుసుకోవాలి. మైనారిటీల హక్కుల కోసం గొంతెత్తే అవార్డు వాపసి బృందాలు పహల్గాం విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నాయో అర్థం చేసుకోవాలి.

"ఐక్యంగా ఉంటేనే బలంగా ఉంటాం" అనే నినాదం ద్వారా హిందూ సమాజం సంఘటితం కావాలి. ఢిల్లీలో ఓ వ్యక్తి శ్రీరాముడి ఫొటోను డీపీగా పెట్టుకున్నందుకు ఇంట్లో జొరబడి అతణ్ణి హత్య చేశారు! రాజస్థాన్‌లో కన్నయ్యలాల్ అనే టైలర్ తలనరికారు. హిందూ పేరు ఉందని కశ్మీర్‌లో ఉపాధ్యాయులను హత్య చేశారు. మరోవైపు లవ్ జిహాద్ కేసులు దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇలాంటి సమయంలో మోదీ, యోగి అవసరం లేకుండా మనమే ధర్మరక్షణ, ప్రాణరక్షణ కోసం సంసిద్ధంగా ఉండాలి.

– పగుడాకుల బాలస్వామి
విశ్వహిందూ పరిషత్

తెలంగాణపై కాదు, కేసీఆర్ విధానాలపైనే ఆక్రోశం!

'కృష్ణా జలాల పునఃపంపిణీ తెలంగాణ జన్మహక్కు' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో (మే 14) తెలంగాణకు చెందిన విశ్రాంత సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీధర్‌రావు దేశ్‌పాండే రాసిన ఆర్టికల్ నిరాధారమైన ఆరోపణతో మొదలైంది: నేను "ఎప్పటి అలవాటు ప్రకారమే తెలంగాణపై అక్కసు వెళ్లగక్కాన"ని ఆరోపించారు. నేను గాని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు గాని మీరు ఆరోపించినట్లు తెలంగాణ ప్రజలకు వ్యతిరేకం కాదు. కాకుంటే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావోద్వేగ విద్వేష విధానాలకు వ్యతిరేకంగా అనేక మార్లు రాసిన మాట వాస్తవం. ఆ విమర్శలను మొత్తంగా తెలంగాణకు అన్వయించడం సరికాదు.

బచావత్ ట్రిబ్యునల్ విచారణ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు నీటి వాటా తగ్గిన అంశం పలుమార్లు ఉల్లేఖించాను. తెలంగాణతో పాటు అవశేష ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ కూడా దక్షిణ తెలంగాణ లాగా అన్యాయానికి గురైన విషయం శ్రీధర్‌రావు దేశ్‌పాండేకు తెలియనిది కాదు. అయినా వెనుకబడిన రాయలసీమకే బేసిన్ ఆవల అనే నెపంతో స్పాట్ పెట్టడం గమనార్హం. తెలంగాణకు గాని తుదకు రాయలసీమకు గాని జరిగిన అన్యాయం ఏదైనా వుంటే బేసిన్ మొత్తం మీద నీటి పంపిణీ జరిగినప్పుడు తప్ప 2014లో రాష్ట్ర విభజన జరిగినపుడు మాత్రం కాదు. రాష్ట్ర విభజనకు ముందే కేసీఆర్ నీళ్ల కోసం ఉద్యమాలు సాగించి ఉన్నారు కదా! బచావత్ ట్రిబ్యునల్ కూడా వాస్తవంలో చేసిందేమీ లేదు. 1969 నాటికి నిర్మింపబడి, లేదా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేసింది. హైదరాబాద్ సంస్థానంలో గాని, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత గాని రాష్ట్రాన్ని పాలించిన నేతలు తెలంగాణ ప్రాంతంలో ప్రాజెక్టులు నిర్మించని నేరమది.

రాష్ట్ర విభజన తర్వాత అధికారం చేపట్టిన కేసీఆర్ ఏనాడైనా బేసిన్ మొత్తం మీద తిరిగి కృష్ణా నదీ జలాలు అన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ జరగాలని తుదకు మాట వరసకు కూడా కోరిన సందర్భం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేసిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ (2013) తీర్పు పునః పరిశీలన జరగాలని ఎన్నడైనా కోరారా? బేసిన్ మొత్తం మీద నీటి కేటాయింపులు జరిగినపుడు సంభవించిన అన్యాయాన్ని గాలికి వదిలేసి అవశేష ఆంధ్రప్రదేశ్‌తోనే వివాదానికి దిగారంటే అది కేవలం భావోద్వేగాలతో అధికారం సుస్థిరం చేసుకొనేందుకు కేసీఆర్ పన్నిన వ్యూహం కాదా?

నిజానికి కృష్ణా లోటు బేసిన్ కాదని శ్రీధర్‌రావు దేశ్‌పాండే అంటున్నారు. ఇదే నిజమైతే 2019లో ఎన్నికలు జరిగి ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే శ్రీశైలం జలాశయంలో కేవలం 400 టీయంసీలు మాత్రమే లభ్యత ఉంటుందని గోదావరి కృష్ణా నదుల అనుసంధానం చేసి గోదావరి నుండి 900 టీయంసీలు తరలించాలనే పథకం కేసీఆర్ ఎందుకు ప్రతిపాదించారు? ఒక ఇంజనీరింగ్ టీమ్ నెలలకొద్ది కసరత్తు చేయలేదా? బహుశా ఆ టీములో మీరు కూడా ఉన్నారేమో గుర్తు చేసుకోండి.

తెలంగాణకు గాని, రాయలసీమకు గాని జరిగిన అన్యాయం ఏదైనా వుంటే బేసిన్ మొత్తం మీద నీటి పంపిణీ జరిగినప్పుడే తప్ప 2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు మాత్రం కాదు. ఆనాటి అన్యాయాన్ని గాలికి వదిలేసి అవశేష ఆంధ్రప్రదేశ్‌తోనే వివాదానికి దిగారంటే అది కేవలం భావోద్వేగాలతో అధికారం సుస్థిరం చేసుకొనేందుకు కేసీఆర్ పన్నిన వ్యూహం కాదా?



అవశేష ఆంధ్రప్రదేశ్‌లో నిత్య క్షామ పీడిత ప్రాంతమైన రాయలసీమ ప్రస్తావన వచ్చినపుడల్లా బేసిన్ అంశం తీసుకు వస్తున్నారు. గొంతెండిపోతున్న రాయలసీమలో రెండు జిల్లాలకు చెందినది కెసి కెనాల్. ఇటీవలనే ఈ కాలువకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. చారిత్రక ప్రాధాన్యం వున్న దృష్ట్యా ఇంటర్నేషనల్ కమీషన్ ఆన్ ఇర్రిగేషన్ అండ్ డ్రైనేజ్ సంస్థ అవార్డుకు ఎంపిక చేసింది. శతాబ్దానికి పైగా కృష్ణా జలాలు వినియోగిస్తున్న కెసి కెనాల్ అదీ బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులు రద్దు చేసి తమకు కేటాయించమని కేసీఆర్ ప్రభుత్వం గతంలోనే ట్రిబ్యునల్ ముందు కోరడం సబబేనా?

బేసిన్ వెలుపల అని చెప్పబడే మరో ప్రాంతం సాగర్ కుడి కాలువ ఆయకట్టు. దీనికి బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేసింది. శ్రీధర్‌రావు దేశ్‌పాండే చెబుతున్నట్లు ఎగువ రాష్ట్రాలు అభ్యంతరం పెట్టినా బచావత్ ట్రిబ్యునల్ కెసి కెనాల్‌కు సాగర్ కుడి కాలువకు నిర్దిష్టంగా నీటి కేటాయింపులు చేసింది. ఒకవైపు కృష్ణా బేసిన్ వచ్చేసరికి బేసిన్ ఆవల అనే అభ్యంతరాలు పెట్టిన శ్రీధర్‌రావు దేశ్‌పాండే తెలంగాణలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాకతీయ కాలువ గోదావరి బేసిన్ నుండి కృష్ణా బేసిన్‌కు వచ్చే అంశం గమనంలోనికి ఎందుకు తీసుకోరు? అంతెందుకు, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు సంగతేమిటి? అంతిమంగా కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ఏం చెబుతారు? తాము మాత్రం గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్‌కు నీళ్లు తరలించవచ్చు కాని దక్షిణ తెలంగాణ కన్నా కనాకష్టంగా మెట్ట ప్రాంతానికి కొన్ని దశాబ్దాలుగా నీళ్లు ఇచ్చే కెసి కెనాల్‌కు కృష్ణా నీటిని బంద్ చేయమనడం ఎంత వరకు న్యాయం? శ్రీధర్‌రావు దేశ్‌పాండే క్యారీ ఓవర్ నిల్వ గురించి చెబుతూ ఆంధ్రప్రదేశ్‌పై నిందారోపణ చేశారు.

సెక్షన్ 89 తెలంగాణకు న్యాయం చేయదని కేసీఆర్ భావించి కొత్త ట్రిబ్యునల్ కోసం కృషి చేసి సాధించారని శ్రీధర్‌రావు దేశ్‌పాండే చెబుతున్నారు. ట్రిబ్యునల్ నియామకంపై ఇప్పుడు సుప్రీంకోర్టులో కేసు నడుస్తోంది. అదలా వుంచితే కేసీఆర్ న్యాయబద్ధంగా వ్యవహరించి ఉంటే రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89కి సవరణ చేయించుకొని ఉండాలి. ఎందుకంటే రాష్ట్ర విభజన చట్టం ఉభయ పార్లమెంటు సభల ఆమోదం పొందినది. పైగా రాష్ట్ర విభజన చట్టం 11 షెడ్యూల్ (4)లో కూడా ఇందు గురించి స్పష్టత ఉంది.

ట్రిబ్యునల్ తీర్పుతోనే అవశేష ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల వివాదం పరిష్కారం కాదు. ఇందుకు అనేక ఉదంతాలున్నాయి. కావేరి వివాదం ఏమైంది? అంతిమంగా శాంతి భద్రతల సమస్య తలెత్తితే న్యాయ పరమైన అంశాలు పక్కన బెట్టి (ట్రిబ్యునల్ తీర్పు నోటిపై జరిగితే సుప్రీంకోర్టుకు అధికారం లేదు) సుప్రీంకోర్టు జోక్యంతో సద్దుమణిగినా అప్పుడప్పుడు వివాదం రాజుకుంటూనే వుంది. 2004లో నియమింపబడిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2013లో తీర్పు ఇస్తే సుప్రీంకోర్టు స్టేతో దస్త్రాలకే పరిమితమై వుంది. కొత్తగా నియమించబడిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ మున్ముందు ఏలాంటి తీర్పు ఇస్తుందో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో పక్కనబెడితే సుప్రీంకోర్టు కేసు నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలు వాదులాటలు అటకెక్కించి సామరస్యానికి లాకు లెత్తడమే అత్యుత్తమం.

■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు



అక్రమార్కులపై చర్యలేవి?

- సబ్ ఇంజనీర్ల నియామకాల్లో అక్రమాలు
- ఏడాది కిందటే బాధ్యుల గుర్తింపు
- వారిపై వేటు వేయడంలో తాత్సారం

7



సర్కారీ విద్యకు 'యంగ్'లుక్

ఉమ్మడి జిల్లాకు మరో నాలుగు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు

- పాలకుర్తి, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ, మహబూబాబాద్ నియోజకవర్గాలకు మంజూరు
- ఒక్కో స్కూల్‌కు రూ.200 కోట్లు విడుదల
- గతంలో ఏడు స్కూళ్లు మంజూరు

హనుమకొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్సులు మంజూరయ్యాయి. జనగామ జిల్లాలోని పాలకుర్తి, వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట, హనుమకొండ జిల్లాలోని వరంగల్ పశ్చిమ, మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్ నియోజకవర్గాలకు ఈ పాఠశాల భవన సముదాయాలు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో భవన సముదాయం నిర్మాణానికి రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ.800 కోట్లను విడుదల చేసింది. రెండో విడతగా మొత్తం 20 నియోజకవర్గాలకు ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరు చేయగా, అందులో ఉమ్మడి వరంగల్ నుంచి నాలుగు ఉన్నాయి. గతంలో మొదటి విడతగా ఏడు నియోజకవర్గాలకు ఈ స్కూళ్లు మంజూరయ్యాయి. కొత్తగా మంజూరైనవి కలుపుకొని మొత్తం స్కూళ్ల సంఖ్య పదకొండుకు పెరిగింది. జనగామ నియోజకవర్గానికి రెండో విడతలో కూడా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కాలేదు.

రెండో విడతలో..

పాలకుర్తి నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను కొడకండ్ల మండలంలో ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. స్థల పరిశీలన జరుగుతున్నది. మహబూబాబాద్ నియోజకవర్గ స్కూల్‌ను గూడూరు మండలం కేంద్రంలో ఏర్పాటు చేసే

మిగతా 8వ పేజీలో...



ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.200కోట్లు విడుదల చేసిన జీవో కాపీను చూపిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్

- గుండ్ల సింగారం ప్రాంతంలో నిర్మాణం
- ఎంజీఎంలో పని చేయని వైద్యులు, సిబ్బందిని ఇంటికి పంపుతాం..
- నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల భవనాలపై చర్యలు
- రెండునెలల్లో సూపర్ స్పెషాలిటీ నిర్మాణం పూర్తి
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

6



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

లాభసాటి వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేయాలి

- జూన్ 2న లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

6

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- కాల్పుల విరమణలో ట్రంప్ పాత్రపై మోదీ వివరణ ఇవ్వాలి..
- ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే ఉద్యమాలు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సీపీఎం జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

హనుమకొండ చౌరస్తా, మే 28 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య ఒప్పందాలు రద్దు చేసుకుంటామని బెదిరించి, భారత్ - పాకిస్థాన్ దేశాలతో కాల్పుల విరమణకు ఒప్పించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై ప్రధాని నరేంద్రమోదీ వివరణ ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. హనుమకొండ రాంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు. ట్రంప్ జోక్యంతో కాల్పుల విరమణ జరగడంపై దేశ ప్రజలు అవమానంగా భావిస్తున్నారన్నారు. ట్రంప్ వాఖ్యలను ప్రధానిమోదీ ఖండించకపోవడం పలు సందేహాలకు తావిస్తోందన్నారు. నీతి ఆయోగ్ సమావేశంలో భారత్ ఆర్థిక వ్యవస్థలో 4వ స్థానానికి చేరిందని నరేంద్రమోదీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆకలి సూచికలో భారత్‌ది 111వ స్థానంలో ఉందని, ఆర్థికంగా బలపడితే

మిగతా 8వ పేజీలో...



- మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీకి ఏర్పాట్లు
- వర్షాకాలంలో బియ్యం పంపిణీకి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు
- కోటాను ఎక్కడ నిల్వ చేయాలో తెలియక డీలర్ల టెన్షన్
- షాపుల్లో మూడు నెలల బియ్యాన్ని నిల్వ చేయలేని పరిస్థితి
- ప్రభుత్వ పాఠశాలలు, గోదాములను పరిశీలిస్తున్న అధికారులు, డీలర్లు
- పనిలో పనిగా రేషన్ కార్డుల ఏరివేతపై అధికారుల దృష్టి
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11,24,893 తెల్ల రేషన్ కార్డులు
- ప్రతీ నెల పేదలకు 21,250 టన్నుల బియ్యం పంపిణీ

అటు రేషన్.. ఇటు పరేషాన్..

రేషన్ డీలర్లకు కొత్త చిక్కొచ్చి పడింది. ప్రకృతి విపత్తుల నేపథ్యంలో రేషన్‌కార్డుదారులకు మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో.. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యాన్ని జూన్ 25వ తేదీలోగా పంపిణీ చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ కార్యాచరణ డీలర్లను అయోమయానికి గురిచేస్తోంది. 3 నెలల స్టాక్ 63,750 మెట్రిక్ టన్నుల బియ్యం ఒకేసారి రానుండటంతో వాటిని ఎక్కడ నిల్వ చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా పౌరసరఫరాల శాఖ అధికారులు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలిస్తున్నారు. అయితే స్టాక్ చేసే భవనాల్లోకి వర్షం నీరు చేరి బియ్యం తడిసినా, ఎవరైనా బియ్యాన్ని కాజేసినా, చివరకు పందికొక్కులు తినేసినా ఆ నష్టానికి డీలర్లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అనర్హులైన తెల్ల రేషన్‌కార్డుదారులను ఏరివేసేందుకు చర్యలు చేపడుతుండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది.

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి

వరంగల్, మే 28 : రేషన్.. టెన్షన్ పెడుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యాన్ని చౌకదుకాణాలకు సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే మూడు నెలల బియ్యాన్ని షాపుల్లో నిల్వ చేసే పరిస్థితి లేకపోవటంతో డీలర్లు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ భవనాల్లో నిల్వ చేస్తే వర్షానికి తడిసినా, చోరీకి గురైనా బాధ్యత తమదే కావటంతో డీలర్లు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పనిలో పనిగా ఐదారు నెలలకు పైగా తెల్లకార్డులపై బియ్యాన్ని తీసుకెళ్లని లబ్ధిదారులపై అధికారులు నజర్ వేశారు. ఏ కారణాల చేత బియ్యాన్ని తీసుకెళ్లటం లేదనే కోణంలో ఆరా తీయటమే కాకుండా.. అనర్హులుగా గుర్తించి తెల్లకార్డును తొలిగించేందుకు ఏర్పాట్లు చేస్తుండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో 25వేల మందికి పైగా రేషన్ తీసుకెళ్లటం లేదని

మిగతా 6వ పేజీలో...

3నెలల బియ్యం ఒకేసారి..

వర్షాలతోపాటు ప్రకృతి విపత్తుల నేపథ్యంలో పేదల రేషన్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి ఇవ్వాలని కేంద్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యాన్ని జూన్ 25వ తేదీలోగా పంపిణీ చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే గత ఏప్రిల్ నుంచి పేదలకు రేషన్‌కార్డుల ద్వారా సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. దీంతో దాదాపు 90శాతం మందికి పైగా లబ్ధిదారులు రేషన్‌లో వచ్చే సన్న బియ్యాన్ని తీసుకెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

విత్తన చట్టంతో రైతులకు ఎంతో మేలు

- రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం
- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి
- నగరంలో విత్తన చట్టం ముసాయిదా కమిటీ తొలి పర్యటన

7

కాజీపేటలో

ఏడీఆర్‌ఎం తనిఖీలు

అబివృద్ధి పనుల పరిశీలన

కాజీపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): కాజీపేట జంక్షన్‌లో బుధవారం అసిస్టెంట్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.గోపాల్ తనిఖీలు చేశారు. అభివృద్ధి పనులను పరిశీలించారు. అమృత్ భారత్ స్కీమ్‌లో భాగంగా చేపడుతున్న రైల్వే స్టేషన్, ప్లాట్‌ఫారాలు, వెయిటింగ్ హాల్స్, రన్నింగ్ రూమ్, డీజిల్ షెడ్, ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో చేస్తున్న పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలు చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏడీఆర్‌ఎం వెంట సీనియర్ డీఎంఈ వెంకట్ కుమార్, డీఈఎన్ సెంట్రల్ ప్రజ్వల్, ఎస్ఎస్ఈ మౌనికాతో పాటు హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

కత్తులతో దాడి

- పరకాల మాజీ కౌన్సిలర్ ఎ.దశరథంపై హత్యాయత్నం
- రాజకీయ కక్షలే కారణమని అనుమానం

హసన్‌పర్తి, మే 28 (ఆంధ్రజ్యోతి): పరకాల మాజీ కౌన్సిలర్ ఆల్ల దశరథంపై బుధవారం మండలంలోని సిద్ధాపూర్ శివారు ప్రాంతంలో దాడి జరిగినట్లు సమాచారం. ఈ మేరకు బాధితుడి భార్య పరకాల పోలీసులను ఆశ్రయించగా, ఘటన జరిగిన స్థలం హసన్‌పర్తి పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుందని చెప్పడంతో ఆమె హసన్‌పర్తి పోలీసుస్టేషన్‌కు వెళ్లినట్లు సమాచారం. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. పరకాల మాజీ కౌన్సిలర్ దశరథం బీఆర్ఎస్ పార్టీలో కీలకంగా వ్యవహరించేవారు. కొన్ని నెలల కిందట ఇదే పార్టీకి చెందిన ఓ వ్యక్తి, దశరథంలు మధ్య ఒకరి మీద ఒకరు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టుకోవడంతో వీరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆ వ్యక్తిపై దశరథం దాడి చేయగా విషయం పోలీసుస్టేషన్‌కు చేరింది. అయితే ఇది మనసులో పెట్టుకున్న ఆ వ్యక్తే బుధవారం సిద్ధాపూర్ శివారులో కాపుకాచి దశరథంపై కత్తులతో దాడి చేయగా గాయపడినట్లు తెలిసింది. గాయపడిన దశరథం ఎంజీఎంకు తరలించగా, మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ విషయంపై హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలను ఫోన్‌లో వివరణ కోరగా.. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బంగారం పాయే..! పరిహారం ఏమాయే..?

- రాయపర్తి ఎస్‌బీఐ చోరీ బాధితుల గోడు
- తాకట్టు పెట్టిన బంగారం ఏడు నెలల కిందట చోరీ
- మొత్తం 19 కిలోల బంగారం దొంగలపాలు
- ఇప్పటివరకు రెండున్నర కిలోల సొత్తు రికవరీ
- పరిహారంపై బ్యాంకు అధికారుల పొంతన లేని హామీలు
- తమకు న్యాయం చేయాలంటున్న బాధితులు

7



రాయపర్తి ఎస్‌బీఐ బ్యాంకులో ఆందోళన చేస్తున్న బాధితులు (ఫైల్)

ఆర్నెల్ల కిందట రాయపర్తిలోని ఎస్‌బీఐలో జరిగిన చోరీ గుర్తుందా...? సామాన్య ప్రజలు బ్యాంకులో కుదువపెట్టిన 19 కిలోల బంగారు ఆభరణాలను ఓ అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా దర్జాగా చోరీ చేసి పరారైంది. తాజా మార్కెట్ రేటు ప్రకారం వీటి విలువ రూ.17 కోట్లపైనే ఉంటుంది. ఇప్పటివరకు పోలీసులు ఐదుగురిని అరెస్టు చేసి, రెండున్నర కిలోల బంగారాన్ని మాత్రమే రికవరీ చేశారు. ఇంకా 16.5 కిలోల బంగారం స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. నెలలు గడుస్తున్నా రికవరీ కాకపోతుండటంతో బాధితులు ఆందోళనకు దిగుతున్నారు. తమకు బంగారానికి బంగారం గానీ, తాజా మార్కెట్ రేట్ ప్రకారం పరిహారం గానీ ఇవ్వాలని వారు కోరుతున్నారు. అయితే బ్యాంకు అధికారులు పొంతన లేని మాటలు మాట్లాడుతుండటంతో అయోమయం నెలకొంటోంది. ఈ లొల్లికి ఎప్పుడు తెరపడుతుందో తెలియడం లేదు.

– ఆంధ్రజ్యోతి, రాయపర్తి





కాళేశ్వరాలయ హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కాళేశ్వరాలయ హుండీ లెక్కింపు

సమకూరిన రూ.2.83 కోట్ల ఆదాయం

మహదేవపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం హుండీలను బుధవారం ఆలయ ఈవో మహేష్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా సహాయ కమిషనర్ ఆర్.సునీత ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీల పర్యవేక్షణ అధికారిగా ఇన్‌స్పెక్టర్ నందనం కవిత వ్యవహరించారు. సరస్వతి పుష్కరాలు 12 రోజులతో సహా మొత్తం 64 రోజులకు గాను రూ.1,36,28,099 ఆదాయం సమకూరింది. పుష్కరాల సందర్భంగా వచ్చిన వివిధ రకాల ఆదాయ వివరాలు ఇలా ఉన్నాయి. గదుల ద్వారా రూ.1,71,000, హోమాల ద్వారా రూ.1,23,000, శీఘ్ర దర్శనం ద్వారా రూ.5,60,000, ప్రసాదాల ద్వారా రూ.1,38,36,552, హుండీల ఆదాయం రూ.1,36,28,099, మొత్తం రూ.2,83,18,651 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో తెలిపారు. మిశ్రమ బంగారం 15 గ్రాములు, మిశ్రమ వెండి 1750 గ్రాములు వచ్చిందన్నారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, పుష్కరాల ఉత్సవ కమిటీ సభ్యులు, యూనియన్ బ్యాంకు సిబ్బంది, దేవస్థానం సిబ్బంది, అన్నమయ్య సేవా ట్రస్టు సేవా సమితి సభ్యులు, కాళేశ్వరం ఎస్సై తమాష రెడ్డి పాల్గొన్నారు.

లాభసాటి వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేయాలి

జూన్ 2న లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ

వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హనుమకొండ కలెక్టరేట్/ వరంగల్ కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం పథకం కింద లాభసాటి వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేసి పక్కాగా గ్రౌండింగ్ జరిగేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం రాజీవ్ యువవికాసం అమలుపై రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావులతో కలిసి హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వాలు కార్పొరేషన్ ద్వారా మొక్కుబడిగా పథకాలు అమలు చేశాయని, తమ ప్రభుత్వం లక్షలాది మంది యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే చిత్తశుద్ధితో రాజీవ్ యువవికాసం పథకం అమలు చేస్తోందన్నారు. రూ.8వేల కోట్లతో దాదాపు 5లక్షల మంది యువతను వ్యాపారవేత్తలుగా మారుస్తున్నామని, ప్రభుత్వం పెట్టే ప్రతీ పైసా పెట్టుబడి ఎలా పని చేస్తుందో రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని, రాష్ట్ర జీడీపీ వృద్ధిలో ఈ పథకం భాగస్వామ్యం కావాలన్నారు. మంజూరు చేసిన యూనిట్ల గ్రౌండింగ్ అనంతరం వాటి పనితీరు పర్యవేక్షించేందుకు జిల్లాలో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే ఇన్‌చార్జి మంత్రుల సమావేశంలో రాజీవ్ యువవికాసంపై చర్చించి తుది జాబితా ఆమోదం చేయాలన్నారు. జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, అందులో యువ వికాసం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు.

రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాజీవ్ యువవికాసం పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు వైవి.గణేష్, మేన శ్రీను, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, వరంగల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేశ్, ఎల్‌డీఎం రాజు, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్లు పుష్పలత, రమేశ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్

గుండ్ల సింగారం ప్రాంతంలో నిర్మాణం : పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, మే 28(ఆంధ్రజ్యోతి): వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటు కానున్నట్లు కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వం రూ.200కోట్ల నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్ కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. హనుమకొండ గుండ్ల సింగారం ప్రాంతంలో స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవలే ఆస్పత్రి సందర్శన సమయంలో కొందరు వైద్యులు, సిబ్బంది పనితీరు బాగాలేదని గుర్తించామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఇంటికి పంపుతామని స్పష్టం చేశారు. రానున్న రెండు నెలల్లో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పూర్తి కానున్నట్లు ప్రకటించారు. అలాగే హనుమకొండ చౌరస్తా, కాకాజీకాలనీ ఇతర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రి భవనాలపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. రెసిడెన్షియల్ ఏరియాలో కమర్షియల్ నిర్మాణాలు జరిగాయని, అదేవిధంగా కొన్ని ఆస్పత్రి భవనాలు కూడా నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లను వినియోగిస్తున్నాయన్నారు. ఈ మేరకు ప్రజల నుంచి తనకు ఫిర్యాదులు కూడా అందాయన్నారు. దీనిపై త్వరలోనే సమగ్ర విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘించిన భవనాలపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. జూన్ తొలివారంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వరంగల్‌కు రానున్నట్లు ప్రకటించారు. ఎంజీఎంతోపాటు నగరంలోని ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు, సమస్యలు, నిధుల కేటాయింపు తదితర అంశాలపై రెండు రోజుల పాటు సమీక్ష జరుపుతారని చెప్పారు.



డీసీసీ భవన్ వద్ద సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

వీధి వ్యాపారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. హనుమకొండ లోని పలు ప్రాంతాల్లో ఏర్పడుతున్న సమస్యలకు శాశ్వత చర్యల్లో భాగంగా వీధి వ్యాపారులకు కూడా న్యాయం చేయనున్నట్లు చెప్పారు. అభివృద్ధి అవరోధకులుగా మారిన బీఆర్ఎస్ నేతలు తమ స్వార్థం కోసం వీధి వ్యాపారులను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు గతంలో వెండింగ్ జోన్స్‌ను అక్రమంగా దక్కించుకొని అద్దెకు ఇచ్చారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ కార్మిక నాయకుడినని ప్రకటించుకోవడం హాస్యాస్పదమన్నారు. ఆయన కార్మికులకు చేసిందేమిటని ప్రశ్నించారు. కార్మిక భవన్‌ను ఏర్పాటు చేయలేని ఆయన కార్మిక నాయకుడు ఎలా అవుతాడని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని 15 నెలల కాంగ్రెస్ పాలనలో చేసి చూపిస్తున్నామని పేర్కొన్నారు. నగరాభివృద్ధికి బీఆర్ఎస్ చేసింది శూన్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నగర సమగ్రాభివృద్ధి కోసం ఎంతో సహకరిస్తున్నారని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి కోరిన వెంటనే నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అలాగే బీఆర్ఎస్‌లో దయ్యాలు ఉన్నాయని ఎమ్మెల్సీ కవిత ప్రకటించడం నిజమే అని రాజేందర్‌రెడ్డి అన్నారు.

కాగా, మీడియా సమావేశం అనంతరం ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుపై ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్న బీజేపీ

పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాలు, న్యూడెమోక్రసీ, మాస్‌లైన్ నాయకులు

మహబూబాబాద్ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం, చట్టాలు, ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తుందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ప్రజాసంఘాలు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, మాస్‌లైన్ నేతలు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌లో ఈ నెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది చనిపోయారని, వారి మృతదేహాలను కనీసం కుటుంబసభ్యులకు కూడా అప్పగించకపోవడంతో వారు మనోవేదనకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని చెప్పారు. ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం ఈనెల 26న నంబాల కేశవరావుతో పాటు మరో ఏడుగురి శవాలను దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ నేతలు రమాదేవి, సంజీవ, నాగభూషణం, ఎన్డీ, మాస్‌లైన్, ప్రజా సంఘాల నాయకులు మండల వెంకన్న, గౌని ఐలయ్య, చిన్నచంద్రన్న, వట్టం ఉపేందర్, హరినాయక్, బోడ లక్ష్మణ్, గుగులోతు భీమానాయక్, మహోభా, హెచ్. లింగన్న, అశోక్, గీత, గుజ్జు దేవేందర్, సామ పాపయ్య, బట్టు చైతన్య పాల్గొన్నారు.

వంగపహాడ్‌లో యువకుడి అదృశ్యం



మహ్మద్ సిద్ధిఖీ (ఫైల్)

హసన్‌పర్తి, మే 28 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ఎడవల్లికి చెందిన యువకుడు మహ్మద్ సిద్ధిఖీ (35) ఈ నెల 24న వంగపహాడ్‌లో అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు, ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ఎడవెల్లికి చెందిన మహ్మద్ అక్బర్ సిద్ధిఖీ కుమారుడు మహ్మద్ సిద్ధిఖీ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 24న వైజాగ్ నుంచి ఫర్టిలైజర్ లోడుతో లారీ బయలుదేరి మహారాష్ట్రకు వెళుతుండగా మార్గమధ్యలో హసన్‌పర్తి మండలం ఆరెపల్లి - వంగపహాడ్ క్రాస్ ఓఆర్ఆర్‌పై లారీని ఆపి అతిగా మద్యం సేవించాడు. లారీని నడపలేని పరిస్థితిలో ఉండగా లారీ క్లీనర్ రాజప్ప లారీ యజమాని మహ్మద్ అజారుద్దీన్‌కు విషయం తెలిపాడు. దీంతో లారీ యజమాని వేరే డ్రైవర్‌ను పంపించి లారీని తీసుకెళ్లాడు. ఈ క్రమంలోనే లారీ డ్రైవర్ మహ్మద్ సిద్ధిఖీ వంగపహాడ్ ఓఆర్ఆర్ రోడ్డు పైనే ఉండడంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అతడిని పట్టుకొని ఆరా తీయగా జరిగిన విషయం చెప్పాడు. అనంతరం పోలీసులు అతడిని మరో లారీలో నిజామాబాద్‌కు పంపించగా ఇంటికి వెళ్లలేదు. దీంతో సిద్ధిఖీ చిన్నాన్న మహ్మద్ అక్రమ్ హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు.

దొంగ నోట్ల కలకలం

పర్వతగిరిలో గుర్తించిన బ్యాంక్ అధికారులు



గుర్తించిన దొంగ నోట్లు

పర్వతగిరి, మే 28 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని దుర్గ శ్రీ వైన్స్‌లో దొంగనోట్ల కలకలం సృష్టిస్తోంది. వైన్స్ యజమాని కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రోజువారి లాగే వైన్ షాపు తెరిచి ఉన్న క్రమంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు లిక్కర్ కొనేందుకు వచ్చి మొదటి వ్యక్తి రూ.500 దొంగ నోటు ఇచ్చి లిక్కర్ కొనుగోలు చేశాడు. మరో వ్యక్తి రెండు రూ.100 నోట్లు ఇచ్చి లిక్కర్ తీసుకున్నాడు. వైన్‌షాపు యజమాని బుధవారం రోజు నగదును స్థానిక పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జమచేసేందుకు వెళ్లగా బ్యాంకు అధికారులు ఒక రూ.500, రెండు రూ.100 నోట్లు దొంగనోట్లుగా గుర్తించారు. దీంతో దొంగ నోట్ల చెలామణి విషయం వెలుగులోకి వచ్చింది.

అటు రేషన్... ఇటు పరేషాన్..

(5వ పేజీ తరువాయి)

అధికారులు గుర్తించినట్లుగా సమాచారం.

నిల్వలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11,24,893 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిపై ప్రతీ నెల 21,250 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పేదలకు అందిస్తున్నారు. ఈ క్రమంలో మూడు నెలలకు 63,750 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. అయితే అన్ని జిల్లాల్లో సరిపడా బియ్యం నిల్వలు ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వరంగల్ జిల్లాలో 509రేషన్ షాపుల ద్వారా 2,66,694 తెల్లకార్డులపై ప్రతీనెల 4,977.33 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. 3 నెలలకు 14,932 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. కాగా, జిల్లాలో మూడు ఎల్ఎంఎస్ పాయింట్లలో ప్రస్తుతం 50వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. అంటే సుమారు 10నెలలకు కావాల్సిన స్టాక్ వరంగల్ జిల్లాలో ఉంది. అలాగే హనమకొండ జిల్లాలో 413 రేషన్ షాపులు ఉండగా, 2,31,516 తెల్లకార్డుల ద్వారా ప్రతీనెల 4,300 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. 3 నెలలకు 12,900మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం కాగా, జిల్లాలో ఉన్న రెండు ఎంఎల్ఎస్ పాయింట్లు, బఫర్ గోదాముల్లో 23వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయి. అలాగే మహబూబాబాద్ జిల్లాల్లో 558 రేషన్ షాపులు ఉండగా, 2,43,204 తెల్లకార్డులపై ప్రతీనెల 4,804.68మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. 3 నెలలకు 14,414 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం కాగా, జిల్లాలో ఆరు ఎంఎల్ఎస్ పాయింట్లలో 500 మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వ ఉంది. అయితే 11 బఫర్ గోదాముల్లో 52వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు.

అలాగే జనగామ జిల్లాలో 335 రేషన్ షాపులు ఉండగా, 1,63,283 కార్డుల ద్వారా 3,151 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. 3 నెలలకు 9,453 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం కాగా, 24,871 మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. భూపాలపల్లి జిల్లాలో 277 రేషన్ షాపులు ఉండగా, 1,25,588 కార్డుల ద్వారా ప్రతీ నెల ప్రభుత్వం 2,300 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. 3 నెలలకు సంబంధించి 6,900మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం కాగా, జిల్లాలో రెండు ఎంఎల్ఎస్ పాయింట్లలో కేవలం 47 మెట్రిక్ టన్నుల బియ్యమే నిల్వ ఉంది. అయితే బఫర్ గోదాముల్లో 30,131 మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వ ఉన్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. ములుగు జిల్లాలో 222 రేషన్‌షాపులు ఉండగా, 94,628 కార్డుల ద్వారా ప్రతీనెల పేదలకు 1,717 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. 3 నెలలకు 3,434 టన్నుల బియ్యం అవసరం కాగా, జిల్లాలో మూడు ఎంఎల్ఎస్ పాయింట్లలో 353 మెట్రిక్ టన్నుల బియ్యమే నిల్వ ఉంది. బఫర్ గోదాముల్లో 23వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. ఒకటిరెండు జిల్లాల్లో ఎంఎల్ఎస్ పాయింట్లలో సరిపడా బియ్యం నిల్వలు ప్రస్తుతం లేకపోయినప్పటికీ బఫర్ గోదాముల నుంచి సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరు జిల్లాల్లో మొత్తం మూడు నెలలకు 63,750 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. అయితే ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసే ప్రక్రియలో ఉండటంతో వాటిపై కూడా అదనంగా బియ్యం ఇవ్వాల్సి ఉంది. దీంతో మరో 10వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరంగా అధికారులు గుర్తించారు. ప్రస్తుతం తెలంగాణలో సన్నవడ్లను పండిస్తుండటంతో సన్నబియ్యానికి కొరత లేదని అధికారులు అంటున్నారు.

డీలర్లకు బియ్యం స్టాక్ టెన్షన్

రేషన్ షాపు డీలర్లకు బియ్యాన్ని నిల్వ చేసేందుకు స్థలం కరువైంది. ప్రతీనెల షాపునకు వచ్చే బియ్యాన్ని మాత్రమే నిల్వ చేసే సామర్థ్యం మాత్రమే చాలావరకు ఉంది. అయితే 3 నెలల స్టాక్ ఒకేసారి వస్తుండటంతో వాటిని నిల్వ చేయటం డీలర్లకు సవాల్‌గా మారింది. హనుమకొండ, వరంగల్ నగరాలతో పాటు అన్ని జిల్లా కేంద్రాలు, మునిసిపాలిటీల్లో రేషన్ డీలర్ షాపులు చాలావరకు ఇరుకు ప్రాంతాల్లో ఉండటంతో 3నెలల సరుకులు తరలించటం కూడా ఇబ్బందిగా మారింది. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు మూడు నెలల బియ్యాన్ని స్టాక్ చేసేందుకు ఆయా గ్రామాలు, వార్డు పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వం భవనాలను పరిశీలిస్తున్నారు.

జూన్ 12వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలల ప్రారంభం కానుండటంతో ఈలోగా బియ్యాన్ని పంపిణీ చేసి, ఉపాధ్యాయులకు గదులను అందించేలా కొన్ని చోట్ల ఏర్పాట్లు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల కమ్యూనిటీ హాళ్లు, కుల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, నిరుపయోగంగా ఉన్న పాఠశాలల భవనాలను పరిశీలిస్తున్నారు. ఏవీ అందుబాటులో లేనిచోట ప్రైవేటు ఇళ్లను అద్దెకు తీసుకుంటున్నారు. అయితే డీలర్లకు 3నెలల బియ్యాన్ని నిల్వ చేయటం సవాల్‌గా మారింది. వర్షాలతో ఇప్పటికే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టాక్ చేసే భవనాల్లోకి వర్షం నీరు చేరి బియ్యం తడిసినా.. ఎవరైనా బియ్యాన్ని కాజేసినా.. నెల పాటు పంపిణీ చేయాల్సి ఉండటంతో చివరకు పందికొక్కులు బియ్యాన్ని తినేసినా డీలర్లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రతీబస్తాపై ఒకటి, రెండుకిలోల తరుగు వస్తోందని డీలర్లు ఆందోళనలో ఉన్నారు. తాజాగా 3 నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో పాటు తరుగు, ఇతర నష్టాలను తామే భరించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్‌కార్డుల ఏరివేత గుబులు

పౌరసరఫరాల శాఖ అధికారులు అనర్హుల ఏరివేతపై దృష్టి పెట్టారు. గతంలో దొడ్డు బియ్యాన్ని తీసుకునేందుకు చాలామంది ఆసక్తి చూపలేదు. కొందరు దొడ్డు బియ్యానికి బదులుగా డీలర్ల వద్ద నుంచి డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే గత ఏప్రిల్ నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. అయితే కొన్ని జిల్లాల్లో 90శాతం కూడా బియ్యం పంపిణీ కాకపోవటం అధికారుల దృష్టికి వచ్చినట్లుగా సమాచారం. దీంతో గత ఐదారు నెలలుగా వరుసగా బియ్యం తీసుకోని లబ్ధిదారుల జాబితాను అధికారులు సిద్ధం చేసినట్లుగా సమాచారం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 25వేల మంది రెగ్యులర్‌గా బియ్యాన్ని తీసుకెళ్లటం లేదని అధికారులు గుర్తించినట్లుగా సమాచారం. వీరిలో గత ఏప్రిల్, మే నెలలో సన్నబియ్యాన్ని కూడా ఎంతమంది తీసుకెళ్లలేదో వివరాలు సేకరిస్తున్నారు. ఒక్క హనుమకొండ జిల్లాలోనే 1,700మందికి పైగా రేషన్ బియ్యాన్ని తీసుకెళ్లటం లేదని అధికారుల దృష్టికి వచ్చింది. వరంగల్, జనగామ, భూపాలపల్లి జిల్లాల్లో కూడా ఇలాంటివారు ఉన్నట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. బియ్యం అవసరం లేనివారి వివరాలు సేకరించి తెల్ల కార్డులను రద్దు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారనే చర్చ జరుగుతోంది.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టాలి

● వరంగల్ కలెక్టర్ సత్యశారద ● ఖానాపురం, పర్వతగిరిలో పర్యటన



ఖానాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

ఖానాపురం/పర్వతగిరి, మే 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనగోళ్లను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద కోరారు. బుధవారం ఖానాపురం, మనుబోతులగడ్డలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు కలెక్టర్ ఎదుట తమ గోడును వెల్లబోసుకున్నారు. రోజూ కురుస్తున్న వర్షాల వల్ల ధాన్యాన్ని ఆరబెట్టలేకపోతున్నామని, ధాన్యంలో తేమ శాతం తగ్గడంలేదని, దీంతో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. హమాలీలు, లారీలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకోకుండా ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి ఆదుకోవాలని పలువురు రైతులు చేతులు జోడించి కలెక్టర్‌ను వేడుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం రైతులను నుంచి ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో కౌసల్యదేవి, డీసీవో నీరజ, సివిల్ సప్లయీస్ డీఎం సంధ్యారాణి, కిష్టయ్య, నర్సంపేట ఏఎంసీ చైర్మన్ పి.శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఎస్.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

● వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సత్యశారద సూచించారు. బుధవారం పర్వతగిరి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు అధైర్యపడొద్దని, రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు, రవాణా వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం రైతుల నుంచి ధాన్యం పక్కాగా సేకరిస్తామని, రైతులు ఆందోళనకు గురి కావద్దని తెలిపారు. రానున్న మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలిపినందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఎస్‌డీవో కౌసల్యాదేవి, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ సంధ్యారాణి, సరఫరాల అధికారి కిష్టయ్య, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ టి.వెంకటస్వామి, ఐకేపీ ఏపీఎం కృష్ణమూర్తి, సీసీ కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి Classifieds
Wanted · Real Estate · Health · Beautician · Jobs · For Sale

WANTED (F) TELECALLERS
★ Female and Male " Internal & External" H.R. Recruiters. Required Urgently. SAL+INC. etc., Locations Hnk & Hyd. Send CV to brg.hrteam@gmail.com, Whatsapp.No: 9393113929
AJW-7657

WANTED
★ Wanted Billing & Employees for GNR Supermarket, Newly Opening in Bheemaram. Contact : 9908260693
AJW-1

WANTED
★ హన్మకొండ చౌరస్తాలోని సింగార్ గార్మెంట్స్‌లో పని చేయుటకు అనుభవం గల సేల్స్ గర్ల్స్ మరియు బాయ్స్ కావలెను. సం॥ప్ర॥ 9908925685
AJW-237381

సెక్యూరిటి గార్డ్స్ & సూపర్ వైజర్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటి గార్డ్స్ మరియు సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను జీతం : 12000 - 14000 సం॥ప్ర॥ 8309693457
AJW-237379

WANTED
★ చికెన్,& చేపలపచ్చడి రూ.25/- నాటుకోడి రూ.30/- మటన్ & రొయ్యలు రూ.35/- ధర గల పొచులు కిరాణా & ఇతర షాపులకు వేసి అమ్ముటకు ఫ్రీస్ కావలెను. డైలీ 3000/- వరకు ఆదాయం ఉంటుంది మండలానికి ఒకరు మాత్రమే : 8143909459.
AJM-12953

PLOT FOR SALE
★ వరంగల్ నర్సంపేట్ రోడ్ మచ్చాపూర్ నుండి 8 నిముషాలు దూరంలో లక్ష్మీపురం ఫామ్ ల్యాండ్ 120 గజాలు 4,00,000/- మీరు ప్రాపర్టీ తీసుకొని, మీ బంధు మిత్రులకు 10 ప్లాట్స్ అమ్మడం ద్వారా మీ ప్లాట్స్ డబ్బులు పొందే అవకాశం. సం॥ప్ర॥ 9160127942
AJW-7659

PLOT FOR SALE
★ మామునూరు ఎయిర్ పోర్ట్ దగ్గరలో KUDA ప్లాట్లు, ఘన్‌పూర్ NH163 ఆనుకోని ఉన్న వెంచర్ లో KUDA ప్లాట్లు అమ్మబడును. సం॥ప్ర॥ 9573735007
AJW-237378

గొప్ప అవకాశం
★ KU ద్యూబాలు కెనాల్ నుండి 900 మీ॥ దూరంలో 80 ఫీట్ల రోడుకు ప్లాట్స్, వాలా పర్మిషన్ విత్ రిజిస్ట్రేషన్ ప్లాట్స్, రెసిడెన్షియల్ జోన్, లోన్ సౌకర్యం కలదు. గజం 12,000 మాత్రమే. సం॥ప్ర॥ 9182538110, 8341175144
AJW-7658

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
9985411677
9985411676
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

కాల్చేస్తే కాలుష్యం..

కలియదున్నితే సేంద్రియం

వరి, పత్తి, మొక్కజొన్న కొయ్యలను కాల్చొద్దంటున్న అధికారులు



మొక్కజొన్న కొయ్యలను కాల్చివేసిన దృశ్యం

వరంగల్ వ్యవసాయం, మే 28 (ఆంధ్ర జ్యోతి): రైతులు వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, కంది కొయ్యలను కాలుస్తూ వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్నారు. పంట చేతికి వచ్చిన అనంతరం వాటి కొయ్యలను ఆదే పొలాల్లో కాల్చకుండా కలియ దున్నితే భూసారం పెరుగుతుందని తెలియకపోవడం, ఈ విషయంలో వ్యవసాయశాఖ అధికారులు వారికి అవగాహన కల్పించకపోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతోంది.

అవశేషాలు కాల్చడానికి ప్రధాన కారణాలు

- మొదటి, రెండో పంట మధ్య తక్కువ సమయం ఉండటం.
- అవశేషాలు కుళ్లడానికి అధిక సమయం పట్టడం.

పంట అవశేషాల ఉపయోగాలు

- వరి, మొక్కొజొన్న కొయ్యలను పశువులకు మేతగా ఉపయోగించవచ్చు. పత్తి, మిరప, కంది కొయ్యలను పంట చెరుకుగా వాడుకోవచ్చు.
- సేంద్రియ ఎరువులలో కంపోస్టింగ్, పుట్ట గొడుగుల సాగు కోసం ఉపయోగించవచ్చు.
- నేలలో కార్బన స్థాయితో పాటు భూభౌతిక లక్షణాలు పెరుగుతాయి.
- నేల మీద మల్చ్‌గా ఉపయోగించవచ్చు.

నేలలో కలియ దున్నితే..

- నేలలో కలియ దున్నితే సేంద్రియ కార్బనం పెరుగుతుంది. తద్వారా సూక్ష్మ జీవుల సాంద్రత పెరిగి నత్రజని ఇతర పోషకాల లభ్యత పెరుగుతుంది. నేలలో కలియ దున్నడానికి వరిలో అయితే మల్చర్, పత్తిలో అయితే శెడ్డర్ వాడుకోవాలి. దీని వల్ల పంట వ్యర్థాలు నేలలో కలిసిపోయి నేల సామర్థ్యం పెరుగుతుంది.
- గడ్డి త్వరగా కుళ్లడానికి వ్యర్థ డికంపోజర్ లేదాపూసాడికంపో జర్, లేదా పీజేటిఎస్ఏయూ కన్సార్టియం ఉపయోగించాలి.

కాల్చడం వల్ల వచ్చే సమస్యలు

- పర్యావరణం కాలుష్యమవుతుంది.
- భూసారం క్షీణించడంతో పాటు నత్రజని కార్బనస్థాయి తగ్గుతుంది. ఉపయోగకరమైన సూక్ష్మజీవులు, కీటకాలు చనిపోతాయి.
- భూమిలో నత్రజనితో పాటు భాస్వరం, పొటాషియం, సల్ఫర్‌కు నష్టం వాటిల్లుతుంది.
- వరి గడ్డిని కాల్చడం వల్ల వెలుబడే మిథేన్ సంబంధిత వాయువుల ద్వారా ఓజోన్ పొర దెబ్బ తిని మానవాళి మనుగడకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది.
- తీవ్ర పశుగ్రాసం కొరత ఏర్పడి పశుపోషణ భారం అవుతుంది. పాల ఉత్పత్తుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..



పంట అవశేషాలను కాల్చవద్దని రైతులకు చెబుతూనే ఉన్నాం. కానీ రైతులకు తొందరెక్కువ. సాగు చేసిన పంట పూర్తి అయ్యాక వాటి అవశేషాలను అందులోనే కలియదున్నితే భూసారం పెరిగి అధిక దిగుబడి వచ్చేందుకు అవకాశం ఉన్నప్పటికీ అంత సమయం వేచిచూసే ఓపిక లేక పంట అవశేషాలను అందులోనే కాల్చి వేస్తున్నారు. పంట అవశేషాలను కాల్చిన వెంటనే మరోపంట వేసేందుకు సిద్ధమవుతున్నారు. అందుకనే ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ఇటీవల రైతుల ముంగిటనే శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని చేపట్టింది. వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు కలిసి రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి పంట సాగు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇక మీదట ఇలాంటి సమస్యలు తలెత్తవు.

కె.అనురాధ, వరంగల్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి

వరంగల్ నిట్‌లో త్వరలో టెమ్ పరికరం

- పరిశోధనలకు ఇది ఎంతో ఉపయుక్తం
- నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి
- టెమ్ నమూనా తయారీ పరికరాల ప్రదర్శన
- విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్న ఎక్స్‌పో



వరంగల్ నిట్‌లో టెమ్ ఎక్స్‌పోలో పరికరాల గురించి వివరిస్తున్న నిర్వాహకులు

హనుమకొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో ఎంతో ఉపయుక్తంగా ఉండే ట్రాన్స్‌మిషన్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోపీ (టెమ్) పరికాలను అందుబాటులోకి తీసుకువస్తామని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి అన్నారు. బుధవారం నిట్ క్యాంపస్‌లో టెమ్ నమూనా తయారీ పరికరాల ప్రదర్శన, ఎక్స్‌పో, వర్క్‌షాపు ఘనంగా ప్రారంభమైంది. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధీ దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూక్ష్మ, నానో స్థాయిల్లో అత్యంత కచ్చితమైన విశ్లేషణలకు వీలు కల్పించే ఈ ఆధునిక పరికరాలు వరంగల్ ఎన్ఐటీతోపాటు చుట్టుపక్కల ఉన్న విద్యాసంస్థల్లోని పరిశోధకులకు ఎంతో దోహదపడతాయన్నారు. ఇవి పదార్థశాస్త్రం, ఎలక్ట్రానిక్స్, నానో టెక్నాలజీ రంగాల్లో నూతన ఆవిష్కరణకు ఊతం ఇస్తాయని అభిప్రాయపడ్డారు.

సీఆర్ఐఎఫ్ అధిపతి ప్రొఫెసర్ వీవీ శ్రీ లక్ష్మి మాట్లాడుతూ.. ఈ సదుపాయాన్ని నిట్‌లోని సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ (సీఆర్ఐఎఫ్)లో చేర్చడం ద్వారా పరిశోధనలో ప్రమాణాలు మరింత పెరుగుతాయన్నారు. కోఆర్డినేటర్ మడుపు హరీష్ మాట్లాడుతూ.. ఈ ఎక్స్‌పోలో దేశీయంగా తయారైన టెమ్ పరికరాలను ప్రదర్శించడం వల్ల స్వదేశీ ఆవిష్కరణలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. అంతర్జాతీయ శాస్త్ర, సాంకేతిక వేదికలపై భారతదేశం స్థానం మరింత బలపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నిట్ డీన్ (అకడమిక్) ప్రొఫెసర్ ఎశరత్ బాబు, ఇతర సాంకేతిక అధికారులు, అధ్యాపకులు, నిట్‌లోని వివిధ విభాగాలకు చెందిన ఫ్యాకల్టీ, పరిశోధకులు పాల్గొన్నారు. నిట్‌లోని సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ (సీఆర్ఐఎఫ్) ఈ ఎక్స్‌పోను ఏర్పాటు చేసింది. ఈ ఎక్స్‌పోలో పాల్గొన్నవారికి ఈ సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహించిన హ్యాండ్స్ ఆన్ సెషన్లు ఆధునిక టెమ్ నమూనా తయారీలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రాయోగికంగా నేర్పాయి.

పుష్కర విజయంలో స్వచ్ఛ సారథులు

పారిశుధ్య నిర్వహణపై సర్వత్రా ప్రశంసలు

- కాళేశ్వరంలో ఎప్పటికప్పుడు చెత్త తొలగింపు
- మనోళ్లతో పాటు ఏపీ కార్మికులదీ కీలక పాత్ర
- విద్యుత్, వైద్య సిబ్బంది సేవలపైనా సంతృప్తి



కాళేశ్వరంలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు



ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కోసం చేసిన ఏర్పాటు

భూపాలపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరిగిన సరస్వతీ పుష్కరాల విజయంలో పారిశుధ్య కార్మికులు ప్రధాన భూమికను పోషించారు. ఉత్సవాలు పరిశుభ్రమైన వాతావరణంలో సాగడంలో వీరంతా కీలకంగా వ్యవహరించారు. పుష్కరాలు సాగిన 12 రోజుల్లో వాతావరణం సహకరించకపోయినా పారిశుధ్య కార్మికులు మొక్కవోని దీక్షతో ఎక్కడా అపరిశుభ్రత లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేశారు. తాత్కాలిక బస్టాండ్ మొదలుకొని కాళేశ్వరంలోని అన్ని వీధులు, రహదారులు, పుష్కర ఘాట్ల లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించారు. పుష్కరాలకు సంబంధించి పారిశుధ్య పనులు ఎవరికి అప్పగించాలని తర్జనభర్జనలు పడుతున్న సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి, ప్రకాశం, గుంటూరు, నంద్యాల ప్రాంతాలకు చెందిన కార్మికులకు సమాచారం ఇవ్వడంతో వారు ముందుకొచ్చారు. మొత్తం 566 మంది కార్మికులు పనిచేయగా ఇందులో 350 మందికి పైగా రాజమండ్రి, ప్రకాశం జిల్లాలకు చెందిన వారే. వీరంతా ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తూ చెత్తా చెదారం లేకుండా చేశారు. పుష్కరాలు సాగిన 12రోజుల్లో ఆరు రోజులపాటు భారీ వర్షాలు కురిశాయి. దీంతో పుష్కరఘాట్లు సహా దారులన్నీ బురదమయమయ్యాయి. పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు బురదను నియంత్రించే చర్యలు చేపట్టడంతో పాటు దుర్గంధం వ్యాపించకుండా బ్లీచింగ్ చేస్తూ వచ్చారు. 143 మంది అధికారులు పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బంది కలగకుండా చూశారు.

విద్యుత్, వైద్య సేవల పైనా సంతృప్తి..

సరస్వతి పుష్కరాల్లో విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కూడా సమర్థవంతమైన సేవలు అందించారు. ముఖ్యంగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో వర్షం పడిన ప్రతిసారీ విద్యుత్ సరఫరా వ్యవస్థ దారుణంగా దెబ్బతింది. విద్యుత్ సిబ్బంది తక్షణమే దెబ్బతిన్న వ్యవస్థలను సరి చేస్తూ కరెంటు సరఫరాను పునరుద్ధరించడంలో కీలకంగా వ్యవహరించారు. రాత్రిపూట పుష్కర స్నానాలు చేసే భక్తులకు ఆటంకాలు ఎదురుకాకుండా చూడటంలో ముఖ్య భూమిక పోషించారు. అటు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు కూడా 11 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 1.30లక్షల మందికి సేవలు అందించారు. అలాగే వడదెబ్బ బారిన పడకుండా రెండు లక్షల ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసి సుమారు రూ.25 లక్షల విలువైన ఔషధాలను ఉచితంగా అందజేశారు.

దైవ కార్యంగా భావించి పని చేశాం..



పుష్కరాల్లో పారిశుధ్య సేవలందించడం దైవకార్యంగా భావించి పని చేశాం. పుష్కరాల్లో సేవ చేస్తే దేవుడికి సేవ చేసినట్లే అని భావించి.. కూలి ఎంత అనేది చూడకుండా పనికి ఒప్పుకున్నాం. అధికారులు రోజుకు రూ.600 చెల్లించారు. మూడు పూటలా ఆహారం, వసతి కల్పించారు. 12 రోజుల పాటు పని చేసినా ఎక్కడా కష్టపడ్డామన్న భా వన కలగలేదు. గోదావరి పుష్కరాలకు పిలిస్తే మళ్లీ వస్తాం..

- రాజు, మిట్ట గడపల గ్రామం. రాజమండ్రి

భక్తుల ప్రశంసలతో కష్టాన్ని మరచిపోయాం..



పుష్కరాల్లో పారిశుధ్య పనులు నిర్వహించడం ఆనందంగా ఉంది. ఆహారం, వసతిలో సమస్యలు రాకుండా అధికారులు చక్కగా చూసుకున్నారు. రోడ్లను పరిశుభ్రంగా ఉంచినందుకు పుష్కరాలకు వచ్చిన భక్తులు ప్రశంసించడం మా కష్టాన్ని మరచిపోయేలా చేసింది.

- ప్రమీల పారిశుధ్య కార్మికురాలు, రాజమండ్రి



వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న బాధితులు (ఫైల్)

బంగారం పాయే..! పరిహారం ఏమాయే..?

రాయపర్తి ఎస్‌బీఐ చోరీ బాధితుల గోడు

రాయపర్తి, మే 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో జరిగిన చోరీ రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించిన విషయం విదితమే. గతేడాది నవంబరు 19న జరిగిన చోరీలో దుండగులు దాదాపు రూ.13కోట్లకు పైగా విలువ చేసే 19 కిలోల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. బంగారం తాకట్టు పెట్టిన 496 మంది ఈ ఘటనలో బాధితులుగా మిగిలారు. అయితే నెలలు గడుస్తున్నా దొంగలను పట్టుకోవడంలో, బంగారం రికవరీ చేయడంలో పోలీసుల ప్రయత్నాలు కొలిక్కిరాకపోతుండటంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా బంగారానికి బంగారం, లేదా నష్టపరిహారంగా ఆ రోజు రేటును కట్టిస్తామని బాధితులకు నచ్చచెప్పి ఎస్‌బీఐ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాధితుల ఆందోళన

రాయపర్తి మండలంలోని మైలారం, మహబూబ్‌నగర్, రాయపర్తి, పెర్కవేడుతో పాటు పలు గ్రామాలకు చెందిన పలువురు బాధితులు ఇప్పటికీ మూడుసార్లు రాయపర్తి ఎస్‌బీఐ బ్యాంకుల ఎదుట ఆందోళనకు దిగారు. తమ బంగారాన్ని ఇంకా వెతికి ఇవ్వడం లేదని, బంగారం బదులు బంగారం ఇస్తామని ఒకసారి, తాజారేటును కట్టిస్తామని మరోసారి చెప్పి బ్యాంకు అధికారులుదాట వేస్తున్నారని ఆరోపించారు. అధికారుల మాటలకు, చేతలకు పొంతన ఉండడం లేదని విమర్శిస్తున్నారు. తమ బంగారానికి ప్రస్తుత రేటునే కట్టించాలని, అప్పటి రేటు ఎలా కట్టిస్తారని ప్రశ్నించారు. ఎప్పుడు నష్టపరిహారం ఇస్తారో అప్పటి బంగారం రేటే ఇవ్వాలని, లేదంటే బంగారం ఆర్నమెంట్‌లా అందించాలని డిమాండ్ చేశారు.

నిర్లక్ష్యమని తేలితే..

బ్యాంకులో బంగారం చోరీ జరిగితే బాధితులకు బంగారం తిరిగి ఇవ్వడం లేదా నష్టపరిహారం అందించడం అనేది పలు అంశాలపై ఆధారపడి ఉంటుంది. వీటిలో బ్యాంకు లాకర్ ఒప్పందం ఉంటుంది. లాకర్ తీసుకునేటప్పుడు బ్యాంకు, కస్టమర్ల మధ్య ఒప్పందం జరుగుతుంది. ఈ ఒప్పందంలో చోరీ జరిగితే బాధ్యత ఎంతవరకు ఉంటుందో స్పష్టం గా ఉంటుంది. వీటిలో బాధ్యత పరిమితం చేయబడి ఉండొచ్చు. తమ లాకర్లలోని వస్తువులకు బీమా పాలసీ సైతం ఉండి పరిమితులు ఉంటాయి. చోరీ జరిగిన పరిస్థితులను బట్టి కూడా నష్టపరిహారం మారుతుంది. బ్యాంకు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల చోరీ జరిగిందని పోలీసుల విచారణలో తేలితే బ్యాంకు ఎక్కువ నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. దీని కోసం చోరీ జరిగిన విధానం, నేరస్థుల వివరాలు వంటివి పరిగణలోకి తీసుకుంటారు. బాధితులు కోర్టును సైతం ఆశ్రయించి కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు బ్యాంకు అధికారులు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. కానీ, వీటిపై బాధితులకు బ్యాంకు అధికారులు వివరించకపోవడం పలు అనుమానాలకు వ్యక్తం అవుతోంది.

పోలీసులకు సవాల్

ఏడు నెలల కిందట జరిగిన చోరీ కేసు పోలీసుల సవాల్‌గా మారింది. ఇప్పటివరకు ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన ఏడుగురిని గుర్తించారు. ఇందులో ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రెండున్నర కిలోల బంగారం రికవరీ చేశారు. కానీ, కేసులో ప్రధాన సూత్రధారిని, మిగతా బంగారాన్ని రికవరీ చేయలేదు.

నిబంధనల ప్రకారమే అందిస్తాం..

ఎస్‌బీఐలో బంగారం కుదువబెట్టిన వారికి తులం బంగారానికి గ్రాము తరుగు తీసివేసి తొమ్మిది గ్రాముల బంగారాన్ని లెక్కగట్టి రూ.77,710 చొప్పున చెలిస్తాం. బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నిబంధనల ప్రకారం నడుచుకుంటూ, సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

సత్యనారాయణ, ఎస్‌బీఐ మేనేజర్

అక్రమార్కులపై చర్యలేవి?

- సబ్ ఇంజనీర్ల నియామకంలో అక్రమాలు
- ఏడాది కిందటే బాధ్యుల గుర్తింపు
- వారిపై వేటు వేయడంలో తాత్సారం



హనుమకొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ వ్యవస్థ (టీజీ ఎన్‌పీడీసీఎల్) పరిధిలో సబ్ ఇంజనీర్ల నియామకంలో జరిగిన అక్రమాలకు బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవడంలో తాత్సారం జరుగుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగానే శిక్షను తప్పించుకునేందుకు బాధ్యులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ బాట పడుతున్నారు. వారు ఈ మేరకు పెట్టుకున్న దరఖాస్తులకు ఆగమేఘాల మీద ఆమోదించడం లభించడం పలు అనుమానాలను రేకెత్తిస్తున్నది. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో 2018లో జారీఅయిన నోటిఫికేషన్ నెం.02/2018 తేదీ 24-05-2018 ప్రకారం 497 సబ్ ఇంజనీర్ పోస్టులకు గాను 427 పోస్టుల నియామకం జరిగింది. మిగిలిన 70 పోస్టులను డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతి కల్పించారు. దీనివల్ల పరీక్ష రాసి మెరిట్ సాధించినవారికి అన్యాయం జరిగింది. దీనితో నష్టపోయిన అభ్యర్థులు పోరాటం చేపట్టారు. ఈ అక్రమం వెనుక ఎన్‌పీడీసీఎల్‌లో పని చేసే కొందరు ఉద్యోగ సంఘం నాయకుల చేతివాటం ఉన్నట్లు ఆ తర్వాత తేటతెల్లమైంది. ఇదే విషయాన్ని మెరిట్ సాధించి ఉద్యోగం రాక నష్టపోయిన అభ్యర్థులు ఎంపీడీసీఎల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాపాలనలోనూ ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో గత పాలక మండలి సహకారంతో కొందరు ఉద్యోగ సంఘాల నాయకులు ఈ అక్రమాలకు పాల్పడినట్టు ఫిర్యాదులు పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్‌పీడీసీఎల్ పాత పాలక మండలి రద్దయింది. ఏళ్ల తరబడి పాతుకుపోయిన డైరెక్టర్లందరినీ ప్రభుత్వం తొలగించింది. ఐఎస్ఎస్ అధికారి కర్నాటి వరుణ్‌రెడ్డిని సీఎండీగా, సీనియర్ సీజీఎంలను ఇన్‌చార్జ్ డైరెక్టర్లుగా నియమించింది. అర్హులైన అభ్యర్థులు కొత్త సీఎండీని కలిసి తమ గోడు వినిపించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్, పీఎస్ఎస్‌సీకి చెందిన అధికారులతో ఏర్పాటైన ప్రత్యేక విచారణ కమిటీ సబ్ ఇంజనీర్ల నియామకాల్లో అక్రమలు జరిగినట్టు నిగ్గుతేల్చింది. 24 మంది నియామకం అక్రమంగా జరిగినట్టు తేల్చింది. ఇందుకు బాధ్యులైనవారిని గుర్తించింది. వారిపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. దీనితో ఎన్‌పీడీసీఎల్ యాజమాన్యం అక్రమంగా నియామకమైన సబ్ ఇంజనీర్లను తొలగించింది. అర్హులకు అవకాశం కల్పించింది. ఏడాదవుతున్నా బాధ్యులపై ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం విద్యుత్ ఉద్యోగవర్గాల్లో చర్చనీయాంశమైంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులు, ఉద్యోగులపై తక్షణం క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం సహజం. కానీ ఇందుకు విరుద్ధంగా అక్రమార్కుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం ఉద్యోగవర్గాలు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

స్వచ్ఛంద విరమణ

అక్రమార్కులు శిక్ష నుంచి తప్పించుకునేందుకు మార్గాలను వెతుకుతున్నారు. ఒకవేళ శిక్షపడితే తమ ఉద్యోగాలకు ఎసరురావడమే కాకుండా భవిష్యత్తులో రావలసిన సర్వీస్ బెనిఫిట్స్ అన్నీ కోల్పోయే అవకాశం ఉండడంతో ముందు జాగ్రత్త పడుతున్నారు. ఇందులో భాగంగా స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు పూనుకుంటున్నారు. కొందరు ఈ మేరకు దరఖాస్తులు చేసుకోగా ఎన్‌పీడీసీఎల్ యాజమాన్యం పెండింగ్ ఎంక్వైరీ పేరుతో అనుమతులు కూడా ఇచ్చింది. ఈలోగా వీరు తమ పలుకుబడితో పైఅధికారులను మచ్చిక చేసుకొని రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రాబట్టుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది.

విత్తన చట్టంతో రైతులకు ఎంతో మేలు

- రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం
- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి
- నగరంలో విత్తన చట్టం ముసాయిదా కమిటీ తొలి పర్యటన




వేదికపై రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డితో పాటు నూతన విత్తన చట్టం ముసాయిదా తయారీ కమిటీ సభ్యులు

హనుమకొండ, మే 28 (ఆంధ్రజ్యోతి) : నూతన విత్తన చట్టంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోకుండా నివారించడంలో ఇది ఎంతో దోహదపడుతుందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. నూతన విత్తన చట్టం ముసాయిదా కమిటీ తొలి పర్యటనను బుధవారం హనుమకొండలో చేపట్టింది. ఇందులో భాగంగా సుబేదారిలోని జడ్పీ హాల్‌లో సమావేశమైంది. హనుమకొండ, వరంగల్ జిల్లా అధికారులు, విత్తన కంపెనీల ప్రతినిధులు, డీలర్లు, రైతుల అభిప్రాయాలను సేకరించింది.

ఈ సందర్భంగా అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఈ విత్తన చట్టం ముసాయిదా కమిటీ ఏర్పాటే ఉదాహరణ అన్నారు. అందరి సూచనలు, సలహాలను కమిటీ పరిగణలోకి తీసుకొని కఠిన విత్తనచట్టాన్ని తీసుకురావడంలో కృషి చేస్తామని అన్నారు. కమిటీ సభ్యులైన అడ్వకేట్ సునిల్‌కుమార్ మాట్లాడుతూ.. మార్కెట్ చట్టంలోని లోపాలను ఆసరా చేసుకొని కంపెనీలు విత్తనాల విషయంలో ఎలాంటి ఒప్పందాలు లేకుండా విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం తెచ్చినట్టుగా రైతులకు కలిగే నష్టాన్ని నివారించేందుకు విత్తన చట్టం, మార్కెటింగ్ చట్టాల ముసాయిదా తయారు చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న విత్తన చట్టం వల్ల విత్తనోత్పత్తి చేస్తున్న రైతులు, పంటలు సాగు చేస్తున్న రైతులు నష్టపోతున్న తీరును, దాన్ని నివారించాల్సిన అవసరాన్ని కమిటీ సభ్యులు సభ ముందుంచారు.

ఈ సందర్భంగా పాల్గొన్న విత్తన కంపెనీ ప్రతినిధులు, డీలర్లు, రైతులు తమ అభిప్రాయాలను కమిటీకి తెలియచేశారు. విత్తనోత్పత్తి చేస్తున్న రైతులకు తగిన గిట్టుబాటు ధర చెల్లిస్తే నాణ్యత ప్రమాణాలు మరింతగా పాటించగలరని, రైతుల ద్వారా విత్తనోత్పత్తి చేయిస్తున్న ఆర్గనైజర్లకు కనీస విద్యార్హతలను నిర్ణయించాలని, వారికి ప్రభుత్వం లైసెన్సు ఇవ్వాలని, విత్తనోత్పత్తి చేస్తున్న ప్రతీ రైతు వివరాలు నమోదు చేయాలని, నష్టం జరిగినప్పుడు ఈ వివరాలు రైతులకు సాయపడతాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఎక్కువగా అమ్మకం అవుతున్న ట్రూత్ ఫుల్ విత్తనాలకు బదులు సర్టిఫైడ్ సీడ్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆడ, మగ పంటల ఉత్పత్తిలో, సాగులో రైతులు నష్టపోకుండా ప్రతీ సాగును వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అగ్రిమెంట్ చేసుకోవాలని, ప్రస్తుతం ఉన్న చట్టంలోని శిక్షలను పెంచాలని, రైతులు నష్టపోయినప్పుడు వారికి పరిహారం చెల్లింపు చేయడంలో ఉత్పత్తిదారులు, కంపెనీలు, డీలర్లు, ఆర్గనైజర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డి.నర్సింహారెడ్డి, సంగారెడ్డి డీపీవో కె.శివప్రసాద్, వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి కె.అనురాధ, హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్ వ్యవసాయ శాఖ ఏడీఏలు, ఏవోలు, విత్తన కంపెనీ ప్రతినిధులు, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.



ఘనంగా బీరన్న బోనాలు

హసన్‌పర్తి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఐదు రోజులుగా గొల్ల, కురుమల బీరన్న కామరాతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా హసన్‌పర్తిలోని బీరన్న దేవాలయంలో బీరన్న పట్నాలు వేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఇందులో భాగంగా 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించారు. గొల్ల కురుమలు బీరన్నకు బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, మారం తిరుపతి, దాడి రాజు, శ్రీనివాస్, సదానంద, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.


బీరన్న ఉత్సవ వేడుకలలో పాల్గొన్న కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఐ రాజీలేని పోరాటాలు

సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

హసన్‌పర్తి, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఐ రాజీలేని పోరాటాలకు సిద్ధంగా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగిళ్ల లింగారెడ్డి నగర్‌లో మే 26, 27వ తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన సీపీఐ హనుమకొండ జిల్లా మహాసభలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని తెలిపారు. అనంతరం 45 మందితో నూతన జిల్లా కౌన్సిల్, 19 మందితో జిల్లా కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు. జిల్లా కార్యదర్శిగా కర్రె భిక్షపతి, సహాయ కార్యదర్శులుగా తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, కార్యవర్గసభ్యులుగా సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, నద్దునూరిఅశోక్‌స్టాలిన్, బాషబోయిన సంతోష్, మహిళా సమాఖ్య మంచాల రమాదేవి, ఏఐటీయూసీ నుంచి ఎదునూరి వెంకట్రాజం, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, మునగాల భిక్షపతి, నేదునూరి రాజమౌళిలతో పాటు 45 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, జక్కు రాజుగౌడ్, మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి, రాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమాదిగకు డాక్టరేట్ ప్రకటించాలి

కేయూ క్యాంపస్ మే 28, (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ మంద కృష్ణమాదిగకు కాకతీయ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించాలని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ డిమాండ్ చేశారు. బుధవారం కేయూ లైబ్రరీ ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో మంద నరేశ్ మాట్లాడారు. కృష్ణమాదిగ పోరాట స్ఫూర్తి, ప్రజా సేవలకు గుర్తింపుగా కేయూ గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించుకోవాల్సిందని చెప్పారు. విద్యార్థి సంఘాల నేతృత్వంలో కృష్ణమాదిగను ఘనంగా సన్మానిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధార సురేశ్, పరేశ్ల భద్రన్న, కిరణ్, సాయి, వెంకటేశ్, శ్రీనివాస్, చంటి, చరణ్, నరేందర్, విజయ్ పీటర్, మధు బన్ని తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి..

హనుమకొండ చౌరస్తా, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం నందమూరి తారకరామారావుకు భారతరత్న అవార్డును ప్రకటించాలని తెలుగుదేశం పార్టీ వరంగల్ పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యుడు చీకటి రాజు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం టీడీపీ శ్రేణులు హనుమకొండ చౌరస్తాలో ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు దుంపల రమేష్, వంగల దయాకర్, సాంబరాజు సతీష్, తత్తరి హనుమంతరాజు, సతీష్‌గుప్తా, శ్రీరామోజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వర్సిటీ పరిపాలన భవనంలో నూతన లిఫ్ట్

ప్రారంభించిన కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ మే 28, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనంలో నూతనంగా రూ.19.65లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. దివ్యాంగులు, వయోవృద్ధులు పరిపాలన భవనంలోని మొదటి అంతస్తులో అధికారులను కలిసేందుకు ఇబ్బందులు పడుతున్నారని, లిఫ్ట్ ఏర్పాటుతో ఇబ్బందులు లేకుండా కలిసేందుకు అనుకూలంగా ఉంటుందని చెప్పారు. రూ.13.65లక్షలు లిఫ్ట్‌కు, అలాగే రూ.6లక్షలు సివిల్ వర్క్స్ పనులకు ఖర్చు చేసినట్లు తెలిపారు.

రెండు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు

కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆడిటోరియం, కామర్స్ విభాగాల వద్ద నూతనంగా రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు రెండు ట్రాన్స్‌ఫార్మర్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. క్యాంపస్‌లో విద్యుత్ అంతరాయాలను నివారించేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు కరెంట్ స్తంభాలు, హై, లో టెన్షన్ విద్యుత్ లైన్‌లను ఏర్పాటుచేసినట్లు వీసీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌లైన్లతో వర్సిటీలో ఆడిటోరియం, కామర్స్ ఎడ్యుకేషన్ కాలేజీ, దూరవిద్యాకేంద్రం, మహిళ ఇంజనీరింగ్, కెహెచ్ భవనాలలో విద్యుత్ ఇబ్బందులు ఉండవని కేయూ అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘రేకు’ మేకయ్యాడు..

- రాజ్‌పుత్‌కాలనీలో రోడ్డును ఆక్రమించి రేకుల ఏర్పాటు
- ఓ బడా బిల్డర్ నిర్వాకం
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు
- వెంటనే తొలగించాలని డిమాండ్

వరంగల్ కార్పొరేషన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ‘కాదేదీ కబ్జాకు అనర్హం’ అన్నట్టు ఓ బడా బిల్డర్ రేకులతో పాగా వేసి రోడ్డు ఆక్రమణకు స్కెచ్ వేశాడు. అతడి చర్య వల్ల జనం ఇబ్బందులు పడుతున్నా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. హనుమకొండలో 10వ డివిజన్ రాజ్‌పుత్‌కాలనీ, మారమ్మ దేవాలయం నుంచి పద్మాక్షి దేవాలయం, అగ్గలయ్య గుట్ట వరకు గతంలో చిన్న పాటి రోడ్డు ఉండేది. ఇది చిన్నగా ఉండడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడంతో సుమారు 20 ఇండ్ల యజమానులు సెట్ బ్యాక్ జరిగి కట్టడాలు నిర్మించుకున్నారు. చిన్నపాటి గల్లీని 20 ఫీట్ల మేర వెడల్పు చేసుకున్నారు. కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పలుమార్లు స్థానిక ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టేందుకు కృషి చేశారు. ఆరు నెలల కిందట డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో ఓ బడా కాంట్రాక్టర్ (లిక్కర్ డాన్) అడ్డుపుల్ల వేశాడు. స్థానికులు నిర్మించుకోవాలనుకున్న రోడ్డును ఆనుకుని ఓ పెద్ద భవనం నిర్మిస్తూ పక్కనే ఉన్న రోడ్డు స్థలం కూడా తనదే అన్నట్టు రోడ్డును కొంతమేర ఆక్రమించి రేకులు ఏర్పాటు చేశాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేసిన తర్వాత రేకులు తీసి వేస్తానని చెప్పాడు.


రోడ్డును కబ్జా చేసిన రేకుల నిర్మించిన కట్టడం


ఆక్రమించిన రోడ్డుపై ధర్నా చేస్తున్న స్థానికులు

రాజ్‌పుత్‌కాలనీ మారమ్మ దేవాలయం పక్కనే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న బడా బిల్డర్.. భవన నిర్మాణం కోసం అనుమతి పొందే సమయంలో రోడ్డుకు వెనక్కి సెట్‌బ్యాక్ జరిగి ప్రహరీ నిర్మించి అనుమతి పొందినట్లు తెలిపారు. ప్రస్తుతం సెట్ బ్యాక్ జరిగిన ప్రహరీ అలాగే ఉండగానే రోడ్డును ఆక్రమించి రేకులు పాతడం విస్మయం కలిగిస్తోంది. బిల్డర్ చర్యతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రహరీ కంటే 5 నుంచి 10 ఫీట్లు ముందుకు జరిగి రాత్రికి రాత్రే రేకులు ఏర్పాటు చేశారు. ఇదేమిటని ఫోన్ చేసి అడిగితే ‘తర్వాత తీసేస్తాను..’ అని ఒకసారి, ‘తీసెయ్యను..’ అని మరోసారి, ‘ఎక్కడ ఫిర్యాదు చేసుకుంటారో చేసుకోండి..’ అని ఇంకోసారి సమాధానం ఇచ్చినట్టు స్థానికులు చెబుతున్నారు. కాగా, రాజ్‌పుత్‌కాలనీలో రోడ్డుపైన రేకులు ఏర్పాటు చేసి ఆక్రమణకు దిగడానికి నగర పాలక సంస్థలో పని చేస్తున్న కొందరు అధికారులు, ఉద్యోగులు సహకరించినట్టు విశ్వసనీయ సమాచారం. టౌన్‌ప్లానింగ్‌లో పని చేస్తున్న ఓ అధికారితో పాటు కిందిస్థాయి సిబ్బంది పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుని భవన నిర్మాణ అనుమతులు ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. అనుమతిపొందే సమయంలో ప్రహరీ నిర్మించి తర్వాత రోడ్డు తనదేనని జులుం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 50 ఇండ్ల ప్రజలు తమ ఇండ్ల స్థలాలు త్యాగం చేసి రోడ్డు కోసం వదిలి వేస్తే మారమ్మ దేవాలయం స్థలంతో పాటు రోడ్డును కూడా ఆక్రమించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రతీ రోజు వందలాది మంది ప్రజలు ఈ మార్గం గుండా ప్రయాణిస్తారని, అయినా రోడ్డుకు అడ్డంగా రేకులు పాతడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును కబ్జా చేసి రేకులతో అక్రమ నిర్మాణాలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు నిత్యం జనసంచారం ఉండే రోడ్డుకు అడ్డంగా ఉన్న రేకుల కట్టడాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాను..



రోడ్డును ఆక్రమించి రేకులు ఏర్పాటుచేసినట్టు రాజ్‌పుత్‌కాలనీ ప్రజలు వచ్చి చెప్పారు. నేను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించాను. సదరు యజమానికి ఫోన్ చేసి మాట్లాడగా కాంప్లెక్స్ పూర్తి కాగానే తీసి వేస్తాను అని చెప్పాడు. కానీ ఇప్పుడు ఫోన్ ఎత్తడం లేదు. ఈ సమస్యను బల్దియా కమిషనర్, మున్సిపల్ అధికారులకు వెల్లడించినా చర్యలకు పూనుకోవడం లేదు.

\- తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

రాంనగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు కోసం పబ్లిక్ గార్డెన్ సమీపంలోని ఆర్అండ్‌బీ క్వార్టర్స్‌ను రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థల విస్తీర్ణంపై ఆర్అండ్‌బీ ఈఈ సురేశ్‌బాబును కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థలానికి సంబంధించిన మ్యాపును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ మధుసూదన్‌రావు, డీఈ సాంబరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

వడ్డెపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని బుధవారం పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి ఎండీ.రహీం, రాష్ట్ర, జిల్లా నాయకులు హనుమకొండ సాంబయ్య, మన్సూర్ హుస్సేన్, బర్ల యాకూబ్, కుసుమ శ్యాంసుందర్, షేక్ బాబా ఖాదర్ అలీ, అనిశెట్టి సతీష్, కటకం కుమారస్వామి, బింగి మల్లేశం, హరిదాస్యం, సురేశ్, కలమాల మహేందర్, మనోహర్, రాము, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

- కాజీపేట: కాజీపేటచౌరస్తాలో బుధవారం ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. ఈ వేడుకల్లో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బర్ల యాకుబ్, నన్నె విద్యాసాగర్, అజయ్‌బాబు, సదానందం యాదవ్, కొంతం రాములు, జయరాజు,బీజేపీ నాయకులునార్లగిరి రామలింగం పాల్గొన్నారు.


కాజీపేటలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

చిలుక ప్రవీణ్‌పై చర్యలు తీసుకోవాలి

వరంగల్ క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మత విశ్వాసాలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ చిలుక ప్రవీణ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు మీర్జాఅజీజ్, మాజీ కార్పొరేటర్ అబూబకర్ బుధవారం హనుమకొండ ఏసీపీ నర్సింహారావుకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

వర్షాకాల ప్రణాళికను అమలు చేయాలి

- మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్‌తో పాటు అధికారులతో సమీక్ష


రామన్నపేటలో పర్యటిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మే 28 (ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలం సీజన్‌లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఏర్పడకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. బుధవారం బల్దియా కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బల్దియా ఆధ్వర్యంలో రూపొందించిన మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో నగర ప్రజలకు తక్షణ సహాయార్థం కంట్రోల్ రూంతో పాటు టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. క్విక్ రెస్పాన్స్ రెస్క్యూ బృందాలు డీఈ, ఏఈలతోపాటు సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని అన్నారు. శిథిలావస్థలో ఉన్న గృహాలను ముందుగానే గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సెల్లార్‌లలో విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ సీపీ రవీంద్ర, ఈఈలు రవికుమార్, మాధవిలతతో పాటు డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై మేయర్ సీరియస్

స్మార్ట్‌సిటీ పనులు చేపట్టిన తర్వాత మట్టికుప్పలను రోడ్డుపై వదిలి వేసిన కాంట్రాక్టర్‌పై మేయర్ గుండు సుధారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వరంగల్ నగరంలో 28, 29 డివిజన్‌లలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. సుశీల్‌గార్డెన్ జంక్షన్, రామన్నపేట, బీట్‌బజార్, 12 మోరీలు, రఘునాథ్‌కాలనీ, బట్టలబజార్, ఫ్లైఓవర్ బ్రిడ్జి, వెంకటేశ్వరాలయం టెంపుల్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఈ శ్రీనివాస్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈలు రవికుమార్, టీపీఎస్ సముద్రాల శ్రీకాంత్, ఏఈ రాగి శ్రీకాంత్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ధరల నియంత్రణ కీలకం

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ధరల నియంత్రణ కమిటీ పాత్ర కీలకమని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. బుధవారం బల్దియా కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ప్రైస్ కమిటీతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక సహాయం, ఇండ్ల నిర్మాణానికి అవసరమయ్యే మెటీరియల్‌ను అందిస్తోందని అన్నారు. వర్ధన్నపేట, వరంగల్, ఖిలావరంగల్, గీసుగొండ మండలాలకు సంబంధించిన తాపీమేస్త్రీల సంఘం నాయకులతో చర్చించామన్నారు. తక్కువ ధరలకు ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ అధికారి నాయబ్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఫీజుల దోపిడీని నియంత్రించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హనుమకొండలోని డీఈవో కార్యాలయంలో డీఈవో వాసంతిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు విద్యను దూరం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఐఐటీ, నీట్, సివిల్స్ తదితర తోకపేర్లను జోడిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాడపాక రాజేందర్, జరిపోతుల వంశీకృష్ణ, కోట రమేష్, నాగారం మణితేజ తదితరులు పాల్గొన్నారు.

బాలవికాసలో వైద్య శిబిరం

బాలసముద్రం, మే 28 (ఆంధ్రజ్యోతి): మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా బుధవారం మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.అనితారెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యూరాలజీ, బీపీ, షుగర్ ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో మెడికవర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ డి.ప్రియాంక, డాక్టర్ జనతరెడ్డి, ప్రవీణ్ కుమార్, మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు బండ రామలీల, కోడం కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిపోయిన గూడ్స్ రైలు

సూపర్‌పాస్టు ఎక్స్‌ప్రెస్‌రైళ్లకు అంతరాయం

మహబూబాబాద్ క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ- కాజీపేట సెక్షన్‌లోని మహబూబాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఎగువలైన్‌పై గూడ్స్‌రైలు సాంకేతిక లోపంతో బుధవారం రాత్రి నిలిచిపోయింది. దీంతో గూడ్స్‌రైలు వెనుకాలే వస్తున్న చెన్నై- అహ్మదాబాద్ నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌ను గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్‌లో, విశాఖపట్టణం-సికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో గంటపాటు నిలిపివేశారు. అనంతరం గూడ్స్ రైలును మరో ఇంజన్‌తో కేసముద్రం రైల్వే స్టేషన్‌కు చేర్చిన తర్వాత రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

సర్కారీ విద్యకు ‘యంగ్’లుక్

(5వ పేజీ తరువాయి)

అవకాశాలున్నట్టు తెలుస్తోంది. అనువైన స్థలం కోసం అన్వేషిస్తున్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ స్కూల్‌ను ఉప్పరపెల్లి క్రాస్‌రోడ్డు వద్ద గల ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు ప్రతిపాదన పరిశీలనలో ఉంది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం స్కూల్‌ను హనుమకొండలోని గుండ్ల సింగారంలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

తొలివిడత ఏడు స్కూళ్లు

తొలివిడత వరంగల్ తూర్పు, నర్సంపేట, డోర్నకల్, స్టేషన్‌ఘనపూర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, పరకాల నియోజకవర్గాలకు మంజూరయ్యాయి. వీటిలో కొన్నిటి స్కూళ్లకు శంకుస్థాపనలు కూడా జరిగాయి. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో స్కూల్‌ను ఉర్సుగుట్ట వద్ద ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది. నర్సంపేట నియోజకవర్గ స్కూల్‌ను చెన్నారావుపేట మండలం అమీనాబాద్ వద్ద, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ స్కూల్‌ను జఫర్‌గఢ్ మండలం కోనాయమాకుల, భూపాలపల్లి నియోజకవర్గ స్కూల్‌ను గణపురం మండలం పరిధిలోని గాంధీనగర్ వద్ద ఏర్పాటుకు శంకుస్థాపనలు జరిగాయి. ములుగు నియోజవర్గ స్కూల్‌ను ములుగు మండలంలోని ఇంచర్ల వద్ద ఏర్పాటు చేయనున్నారు, పరకాల నియోజకవర్గ స్కూల్‌ను పరకాలలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయనున్నారు. డోర్నకల్ నియోజకర్గ స్కూల్‌ను కురవి మండలం అయ్యగారిపల్లి సమీపంలోని చింతలపల్లి వద్ద ఏర్పాటు చేస్తారు. జనగామ నియోజకవర్గానికి తొలివిడతలోనే కాకుండా మలివిడతలో కూడాఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కాలేదు. ఇక్కడ బీఆర్ఎస్ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

సకల సౌకర్యాలు

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ఒక్కో దాంట్లో 2,560 మంది విద్యార్థులు 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకోనున్నారు. పాఠశాలలకు వేర్వేరు బ్లాక్‌లు ఉంటాయి. ప్రతీ స్కూల్లో 30 మంది చొప్పున 120 మంది టీచర్లు పని చేస్తారు. అలాగే 5వేల వేల పుస్తకాలతో లైబ్రరీ, 60 కంప్యూటర్లతో కంప్యూటర్ కేంద్రం ఉంటాయి. అన్ని తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేస్తారు. ఈ ఇంటిగ్రేటెడ్ గురుకుల భవనాలు నిర్మించే ప్రాంతాల్లో 25ఏళ్లలో అక్కడి ఉష్ణోగ్రతలు, వర్షపాతం, చలి, వేడిగాలుల తీవ్రత తదితర వాతావరణ అంశాలను ఆర్కిటెక్ సంస్థలు పరిగణలోకి తీసుకొని అందుకు అనుగుణంగా భవనాలను డిజైన్ చేసి నిర్మాణాలను చేపడతారు. ప్రతీ డార్మిటరీ గదిలో పది పడకలు, రెండు బాల్ రూములు ఉండేలా చూస్తారు. స్కూల్ క్యాంపస్‌లో తరగతి గదులు, ల్యాబోరేటరీలే కాకుండా ఆడిటోరియం, ఇండోర్ స్పోర్ట్స్ క్రికెట్, ఫుట్‌బాల్ మైదానాలు, బాస్కెట్ బాల్, వాలీబాల్, టెన్నిస్ కోర్టులు, ఔట్‌డోర్ జిమ్, థియేటర్, ల్యాండ్‌స్కేప్ వంటి సౌకర్యాలు కూడా కల్పించనున్నారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన వాటిలో ములుగు, వరంగల్, భూపాలపల్లి, స్టేషన్‌ఘనపూర్‌లలో పైలెట్ ప్రాజెక్టు కింద భవనాల నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుంది.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

(5వ పేజీ తరువాయి)

దేశ ప్రజలు ఎందుకు పేదరికంలో ఉన్నారో చెప్పాలని సవాల్ విసిరారు. 1శాతం ఉన్న కార్పొరేట్లు 40 శాతం సంపదను కలిగి ఉన్నారన్నారు. 50 శాతం ఉన్న పేదల చేతిలో కేవలం 3శాతం సంపద మాత్రమే ఉందన్నారు. దేశంలో 42 శాతం మంది ప్రజలు ఉండటానికి కనీస సౌకర్యాలు లేకుండా ఉన్నారని, 30 శాతం మంది ప్రజలకు పౌష్టికాహారం లోపం ఉందని వివరించారు. నెలకు రూ.26 వేల కనీస వేతనమివ్వాలని కార్మికులు పోరాటం చేస్తున్నారన్నారు. లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని వామపక్ష నాయకులు, మేధావులు, ప్రజా సంఘాలు, ప్రజలు కోరుతున్నప్పటికీ కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. మావోయిస్టు నేత నంబాల కేశవరావు, ఓయూ పూర్వ విద్యార్థిని భూమికతో పాటు పులువురిని ఎన్‌కౌంటర్ చేసి వారి మృతదేహాల ముందు కేంద్ర బలగాలు నృత్యాలు చేయడంఅమానవీయమన్నారు. అలాగే కనీసం అమరుల మృతదేహాలను వారి కుటుంబాలకు అందజేయకుండా పోలీసులే ఖననం చేయడం హేయమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్‌కౌంటర్లలో ఇప్పటికే సుమారు 500 మంది మవోయిస్టులు మృతిచెందగా, ఇందులో ఆదివాసీ బిడ్డలే ఎక్కువగా ఉన్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మవోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ఎన్నిలకు ముందు హామీలను ఇచ్చి, అధికారం చేపట్టిన తరువాత అవి నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని జాన్‌వెస్లీ ధ్వజమెత్తారు. రాష్ట్ర ఖజానాలో డబ్బులు లేవని ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం సిగ్గుచేటన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అకాలవర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నగర సుందరీకణ పేరుతో ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదల గుడిసెలు తొలగించడంతో పాటు నగరంలో రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకుంటూ ఉపాధి పొందుతున్న పేదల అడ్డాలను, స్థావరాలను చిన్నాభిన్నం చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి, సభ్యులు ఎం.చుక్కయ్య, బొట్ల చక్రపాణి, రాగుల రమేష్, వీరన్న, గొడుగు వెంకట్, భానునాయక్, కాడబోయిన లింగయ్య, మల్లేశం, డి.తిరుపతి, జి.రాములు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు : హన్మకొండ
Hanamkonda ACO - 9985410935,
Hasanparthy SR - 9059882000, Hanamkonda - 9704361601
Parkal SR- 7396327489, Kazipet SR - 8519926489
ACM - 9985411664

సంకల్పం



వైద్యం... ఆమె వృత్తి. ఎంతోమంది పేద మహిళలకు వైద్య సహాయం అందిస్తున్నారు.
ఫుట్‌బాల్... ఆమెకు ఆసక్తి. గ్రామీణ బాలికలకు ఉచితంగా శిక్షణనిచ్చి ప్రోత్సహిస్తున్నారు.
తన పేరిట ఓ అకాడమీ నెలకొల్పి... మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి... రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నారు.
దాదాపు మూడు దశాబ్దాలుగా నిజామాబాద్ ప్రజల ప్రశంసలు అందుకొంటున్న సామాజిక కార్యకర్త, గైనకాలజిస్టు... డాక్టర్ కవితారెడ్డి 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

ఈ ఆట మార్పు కోసం

"నిత్యం మన చుట్టూ ఎన్నో సామాజిక సమస్యలు. వాటి పరిష్కారానికి ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూస్తుంటాం. కానీ ఈ సమాజంలో జీవిస్తున్న వ్యక్తులుగా మనమూ కొంత బాధ్యత తీసుకోవాలి. అందుకే నావంతు ప్రయత్నం చేస్తున్నాను. ఇది ఎవరి మెప్పు కోసమో కాదు... గ్రామీణ బాలికలు, మహిళల వికాసం కోసం. ముప్పై ఏళ్ల కిందట నిజామాబాద్‌లో మొదలైంది నా ఈ ప్రయాణం. నా వద్దకు ఎక్కువగా గర్భిణులు, బాలికలు వైద్యం కోసం వచ్చేవారు. కొందరిలో బలహీనత, అలసట లాంటివి గమనించాను. అనుమానం వచ్చి వారికి వైద్య పరీక్షలు చేయించాను. ముఖ్యంగా బాలికల్లో రక్తహీనత (అనీమియా) ఉన్నట్టు గుర్తించాను. గ్రామీణ ప్రాంతాల్లోని వారికి సరైన పోషకాహారం లభించక తలెత్తిన సమస్య ఇది. వారికి అవగాహన కల్పించడంతో పాటు వైద్యం, అవసరమైన మందులు ఇచ్చాను. అయితే ఇది ఒకరిద్దరి సమస్య కాదని అర్థమైంది. అది నిరంతరం కొనసాగిల్సిన ప్రక్రియ. ఈ పరిస్థితిలో కొంతైనా మార్పు తేవాలన్న ఉద్దేశంతో 'డాక్టర్ కవిత ఫౌండేషన్'ను నెలకొల్పాను. దాని ద్వారా ఉచిత వైద్య సేవలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను.



విద్యార్థినుల కోసం...

మావారు డాక్టర్ రవీందర్‌రెడ్డి సహకారంతో ఫౌండేషన్ ద్వారా సేవలు మరింత విస్తరించాను. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10 తరగతుల విద్యార్థినుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాను. జిల్లాలోని పాఠశాలల్లో సుమారు పది వేల మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించాం. రక్తహీనత ఉన్నవారికి అవగాహన కల్పించాం. తగు సూచనలు, మందులు ఇచ్చాం.

దీంతోపాటు ఇతర సేవా కార్యక్రమాలు కూడా మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టాం.

అకాడమీకి అంకురార్పణ...

ఇదిలావుంటే... 2019లో కొన్ని క్లబ్స్ కలిసి నిజామాబాద్‌లో ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించాయి. దానికి మా ఫౌండేషన్ సహకారం అందించింది. స్థానికంగా మంచి స్పందన వచ్చింది. ఇది నాలో కొత్త ఆలోచనలను రేకెత్తించింది. ఆ క్రమంలోనే గ్రామీణ ప్రాంత బాలికలకు ఫుట్‌బాల్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. ఈ పోటీల నేపథ్యంలో నేను గమనించింది ఏంటంటే... గ్రామీణ బాలికల్లో ఫుట్‌బాల్ ఆడగలిగే శక్తిసామర్థ్యాలు ఉన్నాయని. అయితే తగిన ప్రోత్సాహం, ఆర్థిక వనరులు లేక వెనకడుగు వేస్తున్నారని తెలుసుకున్నాను. ఆసక్తివున్న వారిని గుర్తించి సరైన శిక్షణ అందిస్తే వీళ్లు కూడా మెరికల్లా తయారవుతారని అనుకున్నాను. అందుకు అనుగుణంగానే ఆరేళ్ల కిందట 'డాక్టర్ కవితారెడ్డి ఫుట్‌బాల్ అకాడమీ' ఏర్పాటు చేశాను.

చదువుకొనే రోజుల్లో...

ఒకప్పుడు నేనూ ఆటల్లో చురుగ్గా పాల్గొనేదాన్ని. చదివే రోజుల్లో త్రోబాల్ ఆడేదాన్ని. తరువాత వివిధ కారణాలతో ఆట పక్కకు వెళ్లిపోయింది. ఫుట్‌బాల్ అనేది ఆట మాత్రమే కాదు... శారీరకంగా, మానసికంగా దృఢంగా మారడానికి, సామర్థ్యం పెంచుకోవడానికి ఉపయోగపడే చక్కని వ్యాయామం కూడా. ఒక మ్యాచ్ ఆడాలంటే చిన్నపాటి విరామంతో గంటన్నరసేపు మైదానంలో నాన్‌స్టాప్‌గా పరుగెత్తాలి. నైపుణ్యంగా బంతిని తీసుకువెళ్లి గోల్‌లో వేయాలి. ఇది సాధారణ విషయం కాదు. అంతటి సత్తా గ్రామాల్లోని మన బాలికల్లో ఉంది. దాన్ని వెలికి తీసి, సరైన దారిలో పెడితే వారు అద్భుతాలు సాధిస్తారు. నా ప్రయత్నం కూడా అదే.

ఆదరణ కల్పించాలని...

దేశంలో క్రికెట్, టెన్నిస్ తదితర క్రీడలకు ఉన్న ఆదరణ ఫుట్‌బాల్‌కు లేదు. ప్రత్యేకించి మన రాష్ట్రంలో ఫుట్‌బాల్ వైపు ఎవరూ రావడం లేదు. ముఖ్యంగా మహిళలు. గ్రామీణ ప్రాంతాల్లో కొంత మంది ఆసక్తి చూపుతున్నా వారికి ప్రోత్సాహం లభించడం లేదు. ప్రభుత్వాలు, కార్పొరేటు సంస్థలు కూడా ఇతర క్రీడలకు ఇచ్చినంత ప్రాముఖ్యత ఫుట్‌బాల్‌కు ఇవ్వడంలేదు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని ఫుట్‌బాల్‌కు పూర్వ వైభవం తేవడానికి నావంతు ప్రయత్నం చేయాలనుకున్నాను. దానిలో భాగమే అకాడమీ ఏర్పాటు. అందులో ఒక కోచ్‌ను నియమించాం.

క్రీడా పోటీలు...

మా అకాడమీలో హాస్టల్ సదుపాయం కూడా కల్పించాం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఆర్థిక స్తోమత లేని బాలికలకు ఉచితంగా వసతి, శిక్షణ అందిస్తున్నాం. అకాడమీలో శిక్షణ పొందిన పలువురు అమ్మాయిలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వివిధ స్థాయిల్లో పోటీలు కూడా నిర్వహిస్తున్నాం. గత ఏడాది రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ మార్గదర్శకత్వంలో సీనియర్ ఉమెన్ ఫుట్‌బాల్ టోర్నీని విజయవంతంగా పూర్తి చేశాం. ఈ నెల 15 నుంచి 22 వరకు మహిళా కళాశాలలో ఎనిమిది రోజులపాటు తెలంగాణ ఉమెన్స్ లీగ్ నిర్వహించాం. రాష్ట్రానికి చెందినవారే కాకుండా బిహార్, చత్తీస్‌ఘడ్ క్రీడాకారులు కూడా పోటీపడ్డారు.

ఇంకా ఎన్నో...

మా ఫౌండేషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్నాం. మహిళలు, బాలికలకు పోషకాహారం ఆవశ్యకతను వివరించి చెబుతున్నాం. మా నర్సింగ్‌హోమ్‌కు వచ్చేవారికి తక్కువ ఖర్చులోనే వైద్యం చేస్తున్నాం. పేదలకు ఉచిత సేవలు అందిస్తున్నాం. భవిష్యత్తులో మా కార్యకలాపాలను విస్తరించి, మరింతమందికి చేరువ కావాలనేది నా సంకల్పం."

• **పాలసాని సంపత్‌రావు,** నిజామాబాద్

కాలి గోళ్లను ఇలా కాపాడుకోవాలి...

పరిశుభ్రత పాటించకపోవడం వల్ల కాలి గోళ్లలో ఫంగస్ చేరుతుంది. దీంతో గోళ్ల మీద నలుపు, పసుపు రంగు మచ్చలు ఏర్పడుతుంటాయి. ఒక్కోసారి గోళ్ల చివర్లలో విపరీతమైన నొప్పి వస్తూ ఉంటుంది. తరచూ బొటనవేళ్ల గోళ్లకు ఇలా జరుగుతుంది. ఈ సమస్యలన్నింటినీ పోగొట్టుకోవడానికి నిపుణులు సూచిస్తున్న చిట్కాలు ఇవే...

- ఒక వెడల్పాటి టబ్‌లో బకెట్ వేడి నీళ్లు పోసి అందులో అర కప్పు యాపిల్ సైడర్ వెనిగర్ లేదా వైట్ వెనిగర్ వేసి కలపాలి. ఈ నీళ్లలో పాదాలు ఉంచాలి. అరగంట తరవాత మంచినీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే కాలి గోళ్లు మామూలు స్థితికి వస్తాయి.
- రెండు వెల్లులి రెబ్బలను పొట్టు తీసి బాగా దంచి ఈ మిశ్రమాన్ని ఫంగస్ సోకిన గోళ్ల మీద పూతలా రాయాలి. వెల్లుల్లిలో ఉండే అలిసిన్ అనే యాంటీ ఫంగల్ ఏజెంట్ ప్రభావవంతంగా పనిచేసి ఫంగస్‌ను నిరోధిస్తుంది.



- ఒక గిన్నెలో ఒక చెంచా బేకింగ్ సోడా వేసి రెండు చెంచాల నీళ్లు పోసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని కాలి గోళ్ల మీద రాయాలి. ఇరవై నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో పాదాలు కడిగేసుకుంటే గోళ్ల నొప్పి తగ్గుతుంది.
- ఫంగస్ చేరి నల్లగా మారిన గోళ్ల మీద కొద్దిగా నిమ్మరసం లేదా టీట్రీ ఆయిల్ లేదా కొబ్బరి నూనె చుక్కలు వేసి పావుగంటసేపు ఉంచాలి. తరవాత వేడి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తూ ఉంటే వారం రోజుల్లో గోళ్లు ఆరోగ్యంగా తయారవుతాయి.
- వెడల్పాటి గిన్నె నిండుగా వేడినీళ్లు తీసుకుని అందులో రెండు చెంచాల ఉప్పు, ఒక చెంచా పసుపు వేసి బాగా కలపాలి. ఈ నీళ్లలో పాదాలు ఉంచి అరగంట తరవాత మంచినీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే కాలి గోళ్లు పూర్తిగా శుభ్రపడతాయి. ఎటువంటి సమస్యలూ రావు.

కౌన్సెలింగ్

ఈ లక్షణాలు కనబడితే... నిర్లక్ష్యం వద్దు...

నాకు 42 ఏళ్లు. ఈ మధ్య నేను టెస్ట్‌లు చేయించుకుంటే సుగర్ ఉందని తేలింది. ఇప్పటి దాకా నాకు ఎలాంటి లక్షణాలు కనబడలేదు. ఎటువంటి లక్షణాలు కనబడకుండానే సుగర్ వచ్చేస్తుందా?

(హైదరాబాద్ నుంచి ఒక సోదరి)

మధుమేహం హఠాత్తుగా రాదు. వచ్చే ముందు అనేక లక్షణాలు కనబడతాయి. కానీ వాటిని చాలా మంది పట్టించుకోరు. ముఖ్యంగా మహిళలలో ఈ ధోరణి ఎక్కువగా కనబడుతుంది. అందువల్ల 40 ఏళ్లు దాటిన వారు- ప్రతి ఆరునెలలకు ఒక సారి అన్ని పరీక్షలు చేయించుకుంటే మంచిది. దీని వల్ల మన శరీరంలో మనం గమనించని రుగ్మతలు ఏవైనా ఉంటే అవి బయటపడతాయి. ఇక మధుమేహం విషయానికి వస్తే- ఈ కింది లక్షణాలు మీకు కూడా తప్పనిసరిగా కనబడే ఉంటాయి. కానీ వాటిని మీరు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసి ఉంటారు. పాఠకుల కోసం మధుమేహం వచ్చే ముందు మన శరీరం మనకు ఇచ్చే సంకేతాలు ఏమిటో తెలియజేస్తాను. ఈ లక్షణాలలో ఏ ఒక్కటి కనబడినా మధుమేహం ఉందా? లేదా అనే విషయం తెలుసుకొనేందుకు పరీక్ష చేయించుకుంటే మంచిది.

- రాత్రిళ్లు ఎక్కువ సార్లు బాత్‌రూమ్‌కు వెళ్లాల్సి రావటం. మన శరీరంలో బ్లడ్ షుగర్ ఎక్కువగా ఉన్నప్పుడు- మన కిడ్నీలు అదనపు సుగర్‌ను బయటకు పంపటానికి ప్రయత్నిస్తాయి. దీని వల్ల ఎక్కువ సార్లు బాత్‌రూమ్‌కు వెళ్లాల్సి వస్తుంది. చాలా మంది మహిళలకు యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్ వచ్చినప్పుడు కూడా ఎక్కువ సార్లు బాత్‌రూమ్‌కు వెళ్లాల్సి వస్తుంది. అందువల్ల ఈ రెండు లక్షణాలు ఒకటే అనుకొనే ప్రమాదముంది. కనీసం 15 రోజులు- క్రమం తప్పకుండా రాత్రిళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లాల్సి వస్తోందంటే- అది మధుమేహ లక్షణమే అని కచ్చితంగా చెప్పవచ్చు.
- చాలా సార్లు మధుమేహం వచ్చినవారు హఠాత్తుగా బరువు తగ్గిపోతూ ఉంటారు. ఈ మధ్యకాలంలో ఎక్కువ మంది బరువు తగ్గటానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి ప్రయత్నాలు ఏమి చేయకుండానే బరువు తగ్గుతుంటే అది మధుమేహ లక్షణమని కచ్చితంగా చెప్పవచ్చు. మధుమేహం ఉన్న వారి కణాలకు తగినంత చక్కెర లభించదు.. దీనితో అవి శరీరంలో ఉన్న కొవ్వును కరిగించటం మొదలుపెడతాయి. దీని వల్ల ఎటువంటి ప్రయత్నం చేయాల్సిన అవసరం లేకుండానే బరువు తగ్గిపోతారు. బరువు తగ్గటంతో పాటుగా ఎప్పుడు నీరసంగానే ఉంటుంది. ఎన్ని జ్యూస్‌లు తాగినా.. ఎన్ని సార్లు తిన్నా ఫలితం ఉండదు.



- వంటింట్లో వంట చేసేటప్పుడు చిన్న చిన్న గాయలు అవుతూ ఉంటాయి. ఈ గాయాలు వెంటనే తగ్గకపోతే మధుమేహం ఉన్నట్లు కచ్చితంగా చెప్పవచ్చు. ఇదే విధంగా చాలా సార్లు రాత్రిళ్లు పడుక్కొనే సమయంలో కాళ్లు తిమ్మిర్లెక్కుతాయి. చాలా మంది పొద్దున్న నుంచి నిలబడి ఉండటం వల్ల కాళ్ల నెప్పులతో పాటుగా తిమ్మిర్లు ఎక్కాయనుకుంటారు. కానీ వాస్తవానికి మధుమేహం ఉన్నవారికి ఈ తిమ్మిర్ల సమస్య ఎక్కువగా ఉంటుంది. అందువల్ల రాత్రిళ్లు పడుక్కొనే సమయంలో తిమ్మిర్లు అనిపిస్తే మధుమేహం ఉందా? లేదా అనే పరీక్ష చేయించుకోవటం ఎంతైనా మంచిది.
- మధుమేహం వస్తే కంటి సమస్యలు కూడా పెరుగుతాయి. కళ్లు మసకబారటం వంటి లక్షణాలు కనబడతాయి. చాలా సార్లు కంటి చూపు మందగించటం వల్ల ఈ సమస్యలు ఏర్పడతాయని భావించి కంటి డాక్టర్ దగ్గరకు వెళ్తారు. కానీ అంతకన్నా ముందు మధుమేహ పరీక్ష చేయించుకోవటం మంచిది.

- డాక్టర్ మనోహర్
డయాబెటాలజిస్ట్, హైదరాబాద్

కారం గుట్టు తెలిసింది!

కొన్ని మిరపకాయలు తక్కువ కారంగా ఉంటాయి. మరికొన్ని చాలా ఎక్కువ కారంగా ఉంటాయి. అయితే ఇలా ఉండడానికి కారణమేంటన్నది శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం..

మిరపకాయల్లో ఉండే క్యాప్సైసినోయిడ్స్ సమ్మేళనాల (క్యాప్సైసిన్, డిహైడ్రోక్యాప్సైసిన్) వలన కారం ఘాటు వ ఎనకు తెలుస్తుంది. శాస్త్రవేత్తలు పలు రకాల మిరప పొడులను, మరికొన్నింటిని టమాట రసంలో కలిపి టేస్టర్‌లతో పరిశీలించారు. అవి కాక ఇంకా మరికొన్ని రసాయన విశ్లేషణలు కూడా చేశారు. చివరికి క్యాప్సినోసైడ్ ఐ, రోసియోసైడ్, జింజర్‌గ్లికోలిపిడ్ ఎ అనే సమ్మేళనాలు ఎక్కువ మొత్తంలో ఉన్న మిరపకాయల్లో ఘాటు తక్కువగా ఉందని గుర్తించారు. ఈ మూడు సమ్మేళనాల్లో గ్లూకోజ్, చక్కెర ఉంటాయి. అందుకే ఇవి ఎక్కువగా ఉన్న మిరపకాయలు తక్కువ కారం కలిగి ఉంటాయి.



బొట్టు ఇలా...

మహిళలు సాధారణంగా గుండ్రని బొట్టు లేదా చిన్న బిందీ పెట్టుకుంటారు. పార్టీలు, వివాహాది శుభకార్యాలు... ఇలా సందర్భాన్ని అనుసరించి రకరకాల బిందీలను ఎంపిక చేసుకుంటూ ఉంటారు. ముఖాకృతికి తగ్గట్టుగా బిందీని పెట్టుకుంటే ముఖం మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఎవరికి ఏ రకం బిందీ బాగుంటుందో తెలుసుకుందాం...

- గుండ్రని ముఖం ఉన్నవారు పొడవాటి బిందీని పెట్టుకోవాలి. దీనివల్ల ముఖం కొద్దిపాటి కోలగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. చిన్న కుందనాలు లేదా మెరిసే రాళ్లు ఉన్న బిందీలు వీరికి బాగా నప్పుతాయి.
- దీర్ఘవృత్తాకారపు ముఖం ఉన్నవారికి నుదురు పెద్దగా ఉంటుంది. వీరికి అన్ని రకాల బిందీలు చక్కగా నప్పుతాయి. మరీ పెద్దగా మరీ చిన్నగా కాకుండా మధ్యస్థంగా ఉన్న బిందీని ఎంపిక చేసుకుంటే బాగుంటుంది. బంగారు రంగు గుండ్లు అమర్చిన బిందీలు వీరికి ప్రత్యేకమైన అందాన్నిస్తాయి.
- చతురస్రాకారపు ముఖం ఉన్నవారికి నుదుటితోపాటు చెక్కిళ్లు కూడా వెడల్పుగా ఉంటాయి. వీరు గుండ్రంగా ఉండే పెద్ద బిందీలు పెట్టుకుంటే అందంగా కనిపిస్తారు. బిందీ కింది భాగంలో చిన్న రాయి లేదా పూస ఉండేలా చూసుకుంటే ముఖం ఆకర్షణీయంగా ఉంటుంది.
- కోల ముఖం ఉన్నవారికి వెడల్పాటి డిజైన్ల బిందీలు, అర్ధచంద్రాకారంలో ఉన్నవీ బాగా నప్పుతాయి. వీటివల్ల ముఖం సమతుల్యంగా కనిపిస్తుంది. వీరికి మెరిసే రాళ్లు ఉన్న బిందీలు బాగుంటాయి. బిందీ కింద చిన్న చుక్క అదనపు అందాన్నిస్తుంది.
- హృదయాకారపు ముఖం ఉన్నవారికి గుండ్రనివి, నక్షత్రాకారపు బిందీలు బాగుంటాయి. చుట్టూ మెరిసే రాళ్లు లేదా గుండ్లు లేదా చిన్న పూసలు పేర్చిన బిందీలు పెట్టుకుంటే వీరు ఆకర్షణీయంగా కనిపిస్తారు.



సాహసి



దివ్యాంగుల మనోస్థైర్యాన్నీ పెంచాలనే సంకల్పం ఆమెది. అందుకోసం సవాళ్లతో కూడుకున్న సాహసానికి పూనుకుంది. ఏకంగా ఎవరెస్టు పర్వతాన్నే అధిరోహించి, దృష్టిలోపంతో ఎవరెస్టును అధిరోహించిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించింది. ఆమే హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన చోంజిన్ ఆంగ్మో. ఈ సాహసి గురించిన మరిన్ని విశేషాలు

ఆత్మవిశ్వాసమే అండగా!

హిమాచల్ ప్రదేశ్, కిన్నోర్ జిల్లా, హంగ్రాంగ్ లోయలో ఉన్న తన ఎకరం పొలంలోని యాపిల్ తోటలో పని చేసుకుంటున్న రైతు, అమర్ చంద్ ఫోన్‌కు ఒక వీడియో క్లిప్ వచ్చింది. తన 29 ఏళ్ల కూతురు చోంజిన్ అంగ్మో ఎవరెస్టు పర్వతం మీద మువ్వన్నెల జెండాను ఎగరేస్తున్న వీడియో అది. ఎనిమిదేళ్లకే కంటిచూపు మందగించిన తన కూతురు సాధించిన విజయానికి ఆ తండ్రి కళ్లు చెమర్చాయి. "మా చాంగో గ్రామం చల్లని ఎడారిలో ఒక ఒయాసిస్ లాంటిది. రెండు హిమనీనదాలు, స్పితి నది ప్రవహించే లోయలో నెలకొని ఉన్న ఏకైక ఆకుపచ్చని ప్రాంతం మాది. ఇంత చిన్న గ్రామంలో పుట్టిన మా అమ్మాయి, దృష్టిలోపాన్ని అధిగమించి, ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించడం మా గ్రామానికి గర్వకారణం" అంటూ పొంగిపోతున్నాడు, ఆ 76 ఏళ్ల తండ్రి.

ఎనిమిదేళ్లకే అంధత్వం

దృష్టిలోపంతో ఎవరెస్టును అధిరోహించిన ప్రపంచంలోని ఐదవ పర్వతారోహకురాలిగా కూడా చోంజిన్ ఆంగ్మో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈమెకు ముందు, 2001లో అమెరికాకు చెందిన ఎరిక్ వెహెన్‌మేయర్, ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించిన, దృష్టి లోపం కలిగిన మొట్టమొదటి వ్యక్తిగా పేరు పొందింది. ఆ తర్వాత, 2017లో ఆస్ట్రియాకు చెందిన యాండీ హోల్జర్, 2021లో చైనాకు చెందిన జాంగ్ హాంగ్, 2023లో, అమెరికాకు చెందిన లానీ బెడ్‌వెల్ ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించారు. అయితే ఆంగ్మో కథ వీళ్లందరి కంటే భిన్నం. ఆంగ్మోకు చిన్నతనంలోనే దృష్టి లోపం తలెత్తింది. బడిలో అక్షరాలు రాయలేకపోతోందని ఉపాధ్యాయురాలు చెప్పడంతో ఆంగ్మో తల్లితండ్రులు ఆమెను మొదట చండీఘడ్, డెహ్రాడూన్ నగరాలకు తీసుకువెళ్లి వైద్యులకు చూపించారు. కానీ ఫలితం లేకపోయింది. ఎనిమిదేళ్ల వయసొచ్చేటప్పటికి ఆమె రెండు కళ్లూ కనిపించకుండా పోయాయి. దాంతో తల్లితండ్రులు ఆమెను 2005లో మహాబోధి ఇంటర్నేషనల్ మెడిటేషన్ సెంటర్ నడిపే, లెహ్‌లోని మహాబోధి అంధుల పాఠశాలలో చేర్పించారు. అక్కడే చదువు పూర్తి చేసుకున్న ఆంగ్మో, ఆ తర్వాత ఢిల్లీలోని మిరాండా హౌస్‌లో డిగ్రీ పూర్తి చేసింది. అయితే పర్వతారోహణ పట్ల మక్కువ కలిగిన ఆంగ్మో 2016లో మనాలిలోని, అటల్ బిహారి వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అల్లైడ్ స్పోర్ట్స్ సహాయంతో పర్వతారోహణలో ప్రాథమిక శిక్షణ పొందింది. ఆ శిక్షణలో భాగంగా 5,289 అడుగుల ఎత్తున్న ఫ్రెండ్‌షిప్ పీక్‌ను కూడా అధిరోహించింది. ఆ తర్వాత 2021లో టీమ్ క్లా, అనే సాయుధ దళాల అనుభవజ్ఞుల బృందం నేతృత్వంలో సియాచిన్ గ్లేసియర్‌కు సాగే దివ్యాంగుల యాత్ర అయిన ఆపరేషన్ బ్లూ ఫ్రీడంలో పాల్గొంది.

అంచనాలు, సూచనల ఆధారంగా...

ఆ సాహసయాత్రలతో అంగ్మో ఆత్మస్థైర్యం పెరిగింది. ఆ ప్రయాణంలో అదనపు ఆక్సిజన్ లేకుండా, ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించిన మొట్టమొదటి పర్వతారోహకుడు స్వల్దాంగ్ రిజ్విన్‌ను కలిసింది. లడఖ్ మౌంటెన్ గైడ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అయిన రిజ్విన్, ఆమెలోని దృఢ సంకల్పాన్ని, పట్టుదలనూ గ్రహించి పర్వతారోహణలో తోడ్పడే జూమర్ టెక్నిక్ లాంటి కొన్ని మెలకువలను సూచించాడు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అంగ్మో ఎవరెస్టు పర్వతారోహణను స్పాన్సర్ చేయడంతో, ఆమె మొదట ఆరు వేల మీటర్ల ఎత్తైన మౌంట్ లోబుచెను అధిరోహించింది. ఆ తర్వాత, ఎవరెస్టు మొదటి మూడు బేస్ క్యాంపులతో పాటు, చివరిగా 7,920 మీటర్ల ఎత్తులోని నాల్గవ బేస్ క్యాంపుకు చేరుకోగలిగింది. ఇద్దరు షెర్పాలు, అనుభవజ్ఞులైన పర్వతారోహకులు కూడా ఈమె వెంట ఉన్నారు. అయితే వాళ్లు కొంత తోడ్పాటును అందించినప్పటికీ అంతిమంగా పైకి ఎక్కవలసింది ఆమే! తాడు బిగువును పరీక్షించుకోవడంతో పాటు, మంచులో, రాళ్ల మీద అడుగుజాడల గుర్తులను కనిపెట్టే బాధ్యత ఆమెదే! కొన్నిచోట్ల నిచ్చెనలను దాటవలసి వచ్చినప్పుడు, వెంట వెళ్లిన వాళ్లు ఆ నిచ్చెనను దాటి, ట్రెక్ పోల్స్ సహాయంతో పాదాన్ని ఎక్కడ ఉంచాలో ఆమెకు సూచిస్తూ ఉంటారు. ఇలా అంచనాలు, సూచనల సహాయంతో ఆంగ్మో విజయవంతంగా ఎవరెస్టును అధిరోహించగలిగింది. "దివ్యాంగులందరిలో మనోస్థైర్యాన్ని నింపాలనే సంకల్పంతోనే నేనీ సాహసయాత్రకు పూనుకున్నాను. మనో స్థైర్యం ఉంటే, మనల్ని ఏదీ అడ్డుకోలేదు. ప్రతి ఖండంలోని అత్యంత ఎత్తైన శిఖరాన్ని అధిరోహించడమే నా తర్వాతి లక్ష్యం. హెలెన్ కెల్లర్ నా రోల్ మోడల్. ఆమె నుంచి పొందిన స్ఫూర్తితో నేనీ విజయం సాధించగలిగాను" అంటూ మీడియాతో చెప్పుకొచ్చింది ఆంగ్మో.









బుధవారం ఎన్టీఆర్ 102వ జయంతి. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్ హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌ను సందర్శించి, నివాళులు అర్పించారు.

హృతిక్‌తో హోంబలే ఫిల్మ్స్ చిత్రం



'కేజీఎఫ్', 'సలార్', 'కాంతార' వంటి పలు భారీ, విభిన్న చిత్రాలు నిర్మిస్తూ భారతీయ చిత్ర పరిశ్రమలో పెద్ద నిర్మాణ సంస్థల్లో ఒకటిగా ఎదిగిన హోంబలే ఫిల్మ్స్ సంస్థ ఇప్పుడు బాలీవుడ్ సూపర్ స్టార్ హృతిక్ రోషన్‌తో చేతులు కలిపింది. ఇది హృతిక్ అభిమానులకు, సినిమా ప్రేమికులకూ ఆనందకరమైన వార్తే. ఈ సందర్భంగా హోంబలే ఫిల్మ్స్ అధినేత విజయ్ కిరగందూర్ మాట్లాడుతూ 'స్ఫూర్తిదాయకమైన కథలను చెప్పాలన్న ఉద్దేశంతో ముందుకు వెళుతున్నాం. హృతిక్ రోషన్‌తో ఓ గొప్ప సినిమా ఎక్స్‌పీరియన్స్ అందించాలన్న లక్ష్యాన్ని సాకారం చేస్తాం. ఆ సినిమా ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుంది' అన్నారు. హృతిక్ రోషన్ మాట్లాడుతూ 'వైవిధ్యమైన చిత్రాలు అందిస్తున్న హోంబలే ఫిల్మ్స్ వంటి సంస్థతో కలసి పని చేయబోతున్నందుకు ఆనందంగా ఉంది. మేం పెద్ద కలలు కంటున్నాం. వాటిని నిజం చేసేందుకు అంకిత భావంతో పని చేస్తాం' అన్నారు.

అందుకే పవన్ కల్యాణ్ సీరియస్‌గా తీసుకున్నాడు



- రాజేంద్రప్రసాద్

'పవన్ కల్యాణ్ ఇప్పుడు సాదాసీదా వ్యక్తి కాదు. ఒక రాష్ట్రానికి డిప్యూటీ సీఎం. గొప్ప పదవిలో ఉన్నాడు. ప్రజలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత ఆయనపైన ఉంది. కాబట్టే థియేటర్ల మూసివేత అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నాడు' అని నటుడు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆయన కీలకపాత్రలో నటించిన 'షష్టిపూర్తి' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడారు. 'మా పవన్ ఫీలయ్యాడు అంటే అందులో బాధ్యత ఉంటుంది. 'నాసినిమా విడుదలకు ముందు ఇలా చేయడం ఏంటి' అని ఆయన ఆవేదనకు గురవడం సహజం. అందుకే 'ఏం జరిగిందో కనుక్కోండి, ఆపండి' అన్నాడు. ఆయనది మంచి నిర్ణయమే. దీనికంతటికీ కారకులు ఎవరో వాళ్లను పట్టుకొని ఎందుకు ఇలా జరిగిందో తెలుసుకుంటే గనుక ఈ సమస్య ఇంతటితో సమసిపోతుంది. అందుకే పవన్ కల్యాణ్ బాధ్యత తీసుకొని ఎందుకలా జరిగింది కనుక్కోమని అధికారులను ఆదేశించారు. ఎవరో ఒక పిచ్చి నిర్ణయం తీసుకుంటే అది మీడియాలో ప్రముఖంగా ప్రచారం అయింది. థియేటర్ల మూసివేత అనేది చిన్న విషయం కాదు ?ఎవరో ఒకరు నిర్ణయం తీసుకున్నంత మాత్రాన సరిపోతుందా? అందర్నీ తప్పుదారి పట్టించారు. కానీ అందరి ఆమోదం లేకపోబట్టే చివరకు అది వీగిపోయింది' అని చెప్పారు.







ఐఫోన్ల ఎగుమతుల్లో చైనాను దాటిన భారత్

● గతనెల 76 శాతం వృద్ధి

● దాదాపు 30 లక్షల యూనిట్ల సరఫరా

న్యూఢిల్లీ: భారత్ నుంచి అమెరికాకు ఐఫోన్ల ఎగుమతులు చైనాను మించిపోయాయి. మార్కెట్ పరిశోధక సంస్థ ఓండియా (గతంలో క్యానలిస్) డేటా ప్రకారం.. గత నెలలో అమెరికాకు మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్ల సరఫరా వార్షిక ప్రాతిపదికన 76 శాతం వృద్ధితో దాదాపు 30 లక్షల యూనిట్లకు పెరిగింది. అదే సమయంలో చైనా నుంచి అమెరికాకు ఐఫోన్ల ఎగుమతులు మాత్రం 76 శాతం తగ్గి 9 లక్షల యూనిట్లకు పడిపోయాయి. అమెరికాకు ఐఫోన్ల ఎగుమతుల విషయంలో భారత్ తొలిసారిగా చైనాను అధిగమించింది.

4 నెలల్లో 1.15 కోట్ల ఐఫోన్ల ఎగుమతులు

ఈ ఏడాదిలో గడిచిన నాలుగు నెలల్లో (జనవరి-ఏప్రిల్) భారత్ నుంచి అమెరికాకు 1.15 కోట్ల ఐఫోన్లు ఎగుమతయ్యాయి. అదే సమయంలో చైనా నుంచి 1.32 కోట్ల ఐఫోన్ల సరఫరా జరిగింది. నాలుగు నెలల కాలానికి చూస్తే, ఇప్పటికీ చైనానే అగ్రగామిగా ఉన్నప్పటికీ నెల వారీ గణాంకాలను పరిశీలిస్తే భారత్ నుంచి సరఫరా భారీగా పెరుగుతూ వస్తోంది.

భారత్‌పై యాపిల్ ఫోకస్

ఐఫోన్ల తయారీ కోసం యాపిల్ కేవలం చైనా పైనే ఆధారపడకుండా భారత్‌ను ప్రత్యామ్నాయ వేదికగా ఎంచుకుంది. కరోనా సంక్షోభ కాలం నుంచే భారత



మార్కెట్ నుంచి తన ఉత్పత్తుల సరఫరా కోసం భారీగా పెట్టుబడులు పెడుతూ వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల ప్రభావాన్ని తగ్గించుకునేందుకు భారత్‌లోని తన థర్డ్ పార్టీ వెండార్ల నుంచి ఈ ఏడాది ఐఫోన్ల సేకరణను భారీగా పెంచింది.

బుచ్‌కు లోక్‌పాల్ క్లీన్‌చిట్



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌కు అవినీతి నిరోధక అంబుడ్స్‌మన్ లోక్‌పాల్ క్లీన్‌చిట్ ఇచ్చింది. అమెరికా షార్ట్ సెల్లింగ్, మార్కెట్ రీసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్ ఆరోపణల ఆధారంగా అనుచితం, పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించి బుచ్‌పై దాఖలైన ఫిర్యాదులను లోక్‌పాల్ బుధవారం తోసిపుచ్చింది. ఆ అభియోగాలన్నీ కేవలం అనుమానాలు, ఊహలే తప్ప వాటిని ధ్రువీకరించే ఆధారాలేమీ లేవంది. అదానీ గ్రూప్ నిధుల అక్రమ మళ్లింపునకు ఉపయోగించిన విదేశీ ఫండ్లలో మాధవి పురి బుచ్‌తోపాటు ఆమె భర్త ధవల్ బుచ్‌కు రహస్య వాటాలున్నాయని హిండెన్‌బర్గ్ గత ఆగస్టులో ఆరోపించింది. అంతేకాదు, సెబీ పదవీ చేపట్టాక కూడా మాధవి పురి బుచ్ తన మాజీ సంస్థ ఐసీఐసీ బ్యాంక్ నుంచి పారితోషికం అందుకున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. అయితే, బుచ్ ఆ ఆరోపణలన్నింటినీ ఖండించారు.

8 నెలల కనిష్ఠానికి పారిశ్రామికోత్పత్తి

న్యూఢిల్లీ: దేశంలో పారిశ్రామికోత్పత్తి 8 నెలల కనిష్ఠానికి పడిపోయింది. కేంద్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గత నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 2.7 శాతానికి జారుకుంది. మాన్యుఫాక్చరింగ్, మైనింగ్, విద్యుత్ రంగాల పేలవ పనితీరు ఇందుకు కారణం. గత ఏడాది ఏప్రిల్‌లో ఐఐపీ 5.2 శాతంగా నమోదైంది. కాగా ఈ మార్చి నెల ఐఐపీని గతంలో ప్రకటించిన 3 శాతం నుంచి 3.9 శాతానికి పెంచింది. గత నెలలో తయారీ రంగ ఉత్పత్తి వృద్ధి 3.4 శాతానికి తగ్గగా.. మైనింగ్ ప్రొడక్షన్ 0.2% క్షీణించింది.

ఎన్ఎస్ఈతో వి హబ్ ఎంఓయూ

హైదరాబాద్: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌తో (ఎన్ఎస్ఈ) తెలంగాణకు చెందిన వి హబ్ ఫౌండేషన్ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. బుధవారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క సమక్షంలో ఇరువర్గాల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా ఎన్ఎస్ఈ, వి హబ్ ఫౌండేషన్ కలిసి రాష్ట్రంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నాయి. ఇన్వెస్టర్ల అవగాహన కార్యక్రమాల(ఐఏపీ) ద్వారా ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడం, ఐపీఓ ద్వారా నిధుల సమీకరణ, ఎన్ఎస్ఈలోని ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ 'ఎమర్జ్'లో షేర్లను నమోదుపై మహిళా ఆంత్రప్రెన్యూర్ల నిర్వహణలోని ఎంఎస్ఎంఈల్లో అవగాహన పెంచడం, విద్యార్థులకు బీఎఫ్ఎస్ఐ రంగంలో సమగ్ర శిక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నాయి.

ఇండిగో చైర్మన్‌గా విక్రమ్ సింగ్ మెహతా

న్యూఢిల్లీ: ఇండిగో నూతన చైర్మన్‌గా విక్రమ్ సింగ్ మెహతాను నియమించినట్లు ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రకటించింది. డాక్టర్ వెంకటరమణి సుమంత్రన్ పదవీ కాలం పూర్తయిన నేపథ్యంలో ఆయన స్థానంలో మెహతా బాధ్యతలు స్వీకరించనున్నారు.

నాట్కో ఫార్మా లాభం రూ.406 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నాట్కో ఫార్మా మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికానికి రూ.406 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదు చేసిన రూ.386.3 కోట్లతో పోలిస్తే ఇది ఐదు శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం 16 శాతం పెరిగి రూ.1,287.3 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే క్యూ4లో కంపెనీ స్థూల లాభం 10.2 శాతం వృద్ధితో రూ.548 కోట్లుగా నమోదైంది. అయితే ఇదే సమయంలో నిర్వహణ లాభాలు మాత్రం 46.55 శాతం నుంచి 44.89 శాతానికి పడిపోయాయి.

ఆర్థిక సంవత్సరం మొత్తానికి : 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.4,784 కోట్ల ఆదాయంపై రూ.1,883.4 కోట్ల నికర లాభం నమోదు చేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25లో ఆదాయం 16 శాతం పెరిగితే, నికర లాభం ఏకంగా 36 శాతం పెరిగింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) అంత ఆశాజనకంగా ఉండక పోవచ్చని కంపెనీ హెచ్చరించింది. కంపెనీ ఆదాయం 20 శాతం, నికర లాభం 30 శాతం వరకు క్షీణించే ప్రమాదం ఉందని తెలిపింది. అమెరికా మార్కెట్‌లో ఎదురవుతున్న ధరల ఒత్తిడి, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఆర్ అండ్ డీ ఖర్చులు పెరిగిపోవడం ఇందుకు కారణమని పేర్కొంది. దీంతో బీఎస్ఈలో కంపెనీ షేర్లు బుధవారం 1.78 శాతం నష్టంతో రూ.862.45 వద్ద ముగిశాయి.

గ్రాన్యూల్స్ లాభం 17% వృద్ధి

గ్రాన్యూల్స్ ఇండియా నాలుగో త్రైమాసికానికి రూ.152 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.130 కోట్లతో పోలిస్తే ఇది 17 శాతం ఎక్కువ. ఫార్ములేషన్స్ అమ్మకాలు 18 శాతం పెరగడం ఇందుకు ప్రధానంగా దోహదం చేసిందని కంపెనీ సీఎండీ చిగురుపాటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.1,176 కోట్ల నుంచి రూ.1,197 కోట్లకు పెరిగింది. దీంతో ఒక్కో షేరుపై రూ.1.5 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. రూపాయి ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై ఇది 150 శాతానికి సమానం.

బీఏఎస్ఎఫ్ నుంచి రెండు కొత్త ఉత్పత్తులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జర్మనీ కేంద్రంగా పనిచేసే బీఏఎస్ఎఫ్ అగ్రికల్చరల్ సొల్యూషన్స్ కంపెనీ భారత మార్కెట్‌లో వాలెక్సియో, మిబెల్యా పేరుతో రెండు సరికొత్త ఉత్పత్తులను ఆవిష్కరించింది. ఇందులో వాలెక్సియో క్రిమినాశిని వరి పంటను సుడి దోమ తెగులు నుంచి, మిబెల్యా శిలీంద్ర నాశిని పాము పొడ తెగులు నుంచి రక్షిస్తాయని బీఏఎస్ఎఫ్ ఇండియా కంపెనీ అగ్రికల్చరల్ సొల్యూషన్స్ విభాగం బిజినెస్ డైరెక్టర్ ఆర్ గిరిధర్ చెప్పారు. వరి దుబ్బు కట్టే దశలో, పొట్ట పోసుకునే దశలో వీటిని పిచికారీ చేయాల్సి ఉంటుంది. వీటి పిచికారీ ద్వారా దిగుబడులను బాగా దెబ్బతీసే సుడి దోమ తెగులు, పాము పొడ తెగుళ్ల నుంచి వరి పంటను పూర్తిగా కాపాడుకోవచ్చన్నారు. ఈ రెండు ఉత్పత్తుల అభివృద్ధిలో భారత్‌లోని బీఏఎస్ఎఫ్ ఇండియా పరిశోధనా సంస్థలు కీలక పాత్ర పోషించాయి. ఈ రెండు మందులు వచ్చే నెల నుంచి అందుబాటులోకి వస్తాయని గిరిధర్ చెప్పారు. అగ్రికల్చరల్ సొల్యూషన్స్‌ను 2027 జనవరి నాటికి ప్రత్యేక కంపెనీగా విభజించి, ఐపీఓకు వెళ్లే యోచన ఉందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైక్ హీంజ్ తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	525
వరంగల్	522	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	117
కరీంనగర్	115	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	105
కర్నూలు	115	నెల్లూరు	110
విశాఖపట్నం	111	అనంతపురం	110
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,480 ▼	89,350 ▼	1,11,000 ▲
విజయవాడ	99,100 ▲	93,500 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	98,730 ▲	89,350 ▼	1,11,000 ▲
రాజమండ్రి	97,470 ▼	89,350 ▼	1,00,800 ▲
ప్రొద్దుటూరు	95,700 ▼	88,040 ▼	99,000 ▲
ముంబై	95,700 ▲	87,660 ▲	97,450 ▲

రామ్‌రాజ్ ఆచార్య పంచకచం ధోవతులు

ప్రచారకర్తగా దుష్యంత్ శ్రీధర్



చెన్నై (ఆంధ్రజ్యోతి): రామ్‌రాజ్ సంస్థ ఆధ్యాత్మిక ఆచారాలు, మతపరమైన వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ధరించడానికి అనువుగా 'ఆచార్య పంచకచం' ధోవతులను మార్కెట్లోకి తెచ్చింది. ప్రముఖ పండితుడు దుష్యంత్ శ్రీధర్‌ను దీనికి ప్రచారకర్తగా నియమించింది. తమ సంస్థ ఆచార్యులు, గురువుల కోసం పంచకచం పంచెలను ప్రత్యేకంగా తయారుచేసిందంటూ ఇవి కేవలం సాంప్రదాయక దుస్తులు కాదని, పవిత్రమైన పండుగ సందర్భాల్లో ధరించే భారతీయ ప్రాచీన వారసత్వానికి చిహ్నమని సంస్థ వ్యవస్థాపకులు కేఆర్ నాగరాజన్ చెప్పారు. భారతీయ సంస్కృతికి ఎంతో గౌరవనీయులైన ఆదిశంకరులు, రామానుజులు, వేదాంత దేశికులు, మధ్వాచార్యులు, కంచిపరమాచార్యుల పరంపను గౌరవిస్తూ రామ్‌రాజ్ కంపెనీ ఈ ధోవతులను పరిచయం చేయడం సముచితంగా ఉందని దుష్యంత్ శ్రీధర్ ఈ సందర్భంగా అన్నారు.

ఐటీసీలో వాటా తగ్గించుకున్న బీఏటీ

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ, సిగరెట్ల తయారీ సహా భిన్న వ్యాపారాల్లోకి విస్తరించిన దేశీయ కంపెనీ ఐటీసీలో బ్రిటన్‌కు చెందిన బహుళజాతి సంస్థ బ్రిటిష్ అమెరికన్ టొబాకో (బీఏటీ) వాటా తగ్గించుకుంది. ఐటీసీలో 2.5 శాతం వాటాకు సమానమైన 31.3 కోట్ల షేర్లను ఒక్కోటి రూ.413 చొప్పున మొత్తం రూ.12,927 కోట్లకు విక్రయించింది. బహిరంగ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా బుధవారం ఈ వాటా షేర్ల ఉపసంహరణ జరిగింది. ఈ లావాదేవీ అనంతరం ఐటీసీలో బీఏటీ మొత్తం వాటా 25.44 శాతం నుంచి 22.94 శాతానికి తగ్గింది.

సెన్సెక్స్ 239 పాయింట్లు డౌన్

ముంబై: ఈక్విటీ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టపోయింది. ఐటీసీ షేర్లు 3 శాతానికి పైగా క్షీణించడం ఇందుకు ప్రధాన కారణం. బుధవారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 239.31 పాయింట్లు కోల్పోయి 81,312.32 వద్దకు జారింది. నిఫ్టీ 73.75 పాయింట్ల నష్టంతో 24,752.45 వద్ద స్థిరపడింది. ఎఫ్ అండ్ ఓ నెలవారీ కాంట్రాక్టులు గురువారంతో ముగియనుండటంతోపాటు జీడీపీ, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు విడుదల కానున్న నేపథ్యంలో మదుపరులు వేచిచూసే ధోరణిని ప్రదర్శించారని, దాంతో మార్కెట్ సూచీలు పరిమిత శ్రేణిలోనే కదలాడాయని ఈక్విటీ విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రధాన సూచీలు నేలచూపులు చూసినప్పటికీ బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.50 శాతం వరకు పెరిగాయి.

హీరో ఫిన్‌కార్ప్ ఐపీఓకు సెబీ ఆమోదం: దేశీయ ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హీరో మోటో కార్ప్ ఆర్థిక సేవల అనుబంధ విభాగమైన హీరో ఫిన్‌కార్ప్ రూ.3,668 కోట్ల ఐపీఓకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.2,100 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన రూ.1,568 కోట్ల ఈక్విటీ షేర్లను సైతం విక్రయించనుంది.

● లీలా ప్యాలెస్ హోటల్స్ అండ్ రిసార్ట్‌ల నిర్వహణ సంస్థ ష్లోస్ బెంగళూరుతోపాటు ఏజిస్ వోపక్ టెర్మినల్స్ ఐపీఓలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు నాటికి ష్లోస్ బెంగళూరుకు ఇష్యూ సైజు కంటే 4.5 రెట్ల బిడ్లు రాగా.. ఏజిస్ వోపక్ ఇష్యూకు 2 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

స్పోర్ట్స్

తొలి అడుగు ఎవరిదో?

ఐపీఎల్ టైటిల్ వేటలోనున్న పంజాబ్, బెంగళూరు ఫైనల్లో చోటు కోసం అమీతుమీకి సిద్ధమయ్యాయి. శ్రేయాస్ సారథ్యంలోని కింగ్స్ జట్టు లీగ్ దశలో 'టాప్'లేపి సూపర్ జోష్‌తో కనిపిస్తుండగా.. కోహ్లీలాంటి స్టార్లతో కూడిన బెంగళూరు ఆఖరి మ్యాచ్‌లో అద్భుత విజయం అందుకొని పూర్తి ఆత్మ విశ్వాసంతో ఉంది. మరి.. ఈ సమవుజ్జీల సమరంలో పైచేయి సాధించి ఫైనల్లో తొలి అడుగు వేసేదెవరో నేడు తేలనుంది.

నేటి క్వాలిఫయర్-1లో పంజాబ్‌తో బెంగళూరు ఢీ

రా.7.30 నుంచి



ముల్లన్‌పూర్: ఐపీఎల్ తుది అంకానికి సమయం ఆసన్నమైంది. దశాబ్దం తర్వాత ప్లేఆఫ్స్‌కు చేరిన జోష్‌లో ఉన్న పంజాబ్ కింగ్స్‌కు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) రూపంలో అసలుసిసలు సవాల్ ఎదురుకానుంది. ఈ మెగా లీగ్‌లో సమవుజ్జీలుగా కనిపిస్తున్న పంజాబ్, బెంగళూరు జట్లు గురువారం జరిగే క్వాలిఫయర్-1లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇందులో నెగ్గిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకోనుండగా.. ఓడిన జట్టుకు క్వాలిఫయర్-2 రూపంలో మరో అవకాశం ఉంటుంది. లీగ్ దశలో ఆడిన 14 మ్యాచ్‌ల్లో చెరో 9 విజయాలతో పంజాబ్, బెంగళూరు 19 పాయింట్లతో సమంగా నిలిచాయి. అయితే, మెరుగైన రన్‌రేట్‌తో పంజాబ్ టాప్‌లో నిలిచింది. 2014లో చివరిసారి నాకౌట్ చేరిన పంజాబ్.. ఈసారి అందరి అంచనాలను తారుమారు చేస్తూ అనూహ్యంగా టాప్‌లో నిలిచింది. జట్టును ఈస్థాయిలో నిలపడంలో కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, కోచ్ రికీ పాంటింగ్ కృషి ఎంతో ఉంది. ఇక, ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ అదిరే ఆరంభాన్నిస్తుంటే.. ఇంగ్లిస్, అయ్యర్, నేహల్ వధేరా మిడిలార్డర్‌లో వెన్నెముకగా నిలుస్తున్నారు. శశాంక్ సింగ్, స్టొయినిస్ ఫినిషర్లుగా అదరగొడుతున్నారు. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, హర్‌ప్రీత్ బ్రార్ అండగా నిలుస్తున్నారు. దక్షిణాఫ్రికా పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ మార్కో జాన్సెన్ స్వదేశానికి తిరిగివెళ్లడంతో అతడి స్థానంలో ఒమర్జాయ్‌కు తుదిజట్టులో చోటు దక్కొచ్చు. గాయం నుంచి కోలుకున్న లెగ్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ ఈ మ్యాచ్‌లో ఆడే చాన్సుంది.

దూకుడుగా ఆర్సీబీ: సుదీర్ఘ కాలం తర్వాత ఆర్సీబీ టాప్-2లో నిలిచింది. లీగ్ దశలో అదిరే ప్రదర్శన చేసిన బెంగళూరు.. ఆఖరి మ్యాచ్‌లో భారీ లక్ష్యాన్ని ఛేదించిన జోష్‌లో ఉంది. ఓపెనర్లు సాల్ట్, కోహ్లీ దూకుడైన ఆరంభాన్నిస్తుండగా.. మిడిలార్డర్‌లో తాత్కాలిక కెప్టెన్ జితేశ్ శర్మ ప్రదర్శన కీలకంగా మారింది. గాయపడిన టిమ్ డేవిడ్ సెలెక్షన్‌కు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. ఇక, హాజెల్‌వుడ్ ఫుల్ ఫిట్‌నెస్ సాధించడంతో బౌలింగ్ బలం పెరిగింది. పేసర్ భువనేశ్వర్ కుమార్‌తోపాటు స్పిన్నర్లు క్రునాల్ పాండ్యా, సుయాష్ శర్మ జట్టుకు ఉపయోగపడుతున్నారు. ఇదే పిచ్‌పై జరిగిన ఓ మ్యాచ్‌లో పంజాబ్‌పై గెలుపొందడం బెంగళూరుకు సానుకూలాంశం. మరోవైపు, సొంతగడ్డపై విజయంతో నేరుగా ఫైనల్ బెర్త్ పట్టేయాలని అయ్యర్ సేన పట్టుదలతో ఉంది.

జట్లు (అంచనా)

పంజాబ్: ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్, జోష్ ఇంగ్లిస్ (వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), నేహల్ వధేరా, శశాంక్ సింగ్, స్టొయినిస్, ఒమర్జాయ్, హర్‌ప్రీత్ బ్రార్, కైల్ జేమిసన్, అర్ష్‌దీప్ సింగ్, చాహల్ (ఇంపాక్ట్ సబ్)

బెంగళూరు: కోహ్లీ, సాల్ట్, మయాంక్ అగర్వాల్, రజత్ పటీదార్ (కెప్టెన్), జితేశ్ శర్మ (వికెట్ కీపర్), క్రునాల్ పాండ్యా, లివింగ్‌స్టోన్, రొమారియో షెఫర్డ్, భువనేశ్వర్, యష్ దయాళ్, హాజెల్‌వుడ్, సుయాష్ శర్మ (ఇంపాక్ట్ సబ్).

పిచ్/వాతావరణం..

ముల్లాన్‌పూర్‌లో ఇప్పటి వరకు నాలుగు మ్యాచ్‌లు జరగగా.. తొలి రెండు మ్యాచ్‌ల్లో 200పైగా స్కోర్లు నమోదయ్యాయి. ఆ తర్వాతి మ్యాచ్‌లో 111 పరుగులను పంజాబ్ కాపాడుకొంది. మరో మ్యాచ్‌లో పంజాబ్ నిర్దేశించిన 157 పరుగుల లక్ష్యాన్ని బెంగళూరు ఛేదించింది. మరి నేటి కీలక మ్యాచ్‌కు ఎలాంటి వికెట్‌ను ఎంపిక చేస్తారో చూడాలి. వాతావరణం సాధారణంగా పొడిగా ఉండనుంది. వర్షచాయలు లేవు.

ఒకవేళ మ్యాచ్ రద్దయితే..?

షెడ్యూల్ ప్రకారం క్వాలిఫయర్-1 మ్యాచ్‌కు రిజర్వ్ డే లేదు. దీంతో ఏదైనా కారణంతో ఈ మ్యాచ్ రద్దయితే, పంజాబ్ నేరుగా ఫైనల్ చేరుతుంది. పాయింట్ల పట్టికలో టాప్‌లో ఉంది కాబట్టి శ్రేయాస్ సేనకు తుదిబెర్త్ దక్కుతుంది. అయితే, వర్ష సూచన లేదు కాబట్టి, మ్యాచ్ పూర్తిగా జరిగే అవకాశముంది.

మిక్స్‌డ్ రిలేలో పసిడి



రెండోరోజు భారత్‌కు ఆరు పతకాలు

ఆసియా అథ్లెటిక్స్

గుమి (దక్షిణ కొరియా): ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు వరుసగా రెండోరోజూ సత్తా చాటారు. బుధవారం జరిగిన పోటీల్లో ఓ స్వర్ణం సహా ఆరు పతకాలు కొల్లగొట్టారు. 4x400 మీటర్ల మిక్స్‌డ్ రిలే టీమ్ ఈవెంట్‌లో రూపల్ చౌదరి, సంతోష్ కుమార్, విశాల్, సుభా వెంకటేశన్‌లతో కూడిన భారత జట్టు ఫైనల్లో విజేతగా నిలిచి టైటిల్ నిలబెట్టుకుంది. భారత బృందం 3:18.12 సెకన్లలో రేసు ముగించి పసిడి పతకం దక్కించుకుంది. కాగా.. చైనా (3:20.52 సె), శ్రీలంక (3:21.95 సె) జట్లు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి రజతం, కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నాయి. ఇక, స్వర్ణం నెగ్గిన భారత మిక్స్‌డ్ టీమ్‌లో సభ్యురాలైన రూపల్ చౌదరి వ్యక్తిగత 400 మీటర్ల రేసులో రజతం అందుకుంది. డెకాథ్లాన్‌లో భారత అథ్లెట్ తేజస్విన్ శంకర్ 7618 పాయింట్లు స్కోరు చేసి రజతం నెగ్గాడు. పురుషుల ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్, మహిళల 1500 మీటర్ల రేసులో పూజ రజత పతకాలు సాధించారు. పురుషుల 1500 మీటర్ల రేసులో యూనస్ షా కాంస్యం దక్కించుకున్నాడు. రెండోరోజు పోటీలు ముగిసేసరికి భారత్ మొత్తం 8 పతకాలతో ఉంది. మంగళవారం గుల్వీర్ సింగ్ (10వేల మీటర్లు) స్వర్ణం, సెబాస్టియన్ (20 కి.మీ రేస్‌వాక్) కాంస్యం నెగ్గిన సంగతి తెలిసిందే. ఇక తెలుగమ్మాయి జ్యోతి యర్రాజి 110 మీటర్ల హర్డిల్స్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. తన హీట్స్‌లో జ్యోతి మూడోస్థానంలో నిలిచి ఫైనల్ రేసుకు అర్హత సాధించింది. మరో తెలుగు అథ్లెట్ రజిత కుంజ జట్టు సభ్యులతో కలిసి మహిళల 4x400 మీటర్ల రిలే ఈవెంట్‌లో ఫైనల్ చేరింది.

డబుల్స్‌లో ముందంజ

● సాత్విక్, గాయత్రి, రుత్విక జోడీలు శుభారంభం

సింగపూర్ ఓపెన్



సింగపూర్: భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి సింగపూర్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేసింది. పురుషుల డబుల్స్ ఆరంభ రౌండ్లో సాత్విక్ జంట 21-16, 21-13తో మలేసియా జోడీ చూంగ్ హాన్/మహ్మద్ హైకల్‌ను ఓడించింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా జాలీ ద్వయం 21-14, 19-21, 21-17తో తైపీ జంట చాంగ్ చింగ్/యాంగ్ చింగ్‌పై నెగ్గి రెండోరౌండ్ చేరగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో రుత్వికా శివాని/రోహన్ ద్వయం 21-16, 21-19తో అమెరికా జంట చెన్/కార్బెట్‌ను చిత్తుచేసి రెండోరౌండ్లో ప్రవేశించింది. కాగా, పురుషుల సింగిల్స్‌లో భారత నెంబర్‌వన్ షట్లర్ లక్ష్య సేన్ వెన్నునొప్పి కారణంగా ఆరంభ రౌండ్ మ్యాచ్ మధ్యలోనే వెనుదిరిగాడు. తైపీ షట్లర్ లిన్ చున్ యితో పోరులో లక్ష్య 21-15, 17-21, 5-13తో ఉన్నప్పుడు మ్యాచ్ నుంచి వైదొలిగాడు. ఇక, మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్, అనుపమ, ఉన్నతి ప్రత్యర్థుల చేతిలో ఓడి ఆదిలోనే ఇంటిబాట పట్టారు.

గుకేష్‌కు అర్జున్ షాక్


నార్వే చెస్

స్టావెంజర్ (నార్వే): నార్వే చెస్ టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి సంచలనం సృష్టించాడు. రెండో రౌండ్‌లో వరల్డ్ చాంపియన్ గుకేష్‌కు అర్జున్ షాకిచ్చాడు. తెల్లపావులతో ఆడిన అర్జున్ 62 ఎత్తుల్లో గుకేష్ ఆటకట్టించాడు. కాగా, మొదటి రౌండ్‌లో వరల్డ్ నెం.1 కార్ల్‌సన్ చేతిలో గుకేష్ ఓడాడు. మహిళల టోర్నీ రెండో రౌండ్‌లో అన్నా ముజిచెక్ (ఉక్రెయిన్) చేతిలో కోనేరు హంపి, లి టింగ్జీ (చైనా) చేతిలో వైశాలి పరాజయం పాలయ్యారు. రెండురౌండ్ల అనంతరం నకమురా, అర్జున్ చెరో 4.5 పాయింట్లతో సంయుక్తంగా టాప్‌లో ఉన్నారు.

రూడ్ అవుట్

మూడో రౌండ్‌లో అల్కారజ్, స్వియటెక్, స్విటోలినా

ఫ్రెంచ్ ఓపెన్



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో రెండుసార్లు రన్నరప్, 7వ సీడ్ కాస్పర్ రూడ్ రెండో రౌండ్‌లోనే ఓడాడు. ఇక డిఫెండింగ్ చాంపియన్ అల్కారజ్, 8వ సీడ్ ముసేటి, మహిళల్లో 4వ సీడ్ పావొలిని, 5వ సీడ్ స్వియటెక్, 13వ సీడ్ ఎలెనా స్విటోలినా మూడో రౌండ్‌లో అడుగుపెట్టారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో పోర్చుగల్‌కు చెందిన అన్‌సీడెడ్ నునో బోర్గెస్ 2-6, 6-4, 6-1, 6-0తో రూడ్‌ను ఇంటిబాట పట్టించాడు. అల్కారజ్ 6-1, 4-6, 6-1, 6-2తో ఫాబియన్‌పై, ముసేటి 6-4, 6-0, 6-4తో గాలన్‌పై గెలిచారు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లలో పావొలిని 6-3, 6-3తో టోమ్‌జనోవిక్‌ని, నిరుటి విజేత స్వియటెక్ 6-1, 6-2తో ఎమ్మా రదుకానుని, 8వ సీడ్ జెంగ్ 6-2, 6-3తో అరాంగోని, స్విటోలినా 7-6 (4), 7-5తో అనా బోండర్‌ని ఓడించారు.

డబుల్స్‌లో బోపన్న, భాంబ్రీ బోణీ

రోహన్ బోపన్న, యుకీ భాంబ్రీ జోడీలు పురుషుల డబుల్స్‌లో శుభారంభం చేశాయి. తొలిరౌండ్‌లో భాంబ్రీ/గాలోవే (అమెరికా) ద్వయం 6-3, 6-7 (10), 6-3తో హాస్/జెబెన్స్ జంటపై నెగ్గింది. బోపన్న/ఆడమ పల్వెక్ (చెక్ రిపబ్లిక్) జోడీ 7-6(6), 5-7, 6-1తో కాప్/ట్రేసీ ద్వయంపై విజయంతో రెండో రౌండ్‌కు చేరింది. రిత్విక్ బొల్లిపల్లి/ నికొలాస్ (కొలంబియా) జంట మొదటి రౌండ్‌లోనే ఓటమిపాలైంది.

పంత్‌కు రూ. 30 లక్షల జరిమానా

లఖ్‌నవూ: బెంగళూరుతో మ్యాచ్‌లో లఖ్‌నవూ స్లో ఓవర్‌రేట్ కోడ్ ఉల్లంఘించినందుకు ఆ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్‌కు రూ. 30 లక్షల జరిమానా పడింది. మిగిలిన జట్టు సభ్యులకు రూ. 12 లక్షల చొప్పున లేదా మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించారు. ఈ లీగ్‌లో కోడ్‌ను ఉల్లంఘించడం లఖ్‌నవూకిది మూడోసారి. అందుకే, భారీగా జరిమానా విధించినట్టు ఐపీఎల్ నిర్వాహకులు వెల్లడించారు.



ఆలా చేయడం బౌలర్‌ను అవమానించినట్టే!

పంత్ విత్‌డ్రా నిర్ణయాన్ని తప్పుబట్టిన అశ్విన్

న్యూఢిల్లీ: లఖ్‌నవూతో మ్యాచ్‌లో బెంగళూరు ఆటగాడు జితేశ్ శర్మ రనౌట్ అప్పీల్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. భారీ ఛేదనలో జితేశ్ పవర్ హిట్టింగ్‌తో బెంగళూరు లక్ష్యం దిశగా దూసుకెళ్తోంది. అయితే, 17వ ఓవర్‌లో స్పిన్నర్ దిగ్వేష్ రాఠీ.. నాన్‌స్ట్రయికర్ ఎండ్‌లో ఉన్న జితేశ్‌ను రనౌట్ చేశాడు. థర్డ్ అంపైర్ రీప్లేను పరిశీలిస్తుండగానే.. లఖ్‌నవూ కెప్టెన్ రిషభ్ పంత్ అప్పీలును విరమించుకున్నాడు. దీన్ని టీమిండియా మాజీ స్పిన్నర్ అశ్విన్ తప్పుబట్టాడు. 'థర్డ్ అంపైర్ వద్దకు చేరినప్పుడు నిర్ణయం కోసం వేచి చూడాలి. అంతేకానీ, మధ్యలో తన బౌలర్‌దే తప్పన్నట్టుగా పంత్ అప్పీలును వెనక్కితీసుకోవడమంటే, బౌలర్‌ను అవమానించినట్టే'నని అశ్విన్ అన్నాడు.

హాకీలో అమ్మాయిల గెలుపు

రోసారియో (అర్జెంటీనా): నాలుగు దేశాల జూనియర్ మహిళల హాకీ టోర్నీలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య అర్జెంటీనాను భారత్ పెనాల్టీ షూటౌట్‌లో 2-0తో చిత్తు చేసింది. నిర్ణీత సమయానికి ఇరుజట్లు 1-1తో సమంగా నిలవడంతో పెనాల్టీ షూట్ అనివార్యమైంది. శుక్రవారం చైనాతో భారత్ తలపడనుంది.

ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల రాష్ట్ర సంఘం ఎన్నిక

» రాష్ట్ర అధ్యక్షుడిగా బత్తుల రాజేంద్రప్రసాద్

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పద్మనాయక ప్రత్యేక విద్య కళాశాలలో ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కమిటీ కొత్త కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బత్తుల రాజేంద్ర ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా అట్ల శ్రీనివాస్ రెడ్డి నియమితులయ్యారు. వీరితో పాటు 23 జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా సైదులు వ్యవహరించారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల స్పెషల్ టీచర్లు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్ మృతులకు ఇలాగేనా అంత్యక్రియలు

» ఇది దుర్మార్గమైన చర్య.. పౌరహక్కుల సంఘం

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌కౌంటర్ మృతులకు బలవంతంగా ప్రభుత్వమే అంత్యక్రియలు నిర్వహించడం దుర్మార్గమైన చర్య అని పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన 26 మందిలో ఆదివాసీల మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించి, ఉద్యమ నాయకుల మృతదేహాల కోసం ప్రాధేయపడినా కుటుంబసభ్యులకు ఇవ్వకుండా అంత్యక్రియలు నిర్వహించడం చరిత్రలోనే తొలిసారి అని ఆయన ఆరోపించారు. ఆపరేషన్ కగార్ ప్రారంభించిన తర్వాత 550 మందిని ఎన్‌కౌంటర్ల పేరిట దారుణంగా హత్య చేశారని, ఆదివాసీలను ఇక్కడి నుంచి ఖాళీ చేసి ఆ భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ఆదివాసీల హక్కుల రక్షణ కోసం కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలకు మార్గం సుగమం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

చీటింగ్ కేసులో శ్రవణ్‌రావు బెయిల్ పిటిషన్ ఉపసంహరణ

» హీరాగోల్డ్ ఎండీ నౌహీరాషేక్‌కు దక్కని ఊరట

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా ఉండి ఓ చీటింగ్ కేసులో అరెస్టు అయిన ప్రైవేట్ న్యూస్ చానల్ ఎండీ ఎ.శ్రవణ్‌కుమార్ తన బెయిల్ పిటిషన్‌ను బుధవారం హైకోర్టులో ఉపసంహరించుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టు కాకుండా సుప్రీంకోర్టు నుంచి మధ్యంతర రక్షణ ఉత్తర్వులు పొందిన శ్రవణ్‌కుమార్ రావు.. అనూహ్యంగా ఇనుప ఖనిజం వ్యాపార లావాదేవీలకు సంబంధించిన మోసం కేసులో అరెస్టు అయిన సంగతి తెలిసిందే. పోలీసులు కక్షగట్టి సివిల్ వ్యవహారాన్ని క్రిమినల్ కేసుగా మార్చి అరెస్టు చేశారని.. తనను అక్రమంగా కేసులో ఇరికించిన నేపథ్యంలో బెయిల్ ఇవ్వాలని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత వారం ఈ పిటిషన్ విచారణకు రాగా హైకోర్టు వివరణ ఇవ్వాలని పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. తాజాగా బుధవారం ఈ పిటిషన్ జస్టిస్ కే శరత్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. బెయిల్ పిటిషన్ ఉపసంహరించుకుంటున్నట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది చెప్పడంతో ధర్మాసనం అందుకు అంగీకరించింది. మరోవైపు.. హీరాగోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డిపాజిటర్లను మోసం చేసిన కేసులో సదరు కంపెనీ ఎండీ నౌహీరాషేక్‌కు హైకోర్టులో ఊరట లభించలేదు. ట్రయల్‌కు హాజరుకాకపోవడంతో ట్రయల్ కోర్టు (దిగువ కోర్టు) జారీచేసిన నాన్‌బెయిలబుల్ వారంట్‌ను కొట్టేయాలని.. బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించడానికి హైకోర్టు నిరాకరించింది. ట్రయల్ కోర్టుకు వెళ్లి విజ్ఞప్తి చేయాలని సూచించింది.

ఓఎంసీ దోషులకు దక్కని ఊరట

» గాలి జనార్దన్ రెడ్డి తదితరుల బెయిల్ పిటిషన్లు

» వినేందుకు ముగ్గురు న్యాయమూర్తుల తిరస్కరణ

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో సీబీఐ కోర్టులో దోషులుగా తేలి ఏడేళ్ల జైలుశిక్ష పడిన మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి సహా ఇతరులకు బుధవారం హైకోర్టులో ఎలాంటి ఊరటా లభించలేదు. ఈ కేసులో సీబీఐ కోర్టు తీర్పును సస్పెండ్ చేసి మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ గాలి జనార్దన్‌రెడ్డి, బీవీ శ్రీనివాస్‌రెడ్డి, వీడీ రాజగోపాల్, అలీఖాన్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఆ పిటిషన్లు గత వారం వెకేషన్ కోర్టు ఎదుట విచారణకు రాగా అత్యవసరం ఏమీలేదంటూ.. జస్టిస్ నందికొండ నర్సింగరావు విచారణను వాయిదా వేశారు. బుధవారం ఈ పిటిషన్లు జస్టిస్ కె.శరత్ విచారణ జాబితాలో తొలుత లిస్ట్ అయ్యాయి. అయితే, వ్యక్తిగత కారణాలతో ఈ పిటిషన్లను తాను వినలేనని (నాట్ బిఫోర్ మీ) అని ఆయన చెప్పారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వెకేషన్ కోర్టు సీనియర్ జడ్జి అయిన జస్టిస్ నగేశ్ భీమపాక దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో ఆయన ఈ పిటిషన్లను జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణకు బదిలీ చేశారు. అప్పటికే సాయంత్రం 6.30 గంటలు అవుతుండటంతో ఆయన సైతం 'నాట్ బిఫోర్ మీ' అని ప్రకటించారు. జస్టిస్ నగేశ్ భీమపాక వద్ద ఈ విషయం గురించి ప్రస్తావించగా.. చూస్తానని ఆయన చెప్పారు. రాత్రి దాదాపు 8 గంటల ప్రాంతంలో పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ఓఎంసీ కేసుల గురించి మరోసారి గుర్తుచేయడంతో.. "ఈ పిటిషన్లను ఇప్పుడు విచారించి, సింగిల్ లైన్ ఆర్డర్‌లో తేల్చే అంశాలు కావ"ని జస్టిస్ నగేశ్ భీమపాక పేర్కొన్నారు. ముగ్గురు జడ్జిలు ఈ పిటిషన్లను విచారణకు స్వీకరించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవాలన్నారు. తాను ఇప్పుడు ఏ వ్యాఖ్య చేసినా ఎక్కడికో వెళ్తుందని పేర్కొన్నారు. కాగా.. ఈ కేసులు రెగ్యులర్ కోర్టులో సుదీర్ఘంగా వాదనలు వినిపించాల్సిన కేసులని, వీటిపై వెకేషన్ తర్వాత విచారణ జరపాలని సీబీఐ తరఫు న్యాయవాది కపాటి శ్రీనివాస్ కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ పిటిషన్లను చీఫ్ జస్టిస్ ఎదుట ఉంచాలని.. ఆయన ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

దేవరుప్పుల, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్ విమర్శించారు. ఈనెల 27నుంచి 29వరకు దేవరుప్పులలో జరుగుతున్న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు రెండోరోజూ బుధవారం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ ఇప్పటికీ కొంత మంది రైతులకు జరుగలేదన్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేష్ పాల్గొన్నారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా అపరేశ్ కుమార్ సింగ్

» జస్టిస్ వినోద్‌కుమార్ మద్రాస్ హైకోర్టుకు

» కేంద్రానికి సుప్రీం కొలీజియం సిఫార్సులు

హైదరాబాద్, న్యూఢిల్లీ, మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా అపరేశ్ కుమార్ సింగ్(ఏకే సింగ్) నియామకం కానున్నారు. ప్రస్తుతం త్రిపుర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన్ను తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీ అయినప్పటి నుంచి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజోయ్‌పాల్ సేవలు అందిస్తున్నారు. ఆయన్ను కోల్‌కతా హైకోర్టు జడ్జిగా బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. మరోవైపు తెలంగాణ హైకోర్టులో నాలుగో సీనియర్ జడ్జిగా ఉన్న జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేశారు. సుప్రీంకోర్టు కొలీజియం ఈ నిర్ణయాలను ఈ నెల 26నే తీసుకున్నా నోటిఫికేషన్లు మాత్రం తాజాగా బుధవారం వెలువడ్డాయి. అలాగే ఇప్పటికే తెలంగాణ హైకోర్టు నుంచి వివిధ రాష్ట్రాల హైకోర్టులకు బదిలీ అయిన జస్టిస్ సి. సుమలత, జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ ఎ. అభిషేక్‌రెడ్డి మళ్లీ తెలంగాణ హైకోర్టుకు బదిలీపై రానున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ మంగళవారం వెలువడింది. కాగా త్రిపురకు జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు(మాతృ హైకోర్టు తెలంగాణ), రాజస్థాన్‌కు జస్టిస్ కేఆర్ శ్రీరామ్‌ల పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది.



మద్రాస్ హైకోర్టుకు బదిలీ అయిన జస్టిస్ వినోద్‌కుమార్

న్యాయకోవిదుల కుటుంబం నుంచి

న్యాయకోవిదుల కుటుంబంలో మూడో తరానికి చెందిన జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ 1965 జూలై 7న డాక్టర్ రాంగోపాల్ సింగ్, డాక్టర్ శ్రద్ధసింగ్ దంపతులకు జన్మించారు. ఆయన కుటుంబానికి చెందిన తాత జస్టిస్ బీపీ సిన్హా సుప్రీంకోర్టు ఆరో ప్రధాన న్యాయమూర్తిగా.. మరో తాత అయిన జస్టిస్ శంభుప్రసాద్ సింగ్ పట్నా హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. బంధువులు జస్టిస్ బిశ్వేశ్వర్ ప్రసాద్, జస్టిస్ శివకీర్తి సింగ్ సుప్రీంకోర్టు జడ్జిలుగా పనిచేశారు. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ ఆనర్స్, న్యాయశాస్త్రంలో డిగ్రీ పొందిన ఏకే సింగ్ 1990లో ఉమ్మడి పట్నా హైకోర్టులో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 1990 నుంచి 2000 వరకు పట్నా హైకోర్టులో, 2001 నుంచి 2012 వరకు జార్ఖండ్ హైకోర్టు న్యాయవాదిగా పలు కీలక కేసులు వాదించారు. 2012లో జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2014లో శాశ్వత న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2022లో జార్ఖండ్ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా సేవలు అందించి.. 2023 ఏప్రిల్ 14న త్రిపుర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పదోన్నతి పొందారు. తాజాగా తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీపై రానున్నారు.

కాళేశ్వరం కమిషన్‌కు ఏం చెబుదాం?

హరీశ్‌రావుతో కేసీఆర్ మంతనాలు.. ఫామ్‌హౌస్‌లో 4గంటలపాటు సుదీర్ఘ చర్చ

సంగారెడ్డి ప్రతినిధి/హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కమిషన్ ముందు జూన్ 5న విచారణకు హాజరు కావాలని నిర్ణయించుకున్న మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. అందుకు సంబంధించి తగిన సమాచారాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ మేరకు బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్‌కు పిలిపించుకున్నారు. కమిషన్ ఇచ్చిన నివేదిక, అందించిన నోటీసులు సహా పలు అంశాలపై ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 3.30 వరకు ఆయనతో సుదీర్ఘంగా చర్చించారు. భేటీలో ఈ ఇరువురితోపాటు మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా ఉన్నారు. కాళేశ్వరం నిర్మాణం నుంచి మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు డ్యామేజీ అయ్యేవరకు జరిగిన పరిణామాలపై వారు మూడున్నర గంటలపాటు సమాలోచన చేసినట్లు తెలిసింది. ఎన్‌డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) ఏం సూచించింది, బ్యారేజి కుంగడంపై సాంకేతిక కారణాలు ఏమిటన్న దానిపై పూర్తివివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా.. ఇప్పటికే కమిషన్ ఎదుట హాజరైన కొంత మంది రిటైర్డ్ ఇంజనీర్లతో కేసీఆర్ ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. కమిషన్ అడిగిన ప్రశ్నలు ఏంటి? ఇంజనీర్లు ఇచ్చిన సమాధానాలు ఎలా ఉన్నాయన్న విషయాలపై కూడా వారిద్దరూ చర్చించినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్మించిన ప్రాజెక్టులు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నవాటికి సంబంధించిన సమాచారంపై కూడా కేసీఆర్, హరీశ్ మాట్లాడుకున్నట్లు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు పునాది పడిన నాటినుంచి పూర్తయ్యేవరకు అన్ని వివరాలను హరీశ్‌తో భేటీలో కేసీఆర్ ప్రస్తావించినట్లు తెలిసింది. ప్రాజెక్టుకు సంబంధించిన ఫైళ్లపై ఏయే సందర్భంలో సంతకాలు పెట్టాల్సి వచ్చిందో.. ఆయా ఫైళ్ల వివరాలను సైతం కేసీఆర్



తెప్పించుకున్నట్లు తెలిసింది. కాగా, కమిషన్ ఎదుట సమాధానాలు చెప్పే క్రమంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంతోపాటు కమిషన్‌ను సైతం ఇరుకునపెట్టే విధంగా పలు అంశాలను కేసీఆర్ ప్రస్తావించనున్నట్లు సమాచారం. అందుకే పూర్తిస్థాయిలో కాళేశ్వరం ప్రాజెక్టు లెక్కలు, వివరాలపై అధ్యయనం చేసేందుకే హరీశ్‌తో భేటీ జరిగినట్లు తెలిసింది. హరీశ్‌రావు సైతం జూన్ 9న విచారణకు హాజరవుతున్నందున.. ఎవరెవరు ఏయే అంశాలు ప్రస్తావించాలో ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం.

కవిత అంశంపైనా..

బీఆర్ఎస్ పార్టీ విధివిధానాలను తన లేఖతో ప్రశ్నించిన ఎమ్మెల్సీ కవిత అంశంపైనా కేసీఆర్, హరీశ్ భేటీలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. కవిత విషయంలో స్పందించవద్దని కేసీఆర్ ఇప్పటికే కేటీఆర్‌కు సూచనలు చేశారు. ప్రస్తుతం కేటీఆర్ అమెరికా పర్యటనలో ఉన్నందున కవిత అంశంలో పార్టీ నేతలు స్పందించకుండా చూసుకోవాలని హరీశ్‌కు, ప్రశాంత్‌రెడ్డికి కేసీఆర్ చెప్పినట్లు సమాచారం. కవిత ఎపిసోడ్, తాజా పరిణామాలపైనా ఈ ఇద్దరు నేతలతో కేసీఆర్ ఆరా తీసినట్లు తెలిసింది. ఇక జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంపై దృష్టి పెట్టాలని సూచించినట్లు సమాచారం.

పార్టీకి మైలేజీ కోసమేనా?

ప్రస్తుత పరిస్థితుల్లో ఇప్పటికిప్పుడు పార్టీలో ఉత్సాహం నింపాలంటే కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరవడమే తక్షణ కర్తవ్యంగా కేసీఆర్ భావించినట్లు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టును కట్టించడమే నేరమా? అనే కోణంలో కార్యకర్తలు, ప్రజలను రగిలించేలా పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఫామ్‌హౌస్‌లో మౌనంగా ఉండడం కంటే విచారణకు హాజరైతే తమ తప్పులు లేవని చెప్పడమే కాకుండా.. విచారణకు కేసీఆర్ హాజరవుతున్న సందర్భాన్ని పార్టీకి అనుకూలంగా మలచుకోవడానికి బీఆర్ఎస్ నాయకులూ సిద్ధమవుతున్నారు.

ఎన్‌డీఎస్ఏ నివేదిక బూటకమని తేలింది: కేటీఆర్

మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక బూటకమని, తాము చెప్పిందే నిజమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. కనీస పరీక్షలు నిర్వహించకుండా తుదినివేదిక ఎలా ఇస్తుందని ఎల్అండ్‌టీ ప్రశ్నించడంతో నివేదిక తప్పులతడక అని రుజువైందని ఎక్స్ వేదికగా తెలిపారు. నివేదికను ఎల్అండ్‌టీ తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు. సీఎం రేవంత్ రాష్ట్ర రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. కాగా, అధికారంలో లేకున్నా తెలంగాణ అభివృద్ధి కోసం పనిచేస్తూనే ఉంటామని, రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టేందుకు కృషిచేస్తామని కేటీఆర్ చెప్పారు. యూకేలో తెలుగు బిజినెస్‌కౌన్సిల్ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రగతికి బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేయాలని ఆయన కోరారు.

కిశోర బాలికలకు 'ఇందిరమ్మ అమృతం'!

» పైలట్ ప్రాజెక్టుగా మూడు జిల్లాల్లో అమలు

» బాలికలకు పల్లీ, చిరుధాన్యాల పట్టీలు

» నేడు కొత్తగూడెంలో ప్రారంభోత్సవం

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): కౌమార బాలికలకు పౌష్టికాహారాన్ని అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరమ్మ అమృతం' పథకాన్ని అమలు చేయనుంది. 14 ఏళ్ల నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన కిశోర బాలికల్లో రక్తహీనతను తగ్గించడంతో పాటు వయస్సుకు తగిన బరువు పెరిగేలా చేయాలనే ఉద్దేశంతో ఈ కొత్త పథకాన్ని రూపొందించింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, కుమ్రం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 50,269 మందికి పల్లి, చిరుధాన్యాలతో తయారైన పట్టీలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కౌమార బాలికలకు ఉచితంగా పంపిణీ చేయనుంది. పల్లీలు, రాగులు, సజ్జలు, కొర్రలు, అరికెలు, వరిగెలు, సామలు వంటి చిరుధాన్యాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలుండటంతో వాటితో తయారు చేసిన పట్టీలను వారికి నెలకు 30 చొప్పున అందజేస్తారు. వీటి తయారీ, నిల్వలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశం పరిశీలనకు కమిటీ కూడా ఏర్పాటైంది. ఈ ప్రాజెక్టు ద్వారా పొందిన అనుభవాల ఆధారంగా పథకాన్ని ఇతర జిల్లాలకూ విస్తరింపజేస్తారు. కొత్తగూడెంలో ఈ పథకాన్ని గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించనున్నారు. కౌమార బాలికలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్య తెలంగాణ నిర్మాణంలో భాగం కావాలని సీతక్క కోరారు. కాగా, ఈ పథకంలో భాగంగా ఆరోగ్యశాఖ ద్వారా అవసరమైన బాలికలకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను అందిస్తారు. సెర్ప్ సహకారంతో బాలికల జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేసే కార్యక్రమాలు చేపడతారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వీరి కోసం పోషకాహార చైతన్యం, బాల్య వివాహాలు, లింగ వివక్ష, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, బాలికల చట్టాలపై అవగాహన కల్పిస్తారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఉద్యోగావకాశాలను మెరుగుపరుస్తారు.

ముందస్తు ఖరీఫ్ సాగు పదేళ్లలో ఇదే మొదటి సారి

» పలు చోట్ల పత్తి విత్తనాలేసిన రైతులు

» ఈ సారి 1.35 కోట్ల ఎకరాల్లో సాగు

» వ్యవసాయశాఖ అంచనా

హైదరాబాద్, మే28 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రతి యేటా జూన్ మొదటివారంలో రాష్ట్రంలోకి ప్రవేశించే నైరుతి రుతుపవనాలు ఈసారి ముందే ఎంటరయ్యాయి. ఈ నెల 26న నైరుతి రుతుపవనాలు ప్రవేశించగా, 27న రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన వారం రోజులకు రైతులు వివిధ పంటల విత్తనాలు వేస్తారు. సాధారణంగా తెలంగాణలో తొలకరి వర్షాలు జూన్ 8-10 తేదీల మధ్య కురుస్తాయి. ఈసారి ఈ నెల 26 నుంచే తొలకరి వర్షాలు మొదలు కావడం.. గత పదేళ్లలో ముందస్తుగా వచ్చిన వర్షాకాలమని వాతావరణ శాస్త్రవేత్తలు చెప్పారు. 2023లో జూన్ ఐదో తేదీన, 2024లో జూన్ మూడో తేదీన తెలంగాణలో తొలకరి వర్షం కురిసింది. ఈ సారి తొలి 2 రోజుల్లోనే సాధారణ స్థాయిని మించి వర్షపాతం నమోదు కావడంతో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. అడపాదడపా కురిసిన వర్షాలతో దుక్కులు దున్ని పంట భూములను సాగుకు సిద్ధం చేసిన రైతులు.. వివిధ పంటల విత్తనాలు విత్తేందుకు సిద్ధమయ్యారు. ఇటీవలే కొన్ని చోట్ల పత్తి విత్తనాలు నాటిన రైతులు.. మిగతా ప్రాంతాల్లో శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 1.35కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ ఖరీఫ్ ప్రణాళికలో పేర్కొంది. వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, మినుములు, పెసళ్లు, వేరుశనగ, ఆముదం, నువ్వులు సాగు చేస్తారని తెలిపింది.

వరికి తక్కువ ఇతర పంటలకు ఎక్కువ!

పత్తి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.589 పెంపు.. వరికి కేంద్రం పెంచింది రూ.69 మాత్రమే

కేంద్రం నిర్ణయంపై రైతుల్లో మిశ్రమ స్పందన

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలను పెంచుతూ రైతులకు శుభవార్త చెప్పింది. ప్రధాన పంట అయిన వరికి మాత్రం క్వింటాకు కేవలం రూ.69 పెంచిన కేంద్రం.. ఇతర పంటలకు కాస్త మెరుగ్గా కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ)ను పెంచింది. పత్తి పంటకు క్వింటాకు రూ.589 చొప్పున ఎమ్మెస్పీ పెరిగింది. కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై వరి రైతులు కాస్త నైరాశ్యాన్ని, పత్తి రైతులు హర్షాన్ని వ్యక్తంచేస్తున్నారు. కనీస మద్దతు ధరల పెంపుపై రైతుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో వరి ప్రధాన పంటగా సాగవుతున్న విషయం తెలిసిందే.! ఈ ఏడాది వానాకాలంలో 67 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ తన ప్రణాళికలో పేర్కొంది. ఇందులో 45 లక్షల ఎకరాల్లో సన్నాలు, 22 లక్షల ఎకరాల్లో దొడ్డు రకాలు సాగుకానున్నట్లు తెలిపింది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి మద్దతు ధరలను ప్రకటించింది. వరి సాధారణ రకానికి ఇదివరకు రూ. 2,300 ఉండేది. ఇప్పుడు రూ. 69 పెరగటంతో రూ. 2,369కి చేరుకుంది. గ్రేడ్ 'ఏ' రకానికి ఇదివరకు రూ.2,320 ఉండగా ఇప్పుడు రూ. 2,389కి చేరింది. వాస్తవానికి రాష్ట్రంలో సన్నాలు సాగుచేస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తోంది. దీంతో సాధారణ రకాలైన సన్నాలకు క్వింటాలుకు రూ. 2,869 చొప్పున, గ్రేడ్-'ఏ' రకం సన్నాలకు రూ. 2,889 చొప్పున రైతులకు గిట్టుబాటు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం కనీసం రూ.200పెంచినా.. దొడ్డు ధాన్యానికి రూ.2,500 దాటేదని, సన్నాలకైతే బోనస్‌తో కలిపి రూ.3 వేలు దాటేదనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తంచేస్తున్నారు.

ఇతర పంటలకు రైతుల హర్షం

కేంద్ర ప్రభుత్వం పత్తికి రూ.589 చొప్పున ఎమ్మెస్పీని పెంచింది. దీంతో.. పింజ పొడవు మధ్యస్థంగా ఉండే పత్తి ధర రూ.7,710కి పెరగ్గా, పొడవు ఎక్కువగా ఉండే పత్తి ధర క్వింటాకు రూ. 8,110కి చేరుకుంది. ఈ పెంపు రైతులకు కాస్త ఉపశమనమిస్తోంది. పత్తి కొనుగోళ్లు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నేరుగా చేస్తోంది. రైతులు నేరుగా సీసీఐకి పత్తి విక్రయిస్తే.. ఎమ్మెస్పీ రైతుల ఖాతాల్లో పడుతుంది. 2013-14తో పోలిస్తే ఇప్పుడు పత్తి మద్దతు ధర 103% నుంచి 108% వరకు పెరిగిందని కేంద్రం వెల్లడించింది. జొన్నలకు రూ. 328, సజ్జలకు రూ.150, రాగులకు రూ.596, మొక్కజొన్నకు రూ.175, పెసర్లకు రూ.86, కందులకు రూ.450, వేరుశనగకు రూ.480, మినుములకు రూ.400, పొద్దుతిరుగుడుకు రూ.441, కుసుమలకు రూ.579, సోయాబీన్‌కు రూ.436, నువ్వులకు రూ.820 చొప్పున ఎమ్మెస్పీ పెరిగింది. ఇతర పంటలను ఎక్కువగా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం వరి మద్దతు ధరను తక్కువగా, నూనెగింజలు, పప్పుదినులు, ఇతర ఆహార ధాన్యాల ధరలను కాస్త ఎక్కువగా పెంచిందని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా, రైతులు ఎక్కువ సాగుచేసే పంటలకు తక్కువ ఎమ్మెస్పీ పెంచారని, తక్కువగా సాగయ్యే పంటలకు ఎక్కువ ఎమ్మెస్పీ పెంచారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అన్నింటికంటే ఒలిశలు(గడ్డి నువ్వులు) ఎమ్మెస్పీని రూ.820 మేర పెంచడంతో.. వాటి ధర క్వింటాకు రూ.9,537కు చేరుకుంది. వీటి సాగు రాష్ట్రంలో పెద్దగా ఉండదని రైతులు చెబుతున్నారు. దీంతో ఇక్కడి రైతులకు కలిగే ప్రయోజనం ఏమీ ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జొన్నలు, సజ్జల ఎమ్మెస్పీ కూడా చాలా స్వల్పంగా పెరిగింది. మొక్కజొన్న సాగు కూడా రాష్ట్రంలో రెండు సీజన్లలో కలిపి 13-15 లక్షల ఎకరాల వరకు ఉంటుంది.

తెలంగాణ రైతులకు మేలు: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ: 14 పంటలకు ఎమ్మెస్పీని పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో తెలంగాణతోపాటు.. దేశవ్యాప్తంగా రైతులకు ఎంతగానో మేలు కలుగుతుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కేంద్రం నిర్ణయం ప్రకారం వరి కనీస మద్దతు ధర రూ.2,369కి, పత్తి మద్దతు ధర రూ.7,710కి పెరిగిందని వివరించారు.

చిత్రజ్యోతి

SINCE 1965

సంక్రాంతికి సందడి



తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరిస్తూ వరుస విజయాలను అందుకుంటున్న కథానాయకుడు నవీన్ పోలిశెట్టి. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు'. మీనాక్షి చౌదరి కథానాయిక. మారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'ఈసారి సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు' థియేటర్లలోకి అడుగుపెట్టబోతోంది. మిమ్మల్ని నవ్వుల్లో ముంచెత్తేందుకు నవీన్ పోలిశెట్టి సిద్ధమవుతున్నాడు' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, సినిమాటోగ్రఫీ: జే యువరాజ్

వీరమల్లుతో తార



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయిక. బాబీడియోల్ కీలకపాత్ర పోషిస్తున్నారు. జూన్ 12న విడుదలవుతోంది. చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం 'తార తార' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. శ్రీహర్ష సాహిత్యం అందించగా, ఎం.ఎం కీరవాణి స్వరాలు సమకూర్చారు. లిప్సిక భాష్యం, ఆదిత్య అయ్యంగార్ ఆలపించారు. ఈ సందర్భంగా ఏ.ఎం రత్నం మాట్లాడుతూ 'ఐదు సంవత్సరాలు ఎంతో కష్టపడి ఈ సినిమాను రూపొందించాం. కీరవాణి గారు అద్భుతమైన సంగీతం అందించారు' అని చెప్పారు. పవన్ కల్యాణ్ పోషించిన వీరమల్లు పాత్ర మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉంటుందని జ్యోతికృష్ణ అన్నారు. 'హరిహర వీరమల్లు' చిత్రం ఘన విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను అని కీరవాణి చెప్పారు. ఏ.ఎం రత్నం గారు ఈసినిమాను ఐదేళ్లు తన భుజాలపై మోశారు అని నిధి అగర్వాల్ అన్నారు.

వినూత్నమైన ప్రేమకథ

'బిచ్చగాడు' ఫేమ్ విజయ్ ఆంటోని కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'మార్గన్'. లియోజాన్ పాల్ దర్శకత్వంలో విజయ్ ఆంటోనీ ఫిల్మ్స్ నిర్మించింది. జూన్ 27న విడుదలవుతోంది. చిత్రబృందం బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయ్ ఆంటోని మాట్లాడుతూ 'లియో నాకు 'మార్గన్' కథ చెప్పినప్పుడు అతని శైలి నాకు బాగా నచ్చింది. చాలా బాగా తెరకెక్కించాడు. నా మేనల్లుడు అజయ్‌ను ఈ చిత్రంతో నటుడిగా పరిచయం చేస్తున్నాను. ఇదొక సూపర్ నేచురల్ థ్రిల్లర్. రివెంజ్ స్టోరీతో సాగే ఓ థ్రిల్లింగ్ ప్రేమకథ. తెలుగు ప్రేక్షకులూ 'మార్గన్' చిత్రాన్ని ఆదరించండి' అని కోరారు. 'ఇది నాకు దర్శకుడిగా తొలి చిత్రం. మార్గన్ కోసం చాలా ఖర్చు పెట్టాం. విజయ్ తన పాత్రకు నూరు శాతం న్యాయం చేశారు' అని లియో జాన్ పాల్ తెలిపారు. మా కలయికలో వస్తున్న మూడో చిత్రమిది, ప్రేక్షకులను థ్రిల్ చేస్తుందని చిత్ర సమర్పకుడు రామాంజనేయులు అన్నారు.





చిరంజీవికి నచ్చింది

అర్జున్ సర్జా

అర్జున్ సర్జా కీలకపాత్ర పోషిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'సీతా పయనం'. అర్జున్ సర్జా తనయ ఐశ్వర్యా అర్జున్, నిరంజన్ జంటగా నటిస్తున్నారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు సుకుమార్, హీరో ఉపేంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సుకుమార్ మాట్లాడుతూ 'నేను సహాయ దర్శకుడిగా ఉన్నప్పుడు అర్జున్ గారిని చూశాను. ఆయన చాలా కూల్‌గా ఉంటారు. తన కూతురు కోసం అర్జున్ చేస్తున్న ఈ సినిమా సూపర్‌హిట్ అవ్వాలి' అని ఆకాంక్షించారు. ఉపేంద్ర మాట్లాడుతూ 'నాకు డైలాగ్ రైటర్‌గా ఇండస్ట్రీలో అవకాశం ఇచ్చింది అర్జున్ గారే. ఆయన చాలా ఏళ్ల క్రితమే పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. 'సీతా పయనం' టీజర్ చాలా బావుంది. తప్పకుండా సినిమా పెద్ద హిట్ అవుతుంది' అని అన్నారు. 'ఈ కథ రాసుకున్నప్పుడు చిరంజీవిగారికి చెప్పాను. ఆయనకు బాగా నచ్చింది. మా అమ్మాయి కోసం ఈ సినిమా మొదలుపెట్టాను. ఉపేంద్ర గారి అన్నయ్య కొడుకు నిరంజన్ ఈ సినిమాలో హీరో. తను అద్భుతంగా నటించాడు' అని అర్జున్ సర్జా తెలిపారు.

పంట నష్ట పరిహారం రూ.51.52 కోట్లు!

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత 2 నెలల్లో కురిసిన అకాల, వడగళ్ల వర్షాలతో 28 జిల్లాల్లో పంట దెబ్బ తిన్న రైతులకు ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. 41,361 మంది రైతులకు చెందిన 51,528 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు అధికారులు గుర్తించారు. దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.51.52 కోట్ల నష్ట పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు రూ.51.52 కోట్లను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఓ వైపు పంట ఉత్పత్తుల కొనుగోళ్లు చేపడుతూనే మరోవైపు ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి, అండగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెలలో కురిసిన అకాల వర్షాలతో పంట నష్టంపై వారం క్రితం నివేదిక సమర్పించారు. వీరికి మరో విడతలో నిధులు మంజూరు చేసే అవకాశాలున్నాయి.

వరి నాట్ల సమయానికి 'రైతు భరోసా'

» అత్యధిక ధాన్యం పండించే రాష్ట్రంగా తెలంగాణ: తుమ్మల

చిట్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో వరి నాట్లు వేసే లోపు రైతుల ఖాతాల్లో 'రైతు భరోసా' నగదు జమ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దేశంలో ఎక్కువ వరి ధాన్యం పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటల సాగులో యూరియా వాడకం తగ్గించాలని.. ఆయిల్ పామ్, వక్క, జాజి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

2న 'రాజీవ్ యువ వికాసం' పంపిణీ : భట్టి

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంజూరు పత్రాలు ఇవ్వనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం అమలుపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బుధవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం అమలుతో వ్యాపార కార్యకలాపాలు విస్తృతంగా సాగుతాయన్నారు. తద్వారా రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి(జీఎస్‌డీపీ) పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకే ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్లను ఆయన ఆదేశించారు. రూ.8 వేల కోట్ల నిధులతో 5 లక్షల మంది యువతకు ఈ పథకం ద్వారా ఉపాధి కల్పిస్తామని భట్టి విక్రమార్క చెప్పారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి

» రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ జి.చిన్నారెడ్డి

» తెలుగు యూనివర్సిటీ నూతన లోగో ఆవిష్కరణ

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కవి, రచయిత, సంపాదకులు, సామాజికవేత్త సురవరం ప్రతాపరెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి అని, తెలంగాణ పోరాటం, సామాజిక స్ఫూర్తి ప్రదాత అని, అలాంటి గొప్ప వ్యక్తి పేరు తెలుగు యూనివర్సిటీకి పెట్టడం హర్షణీయమని రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్‌చైర్మన్ డా.జి.చిన్నారెడ్డి అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బుధవారం జరిగిన సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి కార్యక్రమంలో చిన్నారెడ్డి మాట్లాడుతూ.. సురవరం ప్రతాపరెడ్డి పేరు ఉమ్మడి రాష్ట్రంలోనే తెలుగు యూనివర్సిటీకి పెట్టాల్సిందన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ నూతన లోగోను చిన్నారెడ్డి ఆవిష్కరించారు.

బ్యారేజీల పరీక్షలకు రూ.11.40 కోట్లు

» ప్రభుత్వానికి తెలిపిన సీడబ్ల్యూపీఆర్ఎస్

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో పరీక్షలకు రూ.11.40 కోట్లు ఖర్చవుతాయని కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ(సీడబ్ల్యూపీఆర్ఎస్-పుణె) అంచనా వేసింది. ఇటీవలే ప్రభుత్వం ఈ 3 బ్యారేజీల్లో పరీక్షల బాధ్యతను సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు అప్పగించింది. దాంతో ఆ సంస్థ పరీక్షలకు అవసరమైన అంచనాలను రూపొందించి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ఒక్కో బ్యారేజీకి రూ.3.80 కోట్లు ఖర్చు అవుతాయని లెక్క కట్టింది.

పెండింగ్ బకాయిలు ఇప్పించండి

» ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధుల విజ్ఞప్తి



వికాస్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న బకాయిలు ఇప్పించాలంటూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్‌ను బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ ప్రతినిధులు కోరారు. బుధవారం వికాస్‌రాజ్‌ను సచివాలయంలోని చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.18 వేల కోట్ల విలువ చేసే పనులు జరుగుతున్నాయని.. వాటిని సకాలంలో పూర్తి చేయాలంటే గత బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ పనులకు రూ.2,300 కోట్ల బిల్లులు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. గతంలో చేసిన పనులు, వాటి బిల్లులపై స్పష్టత కోసం అవసరమైతే శాఖలోని ఇంజనీర్లు, కాంట్రాక్టర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన దాదాపు 30 వేల కిమీ హ్యామ్ రోడ్ల పనులూ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. తమ బకాయిలతో పాటు కాంట్రాక్టర్లకు ఇస్తామని చెబుతున్న 40% నిధులను అందిస్తే నిర్మాణాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎన్ రెడ్డి, రాష్ట్ర చైర్మన్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

» ఈ నెల 31వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ

» ఈ ఏడాది మహబూబ్‌నగర్‌లో కొత్త క్యాంపస్

బాసర / హైదరాబాద్ మే 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) ఆధ్వర్యంలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు బుధవారం బాసర క్యాంపస్ వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. గ్రామీణ విద్యార్థులు పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా బాసర క్యాంపస్‌లో 1500 మందికి, మహబూబ్‌నగర్ క్యాంపస్‌లో 180 మంది విద్యార్థులకు అధికారులు ప్రవేశం కల్పిస్తారు. ఈ నెల 31 నుంచి జూన్ 21 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. మరిన్ని వివరాల కోసం తమ అధికారిక వెబ్‌సైట్ www.rgukt.ac.in ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.

మహబూబ్‌నగర్‌లో ఆర్జీయూకేటీ కొత్త క్యాంపస్

బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటీ రెండో క్యాంపస్ మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు కానుంది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాత్కాలిక భవనంలో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. బాసర క్యాంపస్‌లో ఏడు ఇంజనీరింగ్ కోర్సులు అందుబాటులో ఉండగా.. ఈ క్యాంపస్‌లో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి అమూడు కోర్సులను బోధించనున్నారు.

క్యాబినెట్ విస్తరణలో మాదిగలకు చోటివ్వాలి

» రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షికి మాదిగ ఎమ్మెల్యేల బృందం విజ్ఞప్తి

» పీసీసీ అబ్జర్వర్ల నివేదికలపై మీనాక్షి సమీక్ష

హైదరాబాద్/పంజాగుట్ట/ఖైరతాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజికవర్గానికి అవకాశం ఇవ్వాలని ఆ వర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మానకొండూరు ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్, మందుల సామ్యూల్ తదితరుల బృందం మీనాక్షితో భేటీ అయి చర్చించింది. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. మాదిగ సామాజిక వర్గానికి మంత్రి పదవి వచ్చాక కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి కృతజ్ఞతగా 25 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. కేసీఆర్ హయాంలో మాదిగలకు అన్యాయం జరిగిందని, అందుకే మాదిగలంతా ఏకపక్షంగా కాంగ్రెస్‌కు మద్దతిచ్చారని చెప్పారు. అలాగే, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పీసీసీ అబ్జర్వర్లు ఇచ్చిన నివేదికలపై బుధవారం ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీనాక్షి సమీక్షించారు. పెద్దపల్లి, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మల్కాజిగిరి మెదక్ లోక్‌సభ నియోజకవర్గాల్లో సమస్యలపై పార్టీ ఎమ్మెల్యేలతో ముఖాముఖి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో కేడర్ పరిస్థితి ఏమిటి, స్థానిక ఎన్నికలకు వెళితే పార్టీ ఏమేరకు విజయం సాధిస్తుందని ప్రశ్నించారు. పెద్దపల్లిపై సమీక్ష సందర్భంగా ఇటీవల మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వంశీకృష్ణ మధ్య ప్రొటోకాల్ వివాదం గురించి మీనాక్షి ఆరా తీశారు. మెదక్ లోక్‌సభ పరిధిలోని నేతలతోనూ సమావేశమైన మీనాక్షి.. సమస్యలపై చెప్పడం ఇష్టం లేకుంటే.. లేఖ రూపంలో ఇవ్వాలని సూచించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ.. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మీనాక్షి నటరాజన్ కూర్చుని అన్నీ సెట్ చేస్తారని పేర్కొన్నారు.

మంత్రి పదవి ఇవ్వాల్సిందే

మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నేత, తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం, రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. దళితుల్లో మాదిగలు 70 శాతం ఉన్నారని, తమ వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని రాహుల్ గాంధీని కోరుతున్నామని వారు చెప్పారు. కాగా, మాలలంతా కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడ్డారని, అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ మాలలకు అన్యాయం చేస్తోందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆరోపించారు. మాల మహానాడు కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మంత్రివర్గ విస్తరణలో మాల వర్గానికి పదవి ఇవ్వాల్సిందేనని అన్నారు.

బిడ్డ ఓడిపోతే ఆర్నెల్లలోనే ఎమ్మెల్సీని చేశారు

దళితులు, బీసీలకు ఉద్యోగాలు అక్కర్లేదా?.. బర్రెలు, గొర్రెలు పెంచుకుంటూ బతకాలా?

మాజీ సీఎం అలాంటి పథకాలే పెట్టారు

ఆయన కుటుంబ సభ్యులకే ఉద్యోగాలిచ్చారు

కులం వల్ల గుర్తింపు రాదు..

చదువుతోనే వస్తుంది: సీఎం రేవంత్‌రెడ్డి



ఓ విద్యార్థినికి ప్రోత్సాహకం అందించి ఆశీర్వదిస్తున్న సీఎం రేవంత్

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు దళితులు, బీసీలు.. బర్రెలు, గొర్రెలు, చేపలు పెంచుకుంటూ బతకాలన్నట్లుగా వ్యవహరించారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయనుకున్న యువత ఆశలపై మాజీ సీఎం నీళ్లు చల్లారన్నారు. ఆయన ఇంట్లో వాళ్లకు మాత్రమే ఉద్యోగాలు ఇచ్చుకున్నారని.. బిడ్డ ఎన్నికల్లో ఓడిపోతే ఆర్నెల్లలోనే ఎమ్మెల్సీని చేశారని, రాష్ట్రంలోని నిరుద్యోగులకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదని గుర్తుచేశారు. 'గత ప్రభుత్వం దళిత, యాదవ పిల్లలను విద్యకు దూరం చేసింది. దళితులు చెప్పులు కుట్టుకోవాలా? యాదవులు గొర్రెలు కాసుకోవాలా? ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా పదేళ్ల నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారు' అని బీఆర్ఎస్‌పై రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 59 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. బుధవారమిక్కడ ఎస్సీ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, ఉత్తమ ఫలితాలు సాధించిన గురుకులాలకు ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేశామన్నారు. కానీ, నోటికాడి కూడును లాగేసినట్లు రాజకీయ కుట్రతో నియామక పత్రాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని విమర్శించారు. పదేళ్లలో గ్రూప్-1 పరీక్షలు కూడా నిర్వహించని పార్టీలు కోర్టుల్లో కేసులు వేశాయన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రాకుండా అడ్డుకుంటున్న వారిని గట్టిగా నిలదీయాలని రేవంత్ పిలుపునిచ్చారు.

విద్యార్థులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది..

విద్యార్థులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'కులం వల్ల ఎవరికీ గుర్తింపు రాలేదు. మంచి చదువుతోనే అందరికీ గుర్తింపు వచ్చింది. ఉస్మానియా చరిత్రలో తొలిసారి దళితుడిని వీసీగా నియమించిన ఘనత మా ప్రభుత్వానిదే. ఈ కోవలోనే పలు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల పదవులతోపాటు అసెంబ్లీ స్పీకర్ పదవిని దళితులు చేపట్టారు. వారికి కులం వల్లే అవకాశాలు రాలేదు. బాగా చదువుకుంటేనే వచ్చాయి' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందన్నారు. కష్టపడి చదివితేనే గొప్ప అవకాశాలు వస్తాయన్నా రు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

6న ఆలేరుకు సీఎం రేవంత్

హైదరాబాద్, తుర్కపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి జూన్ 6న యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు నియోజకవర్గానికి వెళ్లనున్నారు. రూ.1,500 కోట్ల విలువైన పలు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. వాసాలమర్రిలో రూ.700కోట్లతో చేపట్టే గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి, రూ.183కోట్లతో జిల్లా మెడికల్ కళాశాల, రూ.200 కోట్లతో నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.23 కోట్లతో చేపట్టే వేద పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం వాసాలమర్రిలో జరిగే బహిరంగ సభలో సీఎం పాల్గొంటారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. దీనికి సంబంధించిన స్థలంతోపాటు హెలీప్యాడ్, పార్కింగ్ స్థలాలను జిల్లా కలెక్టర్ హనుమంతరావు, వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. సుమారు 50వేల మందితో బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు.

ఎన్టీఆర్.. తెలుగు జాతి కీర్తి శిఖరం: సీఎం రేవంత్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. "తెలుగు జాతి కీర్తి శిఖరం.. తెలుగు వారి ఆత్మగౌరవ చిహ్నం. స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళి" అంటూ ఎన్టీఆర్ ఫొటోతో తన ఎక్స్ ఖాతాలో సీఎం రేవంత్ పోస్టు చేశారు.

ఏది పడితే అది మాట్లాడితే ఎలా?

(మొదటిపేజీ తరువాయి)

నివేదించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ జాతీయ నాయకత్వం సూచన మేరకు కిషన్‌రెడ్డి.. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర పదాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపీ రఘునందన్ రావు వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావిస్తూ వారికి క్లాస్ తీసుకున్నట్టు సమాచారం. "ఒక అంశంపై ఒకాయన మాట్లాడితే, దానిని ఖండిస్తున్నట్టుగా మరో నేత చెబుతారు. ఇదేం పద్ధతి? కొన్నిరోజులుగా రాష్ట్ర పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు జాతీయ నాయకత్వం దృష్టికి వెళ్లాయి. ఎమ్మెల్సీ కవిత కేసీఆర్‌కు రాసిన లేఖపై కొందరు నేతలు ఏవేవో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలోనూ పార్టీకి, ఎంపీ ఈటలకు ఇబ్బంది కలిగించేలా మాట్లాడారు. ఇదెక్కడి పద్ధతి?" అని కిషన్‌రెడ్డి నిలదీసినట్టు పార్టీవర్గాలు తెలిపాయి. జాతీయ పార్టీలో ఉన్న సంగతి కూడా మరిచిపోయి మీడియా ఎదుట ఏదేదో మాట్లాడితే ఎలాగని ప్రశ్నించారని వెల్లడించాయి. ఇలాంటి వ్యాఖ్యలతో ముఖ్యనేతలకు ఇబ్బంది కలుగుతోందని స్పష్టం చేశారని, వివరణ ఇచ్చుకోవాల్సి రావడం తమకు తలనొప్పిగా మారుతోందని అసహనం వ్యక్తం చేశారని పేర్కొన్నాయి.

రాష్ట్రంలో స.హ.చట్టం పనిచేస్తోందా?: రాణిరుద్రమ

సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఆ చట్టాన్ని అమలు చేయకూడదనే నిబంధన ఏదైనా ఉందేమోనని బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ అనుమానం వ్యక్తం చేశారు. దానిపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం పని చేస్తోందా లేదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జనవరి 31న ఆర్థికశాఖ వివరాల కోసం 27 ప్రశ్నలతో బీజేపీ తరపున దరఖాస్తు చేస్తే ఆర్టీఐ నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. దాంతో మార్చి 12న అప్పీలుకు వెళ్లినా.. నేటి వరకు ఎటువంటి సమాధానం రాలేదని తెలిపారు.

ఆరుగురు ఎమ్మెల్యేలను తెస్తా..

మంత్రి పదవి ఇస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చింది. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి సన్నిహిత వర్గాలు మాత్రం కవిత చేరికకు అభ్యంతరం చెప్పాయి. కేసీఆర్ కుటుంబాన్ని చీల్చిన అపవాదును మూటగట్టుకోవాల్సి వస్తుందని, అది ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు తీసుకెళుతుందని అధిష్ఠానానికి చెప్పారు. దాంతో కాంగ్రెస్‌లో కవిత చేరికకు బ్రేక్ పడింది. కవిత కాంగ్రెస్‌తో రాయబారం జరిపిన విషయాన్ని మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రముఖంగా ప్రచురించిన విషయం తెలిసిందే. 'ఆంధ్రజ్యోతి' కథనం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అయితే గత రెండు రోజులుగా 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలపై కవిత రుసరుసలాడారు. కనీసం తనను సంప్రదించకుండా వార్తలు ఇచ్చారని, ఇది జర్నలిజమా, శాడిజమా? అంటూ 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు. కాంగ్రెస్‌తో రాయబారం నెరిపిన విషయంపై కవితతో మాట్లాడేందుకు మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఫోన్‌లో సంప్రదించగా ఆమె స్పందించలేదు. దీంతో కీలక అంశంపై వివరణ ఇవ్వాల్సి వస్తుందనే ఆమె స్పందించలేదనే విషయం స్పష్టమవుతోంది. జరిగింది ఇదైతే ఆమె అసంబద్ధమైన వ్యాఖ్యలతో పోస్టులు పెట్టారు.

కొంత కాలంగా ఉక్కపోత..

బీఆర్ఎస్‌లో కవిత గత కొంతకాలంగా ఉక్కపోతకు గురవుతున్నారు. బీఆర్ఎస్‌లో తనకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదన్న అసంతృప్తితో ఉన్నారు. ప్రధానంగా ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టయి.. బెయిల్‌పై విడుదలైన తరువాత రాజకీయంగా ఆమె ఆశించిన విధంగా రాజకీయ పరిణామాలు లేవు. కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయంటూ కవిత వ్యాఖ్యానించడమే ఇందుకు నిదర్శనం. పైగా సొంత పార్టీలో తీవ్ర వివక్ష, నిరాదరణకు గురవుతున్నానన్న అభిప్రాయం ఆమెలో నెలకొంది. గతంలో ఉన్నంత ప్రాధాన్యం కూడా పార్టీ వర్గాలు, శ్రేణులు ఇవ్వడం లేదని అసంతృప్తితో రగిలిపోతున్నారు. దీనికితోడు బీఆర్ఎస్ రజతోత్సవ సభ అనంతరం ఆమె రాసిన లేఖకు పార్టీ పెద్దల నుంచి ఎటువంటి స్పందన రాలేదు. ఆమె అమెరికా పర్యటన నుంచి వచ్చే ఒకరోజు ముందు లేఖ బయటకు రావడంతో బీఆర్ఎస్‌లో కలకలం రేగింది. ఆ లేఖ తానే రాసినట్లు చెబుతూ కవిత కొన్ని తీవ్రమైన, సంచలన వ్యాఖ్యలు చేశారు. లేఖను ఎవరు బయట పెట్టారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కేసీఆర్ దేవుడంటూనే.. ఆయన చుట్టూ దయ్యాలున్నాయని ఆరోపించారు. పాతికేళ్ల పార్టీలో కుటుంబం నుంచే తొలిసారి ధిక్కార స్వరాన్ని వినిపించారు. దీంతో పార్టీలో ఆమె తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్న విషయం స్పష్టంగా వెల్లడైంది. అనంతరం కవిత వద్దకు.. పార్టీ అధినేత కేసీఆర్ సూచనల మేరకు ఇద్దరు దూతలు వెళ్లి రాయబారం నెరిపారు. ఆ సందర్భంగా పార్టీలో తన ప్రాధాన్యంపై స్పష్టత ఇవ్వాలని ఆమె పట్టుబట్టారు. ఇందుకు అధినేత నుంచి సానుకూలత వ్యక్తం కాకపోవడంతో రాయబారం విఫలమయింది. ఆ మరుసటి రోజే సింగరేణి కార్మికుల కోసం 'సింగరేణి జాగృతి' అనుబంధ



సంఘాన్ని కవిత ఏర్పాటు చేశారు.

బీఆర్ఎస్ లైన్‌కు భిన్నంగా...

కవిత గత కొంతకాలంగా సొంత పార్టీ లైన్‌లో నడవడం లేదని స్వయంగా ఆ పార్టీ వర్గాలే ఆరోపిస్తున్నాయి. ఆమె అడుగులు భిన్నంగా పడుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత కొద్దిరోజులపాటు ఇంటికే పరిమితమయ్యారు. అనంతరం సొంతంగా కార్యక్రమాలు చేపట్టారు. తొలుత జాగృతి ద్వారా కొన్ని కార్యక్రమాలు నిర్వహించారు. అయితే ఆమె వేసిన అడుగులు, తీసుకున్న నిర్ణయాలు బీఆర్ఎస్ అధిష్ఠానానికి ఏమాత్రం మింగుడుపడలేదు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో కవిత పాల్గొన్నారు. సామాన్య ప్రజల మాదిరిగానే ఆమె కూడా సర్వేలో తన కుటుంబ వివరాలన్నింటినీ సర్కారుకు తెలియజేశారు. కానీ, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కుటుంబాలు మాత్రం కులగణన సర్వేలో పాల్గొనలేదు. కవిత సర్వేలో పాల్గొనడం బీఆర్ఎస్‌లో చర్చనీయాంశమైంది. అలాగే బీసీలకు రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించాలంటూ ఆమె బీసీ సంఘాలను కూడగట్టుకొని ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అప్పటికే కాంగ్రెస్ సర్కారు కులగణన పూర్తి చేసి, బీసీ రిజర్వేషన్లపై కసరత్తు మొదలుపెట్టింది. దీని కోసం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన తరువాత తన పోరాటం వల్లనే ఇది సాధ్యమైందంటూ కవిత వ్యాఖ్యానించారు. ఆ తర్వాత ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, 'తెలంగాణ ఏర్పాటైనప్పటికీ.. సామాజిక తెలంగాణ రాలేదు' అని వ్యాఖ్యానించారు. అలాగే భూములున్న రైతులకు రైతుబంధు ఇచ్చారని, భూములు లేని రైతు కూలీలకు ఏ సాయమూ చేయలేదని అన్నారు. ఈ వ్యాఖ్యలు పరోక్షంగా కేసీఆర్ పాలనకు వ్యతిరేకంగా చేసినవే కావడంతో అటు బీఆర్ఎస్‌లోనూ, ఇటు యావత్ తెలంగాణ సమాజంలోనూ తీవ్ర చర్చకు దారితీశాయి. కేసీఆర్‌కు రాసిన లేఖలో బీజేపీ గురించి రెండు నిమిషాలు కూడా మాట్లాడలేదంటూ అధినేత తీరును తప్పుబట్టారు. ఇలా గత కొంతకాలంగా కవిత చేపట్టే కార్యక్రమాలు, వ్యాఖ్యలు, నిర్ణయాలు అన్నీ బీఆర్ఎస్ పార్టీ లైన్‌కు పూర్తి భిన్నంగా ఉన్నాయన్న అభిప్రాయాలు బలపడ్డాయి.

మంత్రి పదవిపై నాటి నుంచే గురి!

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014 ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి ఎంపీగా ఎన్నికైన కవిత.. బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిపాలైన విషయం తెలిసిందే. దీంతో ఆరు నెలల తర్వాత పార్టీ ఆమెను శాసనమండలికి పంపించింది. ఆ తర్వాత ఆమె కేసీఆర్ క్యాబినెట్‌లో మంత్రి పదవి ఆశించారు. కానీ, అప్పటి సమీకరణాల కారణంగా ఆమెకు అమాత్య పదవి దక్కలేదు. ఆ తర్వాత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపాలైంది. దీంతో మంత్రి పదవి కవితకు కలగానే మిగిలిపోయింది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ద్వారా ఆ కలను నెరవేర్చుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది.

బంద్ చేయాలన్నది దిల్‌రాజు సోదరుడే

» హరిహర వీరమల్లుపై కుట్రతోనే వివాదం

» డైవర్ట్ చేయడానికి నన్ను టార్గెట్ చేశారు

» డిస్ట్రిబ్యూటర్ అనుశ్రీ సత్యనారాయణ



రాజమహేంద్రవరం, మే 28(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సినిమా హరిహర వీరమల్లును తొక్కేద్దామనే కుట్రతో థియేటర్ల వివాదాన్ని తెరపైకి తెచ్చారని జనసేన రాజమండ్రి సిటీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి, సినీ డిస్ట్రిబ్యూటర్ (అత్తి) అనుశ్రీ సత్యనారాయణ ఆరోపించారు. హరిహర వీరమల్లు విడుదల తేదీని ప్రకటించిన తర్వాత.. జూన్ 1నుంచి థియేటర్లు బంద్ చేయాలని నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో చెప్పింది దిల్ రాజు సోదరుడు శిరీష్ రెడ్డేనని అన్నారు. థియేటర్ల బంద్ వివాదం నేపథ్యంలో అనుశ్రీ సత్యనారాయణపై దిల్‌రాజు ఆరోపణలు చేయడం, ఆయన్ను పార్టీ నుంచి తాత్కాలికంగా పక్కన పెట్టడం తెలిసిందే. దీనిపై సత్యనారాయణ బుధవారం రాజమహేంద్రవరంలో మీడియాతో మట్లాడారు. 'ఏప్రిల్ 19న ఉమ్మడి తూర్పుగోదావరికి సంబంధించి ఎగ్జిబిటర్ల ఇబ్బందులపై మాత్రమే చర్చించుకున్నాం. బంద్ అనే పదాన్ని నేను వాడలేదు. మే 13న ఓ జర్నలిస్టుకు వివరణ ఇస్తూ.. థియేటర్లు ఇబ్బందుల్లో ఉన్నాయని, ఆర్థికంగా నష్టపోతున్నామని చెప్పాను. పర్సంటేజీ విధానం అమల్లోకి రాకపోతే నష్టాలు భరించలేని వాళ్లు థియేటర్లు మూసేసుకోవడం తప్ప గత్యంతరం లేదని స్పష్టం చేశాను. కానీ.. తమ్ముడు శిరీష్‌రెడ్డిని కాపాడుకోవడం కోసం దిల్‌రాజు నీచానికి ఒడిగట్టారు. నన్ను టార్గెట్ చేశారు. పార్టీకి ముడిపెట్టి మా అధినేతకు తప్పుడు సమాచారాన్ని ఇస్తున్నారు. చిత్ర పరిశ్రమలో వివాదానికి ఆ నలుగురే కారణం. ఆ నలుగురు ఎవరనేది ప్రజలకు స్పష్టత ఇవ్వాలని మంత్రి దుర్గేష్ ఆదేశించడంతో ప్రెస్‌మీట్ పెట్టాను. ఆ నలుగురు ఎవరంటే.. దిల్‌రాజు, ఏషియన్ ఫిల్మ్ సునీల్, శిరీష్ రెడ్డి, సురేశ్‌బాబు. పవన్ కల్యాణ్ మాకు దేవుడితో సమానం. అలాంటి ఆయన సినిమాపై మేం కుట్ర చేస్తామా? నిజాలు త్వరలోనే బయటకు వస్తాయి. ఎగ్జిబిటర్ల మనుగడ అంశంగా 2024 మే 21న తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌లో చర్చ జరిగింది. 73% డిస్ట్రిబ్యూటర్‌కు, 27% ఎగ్జిబిటర్‌కు అని చెప్పారు. జూలై 1 నుంచి ఈ తీర్మానాలను అమలు చేస్తామని శిరీష్‌రెడ్డి తొడగొట్టి మరీ చెప్పారు. గేమ్ చేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలు ఉన్నాయని ఆ తీర్మానాన్ని అమలు చేయలేదు. వాటికి దిల్‌రాజు ప్రొడ్యూసర్ కాగా.. ఓ సినిమాలో సురేశ్‌బాబు తమ్ముడు వెంకటేశ్ హీరోగా నటించారు. అందుకే తీర్మానాలను వాయిదా వేశారు. తూర్పుగోదావరిలో ఎగ్జిబిటర్లకు పర్సంటేజీల సమస్య రెండేళ్ల నుంచీ నలుగుతోంది. హరిహర వీరమల్లు సినిమా సందర్భంగా నేను కుట్ర చేశాననడం కలచివేస్తోంది' అని చెప్పారు.

ఏపీలో థియేటర్లలో తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రదేశం లేకపోవడంతో వాహనదారులు వాటి ఎదుట రోడ్ల పైనే పార్కింగ్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని పీవీఆర్ థియేటర్‌లో వాటర్ బాటిల్‌ను రూ.50కు విక్రయిస్తున్నట్లు తేలింది. తూర్పుగోదావరి జిల్లాలోని పలు థియేటర్లలో టికెట్లు, అల్పాహారం, కూల్‌డ్రింక్స్ ధరలు అధికంగా ఉన్నాయని, పారిశుధ్య నిర్వహణ సరిగాలేదని జేసీ చిన్న రాముడు తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలోని థియేటర్లలో ఆహార పదార్థాలు, కూల్‌డ్రింక్స్ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పలువురు ప్రేక్షకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరు జిల్లాలో నిర్వహించిన తనిఖీల్లో కొన్ని థియేటర్లు లైసెన్స్ లేకుండా నడుస్తుంటే మరికొన్ని ఫైర్ సర్టిఫికెట్ లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ప్రేక్షకులకు కనీసం తాగునీరు ఏర్పాటు చేయడం లేదు. మరుగుదొడ్ల దుర్వాసన వెదజల్లుతున్నాయి. సినిమా టికెట్ రేట్ల కన్నా పాప్‌కార్న్, తినుబండారాల ధరలు అధికంగా ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు ద్విచక్రవాహనానికి రూ.20, కారుకు రూ.40 చొప్పున వసూలు చేస్తున్నట్లు తేలింది. శ్రీకాకుళంలో 'సూర్య మహల్' థియేటర్‌లో పారిశుధ్యం మెరుగ్గా లేకపోవడం.. కూల్‌డ్రింక్‌లను విడిగా విక్రయిస్తుండటం.. ధరలు పట్టిక లేకపోవడం వంటి లోపాలను గుర్తించారు. అలాగే థియేటర్‌లో ఫుడ్ లైసెన్స్ కాలపరిమితి తీరిపోవడంతో థియేటర్ యాజమాన్యానికి నోటీసులు జారీచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. విజయనగరంలోని ఎన్‌సీఎస్ థియేటర్‌లో చిప్స్ ప్యాకెట్‌పై తయారీ తేదీ జూన్ 1గా ముద్రించి ఉండడం చూసి జేసీ సేతు మాధవన్ ఆశ్చర్యపోయారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చాలా థియేటర్లలో నిబంధనలు అమలు కావడం లేదని, అధిక ధరలకు టికెట్లు, తినుబండారాలు విక్రయిస్తున్నారని తనిఖీల్లో వెల్లడైంది. అనంతపురంలోని గౌరీ సినీ కాంప్లెక్స్ నిర్వహణకు అనుమతి 2023 వరకే ఉన్నట్లు గుర్తించారు. అయితే తనిఖీల విషయం ముందస్తుగానే తెలిసిపోవడంతో కొన్ని థియేటర్ల యాజమాన్యాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది.



దండుకునేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

» కమీషన్లు దంచడం కాంగ్రెస్‌కే చెల్లింది: హరీశ్‌రావు

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): అడ్డగోలుగా రూ.వేల కోట్లు దండుకునేందుకే.. కాంగ్రెస్ సర్కారు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పేరిట నాటకమాడుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. 'జలయజ్ఞం నుంచి రెసిడెన్షియల్ స్కూళ్ల వరకు అంచనాలను పెంచడం, కమీషన్లు దంచడం. ఇదే కదా కాంగ్రెస్ మార్కు ప్రజాపాలన?' అంటూ బుధవారం ఎక్స్ వేదికగా ఆయన ఎద్దేవా చేశారు. '20 స్కూళ్ల నిర్మాణానికి రూ.4వేల కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ జీవో ఇచ్చారు. అంటే ఒక్కో స్కూల్ అంచనాలను మూడు రెట్లు పెంచేశారు'అని మండిపడ్డారు. ఆకలిని తీర్చే రైతన్న వడ్లకుప్ప మీదే ఆవిరై పోవాల్సి వస్తోందని హరీశ్ మరో పోస్టులో ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ రైతు హంతక ప్రభుత్వమని విమర్శిస్తూ అన్నదాతల నిరసనల ఫొటోలను పంచుకున్నారు.

ఉద్యమాలకు దక్కిన గుర్తింపు 'పద్మశ్రీ'

» ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ

న్యూఢిల్లీ, మే 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తనకు ఇచ్చిన పద్మశ్రీ పురస్కారాన్ని ఉద్యమాలకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి, శ్రేణులకు దక్కిన గౌరవంగా అభివర్ణించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష్యం కోసం పని చేస్తే గుర్తింపు, గౌరవం వస్తుందనడానికి తనకు వచ్చిన పద్మశ్రీ పురస్కారమే నిదర్శనమన్నారు. ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన ప్రధాని మోదీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఏపీ సీఎం చంద్రబాబుతో సహా మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి మందకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

అర్చక, ఉద్యోగులకు పెన్షన్

» 5 లక్షల ఆరోగ్య బీమా.. అర్చక సంక్షేమ బోర్డు ఆమోదం

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చక, ఉద్యోగులకు ఇతర కార్పొరేషన్ ఉద్యోగుల తరహాలో పదవీ విరమణ అనంతరం పెన్షన్ అందించేందుకు అర్చక సంక్షేమ బోర్డు ఆమోదం తెలిపింది. బుధవారం సచివాలయంలో అర్చక సంక్షేమ బోర్డు ఛైర్మన్ నవీన్ మిత్తల్ నేతృత్వంలో బోర్డు సమావేశం జరిగింది. ఇప్పటి వరకు అర్చక, ఉద్యోగులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే ఆస్పత్రి ఖర్చులకు రూ.2 లక్షల వరకు బోర్డు నుంచి రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారు. ఇకపై అలా కాకుండా రూ.5లక్షల ఆరోగ్య బీమా కల్పించనున్నారు. బీమా ప్రీమియం మొత్తాన్ని బోర్డు నుంచి చెల్లిస్తారు. పదవీ విరమణ చేసిన అర్చక, ఉద్యోగులకు పెన్షన్ చెల్లింపునకు బోర్డు ఆమోదం తెలిపింది. సీనియార్టీని బట్టి రూ.10-20వేల వరకు ప్రతి నెల పెన్షన్ అందించనున్నారు. గ్రాట్యుటీ మొత్తాన్ని రూ.8 లక్షలకు పెంచుతూ బోర్డు తీర్మానించి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం పట్ల అర్చక, ఉద్యోగ జేఏసీ ఛైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ బోర్డు ఛైర్మన్, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెన్షన్‌పొదుపు చేసి..సైన్యానికి 10లక్షల విరాళం

» హైదరాబాద్ మహిళ సింగంసెట్టి అనురాధ పెద్దమనసు


సైనిక అధికారికి డీడీ అందిస్తున్న అనురాధ

అల్వాల్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగి అయిన భర్త మరణం తర్వాత తనకు నెలనెలా అందుతున్న పెన్షన్ నుంచి పొదుపు చేసిన రూ.10 లక్షలను ఓ మహిళ భారత సైన్యానికి విరాళంగా ఇచ్చి పెద్ద మనసు చాటుకున్నారు. హైదరాబాద్, అల్వాల్‌కు చెందిన సింగంసెట్టి అనురాధ.. భర్త ప్రభుత్వ ఉద్యోగి. ఆయన కొన్నేళ్ల క్రితం మరణించారు. అనురాధ దంపతులకు ఉన్న ఇద్దరు కుమారులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వారిలో ఒకరు అమెరికాలో స్థిరపడగా, మరొకరు హైదరాబాద్‌లోనే ఉద్యోగం చేస్తున్నారు. పెన్షన్‌గా తనకు నెలనెలా అందే సొమ్ములో కొంత మొత్తాన్ని పొదుపు చేసిన అనురాధ..ఆ మొత్తం నుంచి రూ.10లక్షలను సైనిక సంక్షేమ నిధికి ఇచ్చారు. ఇందుకు సంబంధించిన డీడీ(డిమాండ్ డ్రాఫ్ట్)ని సికింద్రాబాద్‌లోని తెలంగాణ, ఆంధ్రాసబ్ ఏరియా కార్యాలయంలో బ్రిగేడియర్ నంజుడేశ్వర్, టాసా డిప్యూటీ జీవోసి బ్రిగేడియర్ రాజీవ్‌కు బుధవారం ఆమె స్వయంగా అందజేశారు.

భూరికార్డుల నమోదుకు రూ.9లక్షల లంచం!

» ఏసీబీకి పట్టుబడ్డ ఇబ్రహీంపట్నం ఆర్ఐ

ఇబ్రహీంపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): భూమిని రికార్డుల్లో నమోదు చేయడానికి లంచం డిమాండ్ చేసిన ఆర్ఐని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల గ్రామంలోని సర్వే నెం.355లో ఇమ్మడి శ్రీశైలం అనే వ్యక్తికి 1.16 ఎకరాల భూమి ఉంది. దానిలో ఏడు గుంటల భూమి రికార్డుల్లో తక్కువగా చూపిస్తోంది. ఇదే విషయమై శ్రీశైలం ఆయన కుమారుడు బాలకృష్ణ ఇబ్రహీంపట్నం ఆర్ఐ జి.కృష్ణను సంప్రదించారు. ఆ భూమిని ఆన్‌లైన్ ద్వారా రికార్డుల్లో నమోదు చేయడానికి ఆర్ఐ కృష్ణ రూ.12 లక్షలు డిమాండ్ చేశాడు. పైఅధికారులకు కూడా లంచం ఇవ్వాల్సి ఉంటుందని చెప్పి చివరకు రూ.9 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బాధిత రైతు బాలకృష్ణ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఫోన్‌లోని సంభాషణల ఆధారంగా బుధవారం డీఎస్పీ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జోన్ ఏసీబీ బృందం తహసీల్దార్ కార్యాలయంపై దాడులు నిర్వహించింది. ఆర్ఐ కృష్ణను అదుపులోకి తీసుకుంది.

ఏసీబీకి చిక్కిన ముషీరాబాద్ స్పెషల్ ఆర్ఐ

» ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం రూ.1.10 లక్షల డిమాండ్

కవాడిగూడ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇవ్వడానికి ఓ అధికారి రూ.1.10లక్షల లంచం డిమాండ్ చేసి, అడ్వాన్స్‌గా రూ.25వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సీతాఫల్‌మండిలో నివాసం ఉండే రామకృష్ణ ఓ క్యాంటీన్‌లో పనిచేస్తున్నాడు. తన కుటుంబసభ్యుల్లో మహిళ చనిపోవడంతో ఆమె పేరిట బ్యాంకులో తాకట్టు ఉన్న బంగారాన్ని విడిపించుకునేందుకు ఫ్యామిలీ సర్టిఫికెట్ కావాలని బ్యాంకు అధికారులు రామకృష్ణకు సూచించారు. ఇందుకు అతడు, ముషీరాబాద్ తహసీల్దార్ ఆఫీసుకు వెళ్లి స్పెషల్ ఆర్ఐ భూపాల మహేశ్‌ను కలిసి విషయం చెప్పాడు. దీనికి ఆయన.. రూ.1.10 లక్షలు ఇస్తే వెంటనే పనిచేసి పెడతానని చెప్పాడు. దీంతో రామకృష్ణ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ ఆఫీసులో మహేశ్‌కు రామకృష్ణ రూ.25వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కొంపెల్లిలోని మహేశ్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. మహేశ్ జారీ చేసిన సర్టిఫికెట్లపైనా విచారణ చేపట్టారు.

శిశు విక్రయ ముఠాకు బేడీలు

13 మంది ముఠా సభ్యుల అరెస్టు.. 28 మంది శిశువులను విక్రయించిన గ్యాంగ్

» 10 మంది చిన్నారులను కాపాడిన పోలీసులు

» నల్లగొండ శిశువిహార్‌కు తరలింపు

» అల్లారుముద్దుగా చూసుకున్నామంటూ.. ఎంచుకున్న తల్లిదండ్రుల ఆందోళన


సూర్యాపేటలో శిశు విక్రయాల కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేటక్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులు మొదలు.. నెలల వయసున్న చిన్నారులను విక్రయించే ఘరానా అంతర్రాష్ట్ర ముఠా ఆటను సూర్యాపేట పోలీసులు కట్టించారు. ముఠాలోని 13 మందిని అరెస్టు చేశారు. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ ముఠా ఇప్పటి వరకు 28 మంది శిశువులను విక్రయించగా.. వారిలో 10 మందిని కాపాడి, శిశువిహార్‌కు తరలించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కొత్తపల్లి నర్సింహ వివరాలను వెల్లడించారు. శిశు అక్రమ రవాణాపై ఉప్పందుకున్న పోలీసులు.. ఇటీవల ఇద్దరు చిన్నారులను దత్తత తీసుకున్న దంపతులను అదుపులోకి తీసుకుని, విచారించారు. వారు వెల్లడించిన వివరాలతో సూర్యాపేట పట్టణంలో నివసించే కోడిగుడ్ల వ్యాపారి నక్క యాదగిరి, అతని భార్య ఉమారాణిలను ప్రశ్నించగా.. ఘరానా ముఠా గుట్టు రట్టయింది. బుధవారం ఉదయం వలపన్నిన పోలీసులు 13 మందిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో యాదగిరి, ఉమారాణితోపాటు.. విజయవాడకు చెందిన దంపతులు కోరె రామలక్ష్మి, నాగేంద్రకుమార్, పిల్ల పావని, గరికముక్కు విజయలక్ష్మి, సత్యమణి, ముడావత్ రాజు, ఖాన్ షహీన, శోభారాణి, ఎండీ షహీన, సబావత్ శ్రీనివాస్, ఏర్పుల సునీత ఉన్నారు. వీరంతా ఓ చైన్ మాదిరిగా కలిసి, ముఠాను ఏర్పాటు చేశారని ఎస్పీ వివరించారు. "సూర్యాపేటకు చెందిన నక్క యాదగిరి, ఉమారాణి దంపతులకు పిల్లలు లేరు. దీంతో వారు 28 నెలల క్రితం విజయవాడకు చెందిన నర్సు కోరె రామలక్ష్మి, ఆమె భర్త నాగేంద్రకుమార్‌ను కోరారు. దాంతో వారు పిల్ల పావనిని కలిశారు. ఆమె పిల్లల విక్రయ ఏజెంట్లు-- విజయవాడలోని గొల్లపూడికి చెందిన గరికముక్కు విజయలక్ష్మి, ఏలూరురోడ్డుకు చెందిన ఆముదాలపల్లి సత్యమణి, రాజస్థాన్‌కు చెందిన రియాజ్, నజీర్ ద్వారా రూ.2.50 లక్షలకు యాదగిరి దంపతులకు అహ్మదాబాద్ నుంచి ఓ పాపను తెప్పించి, ఇచ్చారు. అప్పటి నుంచి యాదగిరి దంపతులు పిల్లల విక్రయ ముఠాతో కలిసి పనిచేస్తూ.. గ్రామాల్లో పిల్లలు కావాల్సిన వారిని గుర్తించేవారు. ముఠా ద్వారా వారికి పిల్లలను విక్రయించేవారు. ఈ క్రమంలో.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన పాత నేరస్థుడు ముడావత్ రాజు, కారు డ్రైవర్ సబావత్ శ్రీనివాస్, రాజస్థాన్‌కు చెందిన ఖాన్ షహీన, ఘట్‌కేసర్‌కు చెందిన శోభారాణి, సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన ఎండీ షహీన, సూర్యాపేటలోని గాంధీనగర్‌కు చెందిన నర్సు ఏర్పుల సునీత ముఠాలో సభ్యులయ్యారు. వీరంతా బుధవారం ఉదయం సూర్యాపేటలో ఉన్నట్లు సమాచారం అందుకుని, అరెస్టు చేశాం" అని ఎస్పీ వెల్లడించారు. ఈ ముఠా ఇప్పటి వరకు రాజస్థాన్, అహ్మదాబాద్ నుంచి అక్రమంగా రూ.50 వేలకు ఒకరు చొప్పున నవజాత శిశువులు, నెలల వయసున్న చిన్నారులను కొని, ఇక్కడ రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు విక్రయిస్తుంటారని పేర్కొన్నారు. "ఈ ముఠా ఇప్పటి వరకు 28 మంది శిశువులను విక్రయించింది. వారిలో.. సూర్యాపేట మండలం టేకుమట్లకు చెందిన ఇద్దరు, సూర్యాపేట పట్టణంలో ఇద్దరు, పెన్‌పహాడ్‌లో ఒకరు, నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్‌లో ఇద్దరు, చిన్నసూరారంలో ఒకరు, హైదరాబాద్‌లో ఒకరితో కలిపి మొత్తం 10 మంది పిల్లలను సంరక్షించాం. వీరిలో ముగ్గురు ఆడశిశువులున్నారు. వీరందరినీ నల్లగొండ శిశువిహార్‌కు తరలించాం. మిగతా 18 మంది పిల్లలను కూడా కాపాడుతాం. పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేస్తాం" అని చెప్పారు. ముఠా సభ్యుల్లో ఒకరైన శారత ఇప్పటికే శిశు విక్రయాల కేసులో లఖ్‌నవూ జైలులో ఉన్నారని, విజయలక్ష్మిపై మునగాల, జనగాంతోపాటు.. ఏపీలోని ఏలూరు, మంగళగిరి ఠాణాల్లో కేసులున్నట్లు తెలిపారు. ఈ ముఠాలోని పలువురిపై వేర్వేరు పోలీస్‌స్టేషన్లతోపాటు.. ముంబై సీబీడీలో కేసులున్నట్లు వెల్లడించారు. కాగా.. 10 మంది చిన్నారులను పోలీసులు కాపాడగా.. ఇంతకాలం వారిని పెంచుకున్న తల్లిదండ్రులు సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలను తమకు అప్పగించాలంటూ కన్నీటిపర్యంతం పోలీసులను వేడుకున్నారు. దీంతో కొద్దిసేపు ఠాణా వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపివేయగా.. ఎస్పీ ప్రెస్‌మీట్ విషయాన్ని తెలుసుకుని, జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్నారు. రోదిస్తున్న తమ పెంపుడు తల్లిదండ్రులను చూసి, చిన్నారులు కూడా వారి దగ్గరకు వెళ్లడానికి ఆరాటపడడం చూసే వారిని కలిచివేసింది.

రాష్ట్రమంతటా విస్తరించిన నైరుతి

» ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు

» 5 జిల్లాలకు ఆరెంజ్.. 15 జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ

» ఆదిలాబాద్ జిల్లాలో సత్నాల నదిలో యువకుడి గల్లంతు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో ప్రవేశించిన రెండు రోజుల్లోనే తెలంగాణ అంతటా నైరుతి రుతు పవనాలు విస్తరించాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురు, శుక్రవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని బుధవారం వెల్లడించింది. అలాగే, అక్కడక్కడ గంటకు 40-50 కి.మీ వేగంగా వీచే ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. గురువారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, ఆదిలాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, భారీ వర్షాలు కురిసే 15 జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ చేస్తున్నట్లు వాతావరణ విభాగం పేర్కొంది. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలోని గుండాలలో అత్యధికంగా 12 సెం.మీ వర్షపాతం నమోదైంది. 80 మినహా రాష్ట్రంలోని 612 మండలాల్లో వర్షాలు కురిశాయి. 39 మండలాల్లో అతి భారీ వర్షపాతం, 211 మండలాల పరిధిలో ఓ మోస్తరు వర్షపాతం రికార్డయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ నగర శివారుల్లోని దుండిగల్ వద్ద రైతులు ఎండబోసిన ధాన్యం తడిసి మొలకెత్తింది. ఖమ్మం జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకూ ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవగా 44.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వైరా రిజర్వాయర్ నీటి మట్టం 18.3 అడుగుల నుంచి 14.8 అడుగులకు చేరుకుంది. వికారాబాద్ జిల్లా దోమలో 49.3మి.మీ వర్షపాతం నమోదు కాగా, బషీరాబాద్, బొంరాస్‌పేట మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిముద్దయింది. తాండూరు పట్టణంలో సాయంత్రం రెండు గంటల పాటు వర్షం పడింది. ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షంతో జైనథ్ మండలం సాత్నాల నది ఉప్పొంగింది. ఈ నదిపై నిర్మించిన తాత్కాలిక లోలెవల్ బ్రిడ్జి వరద నీటికి కొట్టుకుపోయింది. దీంతో ఆదిలాబాద్ నుంచి మోటారు సైకిల్‌పై బయలుదేరిన మండలంలోని లక్ష్మీపూర్ వాసి లాండేదత్తు (30).. వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి 40 రోజుల క్రితం తరలించిన ధాన్యం కాంటా పెట్టక పోవడంతో పిచ్చిరాంతండా వాసులు భూక్యా గోరి, భూక్యా ఈరీ అనే మహిళా రైతులు తహసీల్దార్ రమేశ్ బాబు కాళ్లు మొక్కి తమ ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. దంతాలపల్లి మండలం కమ్మరికుంట్లలో కాంటా వేసిన ధాన్యం మొలకెత్తిందంటూ జాతీయ రహదారిపై రాస్తారోకో చేయగా, తమ ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ సూర్యాపేట జిల్లాలోని బొల్లంపల్లి వాసులు రాస్తారోకో చేశారు.

'పోవే పో.. రెండ్రోజుల్లో నీ పని పడతా'

» జీహెచ్ఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్‌పై ఎమ్మెల్యే దానం అనుచరుడి వీరంగం

» ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

బేగంపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): "నువ్వెవరే నాకు లెటర్ ఇవ్వడానికి.. పోవే పో.. నీ లెటర్ నాకు అక్కర్లేదు.. నిన్ను ఎక్కడ నిలబెట్టాలో అక్కడ నిలబెడతా... రెండురోజుల్లో నీ పని చెప్తా.. పోవే.. పో".. మహిళ అని కూడా చూడకుండా జీహెచ్ఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్‌ను దూషిస్తూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరుడు సుదీప్ పటేల్ చేసిన వ్యాఖ్యలివి. జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ కార్యాలయంలోని డిప్యూటీ కమిషనర్ చాంబర్‌లో ఆయన కళ్లఎదుటే సుదీప్‌పటేల్ ఇలా వీరంగం సృష్టించాడు. ఈ నెల 21న జరిగిన దారుణ ఘటన ఆలస్యంగా బయటికి వచ్చింది. హైదరాబాద్ ప్రకాశ్ నగర్‌లోని వెల్కిన్ పార్క్ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా ఉన్న ఆక్రమణలపై జీహెచ్ఎంసీకి ఫిర్యాదులు అందాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీసీపీ సుస్మిత మే 17న ఆ ఆక్రమణలను తొలగించేందుకు సిద్ధమయ్యారు. కానీ, కోర్టు స్టే ఆదేశాలు ఉన్నాయని తెలిసి కూల్చివేతలను విరమించుకున్నారు.ఈ క్రమంలో 21న బేగంపేట సర్కిల్ కార్యాలయానికి వచ్చిన సుదీప్ పటేల్.. కూల్చివేతలు చేపట్టకపోవడంపై డిప్యూటీ కమిషనర్‌ను నిలదీశాడు. ఈ విషయమై సుస్మిత వివరణతో కూడిన లేఖను డీసీకి ఇచ్చేలోపు సుదీప్ పటేల్ రెచ్చిపోయాడు. డిప్యూటీ కమిషనర్ ఎదుటే ఆమెపై తీవ్ర దుర్భాషలాడాడు. దీంతో ఆస్పత్రిపాలైన సుస్మిత.. తనను దూషించిన సుదీప్ పటేల్‌పై చర్యలు తీసుకునేలా పోలీసులకు లేఖ రాయాలని డిప్యూటీ కమిషనర్‌కు లేఖ రాశారు. ఈ మేరకు నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్‌కు లేఖ రాసిన ఆయన.. సుదీప్ పటేల్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈనెల 23న బాధితురాలు సుస్మిత నుంచి ఫిర్యాదు తీసుకున్న వెస్ట్ మారేడ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. సుస్మిత ఇంకా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మస్క్ రాకెట్ మళ్లీ విఫలం

వరుసగా మూడోసారి గాల్లోనే పేలిన స్టార్‌షిప్

టెక్సాస్, మే 28: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ సంస్థ ప్రయోగించిన మెగా రాకెట్ స్టార్‌షిప్ మరోసారి విఫలమైంది. తొలుత సవ్యంగానే నింగిలోకి దూసుకెళ్లినా.. నిర్ణీత కక్ష్యలోకి చేరుకున్న తర్వాత శాటిలైట్లు ఉన్న పేలోడ్ తలుపులు తెరుచుకోకపోవడంతో నియంత్రణ కోల్పోయి గాల్లోనే పేలిపోయింది. స్టార్‌షిప్ రాకెట్ ఇలా గాల్లోనే పేలిపోవడం ఇది వరుసగా మూడోసారి. స్టార్‌షిప్ ప్రాజెక్టులో తొమ్మిదోదైన ఈ ప్రయోగాన్ని అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం 6:36కు టెక్సాస్‌లోని స్పేస్‌ఎక్స్ స్టార్‌బేస్ నుంచి చేపట్టారు. ఈ రాకెట్ ప్రయోగం విఫలమైన విషయాన్ని స్పేస్‌ఎక్స్.. ఎక్స్ వేదికగా ధ్రువీకరించింది. అయినా ఇబ్బందేమీలేదని.. తదుపరి ప్రయోగాల్లో వేగం పెంచుతామని మస్క్ ట్వీట్ చేశారు.

ఎవరెవరి భూమి ఎక్కడెక్కడ?

భూభారతి సర్వేకు శ్రీకారం చుట్టిన ఏజెన్సీలు.. ఆధునిక డ్రోన్లతో సాగు భూముల కొలతలు

» పక్కాగా హద్దుల నిర్ధారణకు 2రకాల సర్వే

» 75ఏళ్ల క్రితంనాటి టీపన్ నక్షాకు స్వస్తి


సంగారెడ్డి జిల్లా షాహెద్ నగర్‌లో భూముల సర్వే కోసం తెచ్చిన డ్రోన్

సంగారెడ్డి, (ఆంధ్రజ్యోతి): మే 28: భూభారతి సర్వే కింద భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టింది. భూముల కొలతలను నిర్ధారించడానికి రాష్ట్రవ్యాప్తంగా ఐదు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకున్నారు. దీని నిర్వాహణ సర్వే ఏజెన్సీలకు అప్పగించారు. ఈ గ్రామాల్లోని భూముల కొలతలు తేల్చడానికి ఆధునిక డ్రోన్లు ఆకాశంలో చక్కర్లు కొడుతున్నాయి. భూ భారతి సర్వే మ్యాపులను సిద్ధం చేయడానికి ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడు, జగిత్యాల జిల్లా బీర్పూరు మండలం కొమ్మనపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్‌నగర్, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నూగూరు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం షాహెద్‌నగర్ గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నారు. ఒక్కో గ్రామాన్ని ఒక్కో ప్రైవేట్ సర్వే ఏజెన్సీకి అప్పగించారు. ప్రస్తుతం ఈ గ్రామాల్లో సర్వే ఏజెన్సీల సిబ్బంది భూముల హద్దులు గుర్తించే పనిలో ఉన్నారు.

ఆకాశంలో ఆధునిక డ్రోన్లు

అచ్చం విమానం ఆకారంలో ఉన్న ఆధునిక డ్రోన్లు సంగారెడ్డి జిల్లా షాహెద్‌నగర్‌లో చక్కర్లు కొడుతున్నాయి. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లోనూ ఇలాంటి విమానపు ఆకారంలో ఉన్న డ్రోన్లతోనే భూముల కొలతలు తేల్చనున్నారు. సాధారణ డ్రోన్ల కన్నా ఈ ఎరోప్లేన్ డ్రోన్లతో భూముల కొలతల్లో కచ్చితత్వం ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం షాహెద్‌నగర్‌లో 21 సర్వే నంబర్లలో 574 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 279 మంది రైతులకు పాస్‌బుక్కులు ఉన్నాయి. ముందుగా గ్రామానికి హద్దులు నిర్ణయించే పనిలో వీరు ఉన్నారు. ఈ గ్రామ బౌండరీలు తేల్చాక సర్వే నంబర్ల వారీగా భూములను కొలిచి మ్యాపులు తయారు చేయనున్నారు. ప్రస్తుతం గ్రామాల శివారు ఆధారంగా అక్కడ పాయింట్లు అమర్చి డ్రోన్లతో కొలతలు వేస్తున్నారు. ఇందులో కచ్చితత్వం ఉందా.. లేదా? అని నిర్ధారించుకోవడానికి డిజిటల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్‌ను వినియోగిస్తారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలోని సర్వేయర్లు ఇదే విధానాన్ని పాటిస్తున్నారు. రెండు రకాల సర్వేలో తేడాలు ఉన్నాయా.. లేక రెండింటిలోనూ ఒకే రకమైన కొలతలు వచ్చాయా? అని తేల్చిన తర్వాతనే మ్యాపులు సిద్ధం చేయనున్నారు.

నక్ష స్థానంలో మ్యాపులు

నిజాం రాజుల కాలంలో గొలుసుల ద్వారా భూముల కొలతలు వేసి ప్రతి గ్రామానికి టీపన్ నక్షా తయారు చేశారు. ఈ టీపన్ నక్షాలో సర్వే నంబర్ల వారీగా భూముల విస్తీర్ణం, గ్రామాల్లోని రహదారులు, బాటలు సైతం ఉంటాయి. గడిచిన 75 ఏళ్లుగా భూముల సర్వేకు టిప్పన్ నక్షే ప్రమాణం. తాజా సర్వేతో ప్రతి గ్రామానికి డిజిటల్ మ్యాపులు సిద్ధం చేయనున్నారు. దీంతో ఇప్పటిదాకా భూములకు ఆధారంగా ఉన్న టీపన్ నక్షా కథ కంచికి చేరనుంది. గ్రామాల హద్దులతోపాటు సర్వేనంబర్ల వారీగా సర్వే పూర్తయిందంటే ఇక టీపన్‌తో పని ఉండదని సీనియర్ సర్వేయర్లు చెబుతున్నారు.

పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధ్యమే!

» నేను సాధించా.. మీరూ సాధించవచ్చు

» అనాథలతో మిస్‌వరల్డ్ క్రిస్టినా ప్లిస్కోవా

» 200 మంది పిల్లలకు రూ.2 కోట్లు సాయం అందించిన 2 సంస్థలు


మాదాపూర్‌లో నిర్వహించిన 'హార్ట్ ఆఫ్ గోల్డ్'లో అనాథలతో సెల్ఫీలు తీసుకుంటున్న సుందరీమణులు

హైదరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): 'చెక్ రిపబ్లిక్‌లోని ఓ గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించా. బాల్యమంతా పంట పొలాల మధ్య గడిపా. మిస్ వరల్డ్ విజేతగా నిలవడం జీవితాశయంగా పెట్టుకున్నా. కష్టపడి దాన్ని సాధించా'అని మిస్ వరల్డ్-24 విజేత క్రిస్టినా ప్లిస్కోవా చెప్పారు. గ్రామీణ నేపథ్యమని, రైతు కుటుంబమని బాధపడుతూ కూర్చుంటే అక్కడే ఉండేదాన్నని.. పట్టుదలతో శ్రమించాను కాబట్టే అనుకున్న లక్ష్యాన్ని సాధించానన్నారు. 'హార్ట్ ఆఫ్ గోల్డ్' పేరిట బుధవారం ట్రైడెంట్ హోటల్‌లో అనాథ పిల్లల కోసం నిర్వహించిన నిధుల సేకరణ కార్యక్రమంలో మిస్ వరల్డ్ ప్రతినిధులు పాల్గొన్నారు. వికారాబాద్, నారాయణపేట జిల్లాల ఐసీడీఎస్ బాల సదన్లలోని అనాథ పిల్లలతో మిస్ వరల్డ్ ప్రతినిధులు ముచ్చటించారు. ఈ సందర్భంగా మిస్ వరల్డ్ క్రిస్టినా ప్లిస్కోవా పిల్లలకు స్ఫూర్తిదాయక సందేశం ఇచ్చారు. 'ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని కష్టపడి పనిచేస్తే మీరు కూడా ఏదైనా సాధించవచ్చు'అని పిల్లలతో చెప్పారు. మిస్ వరల్డ్ పోటీదారులు వారితో కలిసి ఆటలాడుతూ, పాటలుపాడుతూ ఉల్లాసంగా గడిపారు. చిన్నారులతో సెల్ఫీ, వీడియోలు తీసుకున్నారు. లైవ్ బ్యాండ్ సంగీతానికి వారు చిన్నారులతో కలిసి డాన్స్ చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా పార్క్యాన్ హాస్పిటాలిటీ, సుదీక్ష ఎస్టేట్స్ సంస్థలు మిస్‌వరల్డ్ సంస్థతో కలిసి బాలసదన్లలోని 200మంది అనాథ పిల్లలకు ఏడాది పాటు సహాయం చేస్తామని ప్రకటించాయి. 2కోట్ల నిధులు అందించాయి. మిస్ వరల్డ్ ప్రతినిధులు 200మంది చిన్నారులకు ఒక్కొక్కరికి రూ.25వేల విలువైన బహుమతులను అందించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.